





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 52 | మంగళవారం | 20-01-2026 | మహబూబ్‌నగర్

Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


ఫోన్ ట్యాపింగ్ కేసు
మాజీ మంత్రి హరీష్‌రావుకు

## సిట్ నోటీసులు

నేడు తమ ఎదుట హాజరుకావాలని అధికారుల సూచన

03





వామపక్షాల పోరాట ఫలితంగా సాధించుకున్న ఎంజి నరేగాకు బిజెపి సర్కార్ తూట్లు

## ఉపాధి హామీ పథకం పరిరక్షణకు ఉద్యమాలు

- కార్పొరేట్ సంస్థల కోసం పేదల పథకం రద్దు
- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా మండిపాటు

ప్రజాపక్షం/ ఖమ్మం

వామపక్షాల పోరాట ఫలితంగా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని కార్పొరేట్ కు సానుకూలంగా వ్యవహరిస్తూ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర చేస్తుందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. ఉపాధి హామీ పథకం పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం సోమవారం ఖమ్మంలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డి.రాజా మాట్లాడుతూ అనేక ఏళ్ల పాటు వామపక్ష పార్టీలు పోరాడి జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సాధించాయని ఇప్పుడు బిజెపి ప్రభుత్వం రాష్ట్రాలు 40 శాతం వ్యయం భరించాలంటూ పథకానికి తూట్లు పొడుస్తున్నదని తెలిపారు. గ్రామీణ పేదల కోసం తీసుకు వచ్చిన ఈ పథకాన్ని కార్పొరేట్ సంస్థల కోసం రద్దు చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న పశ్చిమబెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, అస్సాం, కేరళ రాష్ట్రాల్లో వివిధ రాజకీయ పక్షాల పరిస్థితిని ఆయన వివరించారు. మతోన్మాద శక్తులను అడ్డుకునేందుకు కలిసి వచ్చే తరువాయి 2లో

### సిపిఐ ఆధ్వర్యంలో నేడు సెమినార్

హాజరుకానున్న వామపక్ష నేతలు రాజా, ఎంఎ బేబీ, భట్టాచార్య, దేవరాజన్

02

## అధికార కేంద్రీకరణకు బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ యత్నం

- అధికార వికేంద్రీకరణను బలంగా విశ్వసిస్తున్న కాంగ్రెస్
- ఓటు హక్కు పౌరుల గళాన్ని ప్రతిధ్వనింపజేస్తుంది
- కోచిలో జరిగిన కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల సభ్యుల మహాపంచాయత్‌లో రాహుల్‌గాంధీ



**కోచి:** బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌లు అధికార కేంద్రీకరణకు ప్రయత్నాలు చేస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. అదేసమయంలో కాంగ్రెస్‌పార్టీ అధికార వికేంద్రీకరణను బలంగా విశ్వసిస్తుందన్నారు. కేరళలోని స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్–యుడిఎఫ్ పనితీరును ఆయన ప్రశంసించారు. గ్రామీణ పునాదిస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం,అధికారాల వికేంద్రీకరణ విధానాన్ని కాంగ్రెస్‌పార్టీ చాలా బలంగా విశ్వసిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. కాంగ్రెస్–బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మధ్య భేదాన్ని ఆయన వివరిస్తూ, కాంగ్రెస్‌పార్టీ అధికార వికేంద్రీకరణకు కట్టుబడి ఉంటే, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌లు అధికార కేంద్రీకరణకు తాపత్రయపడతాయన్నారు. ఓటు హక్కు పౌరుల గళాన్ని ప్రతిధ్వనింపజేస్తుందని, అదే ప్రజాస్వామ్య మౌలిక సూత్రమని, అందువల్ల పౌరులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను, వారి గళాన్ని అనివార్యంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. వారు (బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్) దేశం కోసం ప్రజల సమ్మతిని అడుగుతారుగానీ, భారతదేశ ప్రజాగళ సమ్మతి వారికిఅవసరం లేదని విమర్శించారు. కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల సభ్యుల మహాపంచాయత్‌ను ఉద్దేశించి కోచిలో రాహుల్‌గాంధీ సోమవారం మాట్లాడుతూ, రాజ్యాంగానికి కీలకమైన 73,74వ సవరణలు చేయడం ద్వారా కాంగ్రెస్ అధికారాన్ని పునాదిస్థాయిలో వికేంద్రీకరించి మూడు అంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను దేశంలో అమలులోకి తీసుకువచ్చిందని గుర్తు చేశారు. మహాత్మాగాంధీ జాతీ య గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ)పై బిజెపి నాయకత్వాన ఎన్‌డిఎ కూటమిదాడి చేస్తోందని, ఎందుకంటే స్థానిక ప్రభు త్వ వ్యవస్థల ద్వారా ఈ ఉపాధి హామీ పథకా న్ని అమలు చేస్తున్నందువల్లనే దీనిపై తరువాయి 2లో

## నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

- పోరాడి సాధించిన హక్కులను హరిస్తున్న మోడీ
- ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్



ప్రజాపక్షం/ ఖమ్మం

మోడీ ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చించకుండా పార్లమెంటులో ఎటువంటి ఆమోదం పొందకుండానే నాలుగు లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తెచ్చిందని వాటిని రద్దు చేయాల్సిందేనని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ తెలిపారు. 44 కార్మిక చట్టాల స్థానే నాలుగు లేబర్ కోడ్‌లను కార్మిక సంఘాలతో చర్చించకుండా తీసుకు వచ్చిన రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 10 జాతీయ కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న చారిత్రక సమ్మెకు తరువాయి 2లో



## మేడారం గద్దెలు భక్తులకు అంకితం

- ఆలయ ప్రాంగణం పునఃప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి
- జాతరను ఇంకా అభివృద్ధి చేస్తామని హామీ

ప్రజాపక్షం/ములుగు

మేడారంలో నూతనంగా నిర్మించిన అమ్మవారి గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం భక్తులకు అంకితం చేశారు. ఆదివాసీ సంస్కృతి ఉట్టి పడేలా అత్యద్భుతంగా పునర్నిర్మాణం చేసిన ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి పొందిన మేడారం మహా జాతరను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఆదివారం రాత్రి మేడారంలో బస చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి పనులు, పునర్నిర్మాణం చేసిన ఆలయంలో కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ ప్రాంగణాన్ని ప్రారంభించారు. తొలుత అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కుటుంబ సమేతంగా వన దేవతలను దర్శించుకొని తరువాయి 2లో

## సిఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన

పెట్టుబడుల ఆకర్షణకు స్విట్జర్లాండ్ వెళ్లిన సిఎం బృందం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనకు వెళ్ళింది. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు జయష్ రంజన్, సంజయ్ కుమార్, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, అధికారుల బృందం దావోస్ పర్యటనకు వెళ్లారు. ఈ నెల 20 నుంచి నాలుగు రోజులపాటు దావోస్‌లో జరిగే సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ కంపెనీల సిఇఒలు, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడిదారులు, వివిధ రంగాల ప్రతినిధులతో విస్తృత స్థాయి భేటీలు నిర్వహించనున్నారు. దావోస్‌లో తెలంగాణ పెవిలియన్ వేదికగా గూగుల్, సేల్‌ఫోర్స్, యూనిలీవర్, హ నీవెల్, ఎల్‌ఓరియల్, నోవార్టిస్, టాటా గ్రూప్, డిపి వరల్డ్, ఇన్ఫోసిస్, సిస్కో వంటి ప్రముఖ సంస్థల అధినేతలతో సీఎం విడివిడిగా భేటీ కావడంతో పాటు పలు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొంటారు. తెలంగాణలో పెట్టుబడులు, పరిశ్రమల విస్తరణ, ఐటి, ఎఐ, లైఫ్ సైన్సెస్, తయారీ రంగాల్లో పెట్టుబడులపై ప్రధానంగా చర్చలు జరుపుతారు.'తెలంగాణ రైజింగ్ విజన్– 2047'ను, రాష్ట్రంలో వివిధ రంగాల తరువాయి 2లో

## డిజిటల్ అరెస్ట్.. భయోత్పాతం

- నిమిషాల వ్యవధిలోనే కోట్లు కొల్లగొడుతున్న మోసగాళ్లు
- వివిఐపి, విఐపిలతో పాటు విద్యావంతులు, ఐటి ఉద్యోగులూ బాధితులే
- అప్రమత్తమైన టిజిసిఎస్‌బి



ప్రజాపక్షం/హైదరాబాద్

డిజిటల్ యుగంలో తెలంగాణ ప్రజలు మరో కొత్త ముప్పును ఎదుర్కొంటున్నారు. సాంకేతికతను ఆయుధంగా మార్చుకున్న సైబర్ మోసగాళ్లు ఇప్పుడు 'డిజిటల్ అరెస్ట్' అనే కొత్త పదాన్ని ప్రవేశపెట్టి సామాన్య ప్రజల జీవితాల్లో భయాందోళన సృష్టిస్తున్నారు. నిమిషాల వ్యవధిలోనే కోట్ల రూపాయల్ని కొల్లగొడుతూ, బాధితులను ఆర్థికంగా, మానసికంగా కుదేలుచేస్తున్నారు. బాధితుల్లో వివిఐపి, విఐపిలతో పాటు విద్యావంతులు,ఐటి ఉద్యోగులు ఇలా ప్రతి రంగానికి చెందిన వారు ఉండడం విశేషం.ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ నేరాల్లో డిజిటల్ అరెస్ట్ మోసాలే అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఉద్యోగులు, వ్యాపారులు, వృద్ధులు, మహిళలు ఎవ్వరినీ వదలడం లేదు. ఒక ఫోన్ కాల్‌తో మొదలై, వీడియో కాల్ ద్వారా బెదిరింపులకు దారి తీస్తున్న ఈ మోసాలు ప్రజల నిద్రను హరించేస్తున్నాయి. తెలంగాణలో 2024లో సుమారు 1,14,000 పైగా సైబర్ నేరాలు నమోదు అయ్యాయ. తద్వారా బాధితులు రూ.1,866.9 కోట్లు కోల్పోయారు. ఇక 2025లో 93 వేలకుపైగా సైబర్ ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో డిజిటల్ అరెస్టు పేరుతో రూ.176 కోట్లు నేరగాళ్లు కొల్లగొట్టారు. 2024తో పోల్చితే 2025లో 30 శాతం వరకు తగ్గాయి. 2025లో టిజిసిఎస్‌బి అధికారులు 228 మంది సైబర్ నిందితులను అరెస్టు చేసింది.

**'మీపై కేసు ఉంది'.. భయమే మోసానికి మూలం**

సిబిఐ, ఇడి, పోలీస్, నార్కోటిక్స్ బ్యూరో అధికారులమంటూ నకిలీ ఐడిలతో వీడియో కాల్స్ చేస్తున్నారు. మీ ఆధార్, మొబైల్ నంబర్ అక్రమ లావాదేవీలకు ఉపయోగించారు, మనీ లాండరింగ్ కేసులో మీరు నిందితులు అంటూ తీవ్రంగా బెదిరిస్తున్నారు. ఇప్పుడే సహకరించకపోతే అరెస్ట్, బ్యాంక్ ఖాతాలు సీజ్ అని భయపెట్టడంతో బాధితులు ఆలోచించకుండానే బ్యాంక్ తరువాయి 2లో

## బిజెపి జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ ఎన్నిక!



నేడు అధికారికంగా ప్రకటన : అనంతరం బాధ్యతల స్వీకరణ!

**న్యూఢిల్లీ :** బిజెపి జాతీయ అధ్యక్షుడిగా ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికవనున్నారు. అధ్యక్షుడి పదవి కోసం నితిన్ నబీన్ తరపున 37 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ప్రకటించారు. దిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అధ్యక్షుడు జెపి నడ్డా నితిన్ తరపున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, కిరణ్ రిజిజు, పలువురు బిజెపి ఎంపిలు పాల్గొన్నారు. తర్వాత నితిన్ నబీన్‌కు మద్దతుగా బిజెపి ముఖ్యమంత్రులు, సీనియర్ నేతలు, అన్ని రాష్ట్రాల బిజెపి అధ్యక్షులు లేఖలను తరువాయి 2లో

## అమెరికా తనను శిక్షించేవారే లేరనుకుంటోంది

- ప్రమాదంలో పడిన ఐక్యరాజ్యసమితి ప్రాథమిక సూత్రాలు
- చట్టాలకు కట్టుబడి ఉండేలా అదుపు చేయడంలో ఇబ్బందులు
- సంఘర్షణల పరిష్కారానికి ఐరాసలో సంస్కరణలు తేవాలి
- ఆంటోనీ గుటెర్రెస్ వ్యాఖ్య



**లండన్:** అంతర్జాతీయ చట్టాలకు తన అధికారం అతీతమైనదని అమెరికా భావిస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ విమర్శించారు. బిబిసి '4 టుడే' కార్యక్రమంలో పాల్గొన్న గుటెర్రెస్ మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల మధ్య సమానత్వం–సమితి వ్యవస్థాపక ప్రాథమిక సూత్రాలు ఈనాడు అత్యంత ప్రమాదంలో పడ్డాయని తాను నమ్ము తున్నానని ఆయన స్పష్టం చేశారు. సంస్థ ప్రాథమిక సూత్రాలు, చట్టాలకు ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు కట్టుబడి ఉండేలా అదుపు చేయడంలో తాను చాలా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుటెర్రెస్ అంగీకరించారు. ప్రపంచదేశాల సమస్యలను పరిష్కరించడానికి ఐక్యరాజ్యసమితి నిబద్ధతతో కట్టుబడి ఉందని, కానీ దానికి ఎలాంటి పరపతీ లేదన్నారు. పెద్ద శక్తులకు (బలమైన దేశాలు)బలమైన పరపతి ఉందని అన్నారు. ఈ పెద్ద శక్తులకు ఉన్న బలమైన పరపతి ప్రపంచంలో వస్తున్న సంఘర్షణలకు నిజమైన, శాశ్వత తరువాయి 12లో



## విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా ప్రతి ఇల్లూ మారాలి

- సోలార్ మోడల్ విలేజ్ దేశంలోనే విప్లవాత్మక కార్యక్రమం
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/ బోనకల్

ప్రతి ఇల్లు, వ్యవసాయ పెంపు సెట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారాలని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సోలార్ మోడల్ విలేజ్ కార్యక్రమం దేశంలోనే కాదు ప్రపంచంలో ఓ విప్లవాత్మక కార్యక్రమం అని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం బోనకల్ మండలం రావినూతల గ్రామంలో డిప్యూటీ సిఎం సోలార్ మోడల్ విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి చేసిన సోలార్ విద్యుత్‌ను గృహ వినియోగదారులు, వ్యవసాయదారులు వాడుకున్నంత వాడుకుని మిగిలినది రాష్ట్ర విద్యుత్‌శాఖకు అమ్ముకునేలా రాష్ట్ర ప్రభుత్వం తరువాయి 12లో

## సాంకేతిక నైపుణ్యంతో యువతకు ఉపాధే లక్ష్యం

మంత్రులు గడ్డం వివేక్, జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం / చెన్నూర్ /కాగజ్ నగర్

ప్రజలతో మమేకమై ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర మంత్రులు గడ్డం వివేక్, జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండల కేంద్రంలో రూ.47 కోట్ల 11 లక్షలతో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ పనులకు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ మాట్లాడుతూ యువతకు సాంకేతిక నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో రూ.40 కోట్లతో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. అర్హులైన తరువాయి 12లో



## అమెరికాపై ఇయు ప్రతీకార సుంకాలు!

గ్రీన్‌లాండ్‌పై మిత్రభేదం



బ్రస్సెల్స్ : గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించే విషయంలో అమెరికాను వ్యతిరేకించిన యూరప్ దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు (టారిఫ్) విధించడంతో తాజాగా యూరోపియన్ యూనియన్ కూడా ప్రతీకార సుంకాలు అమలు చేసే ఆలోచన చేస్తోంది. అమెరికాపై 93 బిలియన్ పౌండ్ల (108 బిలియన్ డాలర్లు) మేరకు ప్రతీకార సుంకాలు విధించేందుకు యూరోపియన్ కూటమి దేశాలు సిద్ధమవుతున్నాయని చైనా పత్రిక వెల్లడించింది. యూరోపియన్ యూనియన్ కూటమి మార్కెట్‌లోకి అమెరికా కంపెనీలను అడ్డుకోవడంద్వారా కూటమి దేశాలకు కలుగుతున్న బాధ ఏమిటో ట్రంప్‌కు రుచి చూపించేందుకు ఆ దేశాలు సన్నద్ధమవుతున్నాయని చైనా విశ్లేషకులు పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసేవిషయంలో నాటో కూటమిలో కూడా విభేదాలు మొదలవుతున్నాయి. యూరప్ దేశాలు ట్రంప్ ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించడంతో దాదాపు పది దేశాలపై అదనంగా పదిశాతం సుంకాల భారం వచ్చేనెల ఒకటో తేదీ నుండి ట్రంప్ యంత్రాంగం అమలుచేసేందుకు సిద్ధపడుతోంది. ఈ దశలో అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ గ్రీన్‌లాండ్ సమస్యపై తీవ్రంగా స్పందిస్తూ, "యూరోపియన్ దేశాలు బలహీనతలను అంచనావేస్తున్నాయి, కానీ అమెరికా మాత్రం బలాన్ని అంచనావేస్తోంది, అందువల్ల శత్రువులను అదుపు చేసేందుకు ముందుజాగ్రత్తగా అడ్డుకునేందుకు గ్రీన్‌లాండ్‌లో కీలక ఆయుధాలను మోహరించేందుకు ఆ దీవి అమెరికా అధీనంలో ఉండాల్సిందే"అన్నారు. యూరప్ యూనియన్ బలహీనపడితే కఠినంగా, బలవంతులతో జాగ్రత్తగా ఉన్నప్పటికీ వ్యాపారాలు పునఃమూల్యాంకనానికి గురవుతున్నాయని, అవి కాల పరీక్షకు తట్టుకుని నిలబడాల్సి ఉందని చైనా రాజకీయ నిపుణుడు ఒకరు విశ్లేషించారు.

## దక్షిణ చిలీలో కార్చిచ్చు :18 మంది మృతి



**పెంకో :** దక్షిణ చిలీలో కార్చిచ్చు బీభత్సం సృష్టించింది. ఈ మంటలలో 18 మంది నివాసితులు ప్రాణాలు కోల్పోయారు. వేల ఎకరాలు అటవీ ప్రాంతం దగ్ధం కాగా, వందలాది ఇళ్లు ఈ కార్చిచ్చు కారణంగా నివాసయోగ్యం కాకుండా బూడిదయ్యాయని అధికారులు చెప్పారు. చిలీలో విపరీతమైన వేడి వాతావరణం ప్రజలకు సమస్యలు తెచ్చిపెడుతోందని కూడా చెప్పారు. దక్షిణ శాంటియోగో చుట్టూ 500 కి.మీ. పరిధిలో సెంట్రల్ బయో బయో రీజియన్, నూబుల్ రీజియన్‌లలో విధ్వంసకర పరిస్థితులు తలెత్తినట్లు దేశాధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ అధికారిక ప్రకటన చేశారు. ఇప్పటివరకూ 8,500 హెక్టార్ల (21,000 ఎకరాలు) ప్రాంతాన్ని కార్చిచ్చు మింగేసింది. బాధితులకు, మృతులకు దేశాధ్యక్షుడు తీవ్ర సంతాపం ప్రకటించారు. వారికి తన సంఘీభావం తెలియజేశారు. సైన్యాన్ని రంగంలోకి దించారు.

# స్పెయిన్‌లో పట్టాలు తప్పిన హైస్పీడు రైలు

## ఎదురుగా వస్తున్న రైలుతో ఢీ – 39 మంది మృతి

**మాడ్రిడ్:** స్పెయిన్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 39 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. వీరిలో 11 మంది పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌కు వెళ్లేందుకు మలగా నుండి బయలుదేరిన హైస్పీడు రైలు గంట ప్రయాణం తర్వాత అదమజ్ వద్ద పట్టాలు తప్పి పక్కనే పట్టాలపై రెండు బోగీలు అడ్డంగా పడ్డాయి. అదే సమయంలో ఎదురుగా వస్తున్న అదముజ్ రైలు ఆ బోగీలను ఢీకొట్టింది. అదామజ్ వద్ద ఈ ఘోర ప్రమాదం సంభవించింది. పట్టాలు తప్పి బోల్తా పడిన మాడ్రిడ్ నుండి హుయెల్వాకు వెళుతున్న రెండో రైలు ముందుబోగీల్లోని ప్రయాణికులే ఈ ప్రమాదంలో ఎక్కువమంది మరణించారు. ప్రమాదస్థలంలో అత్యవసర సహాయ చర్యలు కొనసాగుతూ ఉన్నందువల్ల పూర్తిస్థాయి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు ప్రకటించారు. అత్యవసర వైద్య బృందాలు 112 మందికి చికిత్సలు చేసి పంపేశాయి. ఐదుగురు పిల్లలు సహా మరో 48 మంది ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. 11 మంది పరిస్థితి ప్రమాదకరంగా ఉండగా వారిని అత్యవసర సేవా విభాగంలో ఉంచి చికిత్స చేస్తున్నారు. రెండు రైళ్లు ఒకే సరళరేఖలో ఉన్న సమయంలో జరిగిన ప్రమాద ఘటన చాలా విచిత్రంగా ఉందని రవాణామంత్రి ఆస్కార్ పుయెంటే అన్నారు. రైలు పట్టాలు తప్పడానికి గల కారణాలు తెలియలేదని, దర్యాప్తు ప్రారంభించామని, ఈ వివరాలు తెలిసేందుకు కనీసం ఒక నెల సమయం పడుతుందని చెప్పారు. ఈ మరణాల సంఖ్యను పూర్తిగా ధృవీకరించలేదని స్పష్టం చేశారు. ఐర్యో సంస్థ నడుపుతున్న హైస్పీడు రైలులో 300 మంది ప్రయాణికులు ఉండగా, ఎదురుగా వస్తున్న ప్రభుత్వ రైలులో 200 మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. సజీవంగా ఉన్నవారు తక్షణం తమ బంధువులను సంప్రదించాలని, తాము సజీవంగానే ఉన్నట్లు సోషల్ మీడియా ద్వారా పోస్టింగులు పెట్టాలని అందాలుసియాలోని అత్యవసర విభాగ సంస్థ ఒక ప్రకటనలో కోరింది. "మీ కుటుంబ సభ్యులు, ప్రియతములు, మీ శ్రేయోభిలాషులూ ఆందోళన చెందుతూ ఉంటారు, అందువల్ల సజీవంగా ఉన్నవారు వెంటనే సోషల్ మీడియా ద్వారా పోస్టింగ్స్ పెట్టండి, ఇలాంటి వారందరికీ లైన్లు అన్నీ ఉచితంగా సేవలు చేస్తాయి'' అని అండలూసియా అత్యవసర సంస్థ సోషల్ మీడియాలో



ఒక పోస్టింగ్ పెట్టింది. "ఇవి చాలా బాధాకరమైన క్షణాలు, సమాచార లోపం వల్ల బంధువులు, ప్రియమిత్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు" అని స్పానిష్ రెడ్‌క్రాస్ సంస్థకు చెందిన మిగ్యుల్ ఏంజెల్ రోడ్రిగ్జ్ ఆర్డిన్ ద్వారా తెలిపారు. ఇసిసిఎం (ఈక్వాలిటీ-ప్రిపేర్డ్‌నెస్-క్రైసిస్ మేనేజ్‌మెంట్) యూరోపియన్ కమిషనర్ మాట్లాడుతూ, స్పానిష్ అధికారులతో తాము సంప్రదింపులు చేస్తున్నామని, అవసరమైతే మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. హైస్పీడు రైలులో ప్రయాణం చేస్తున్న ఆర్‌టివిఇ జర్నలిస్టు సాల్వడార్ జిమెనెజ్ మాట్లాడుతూ, తాను మొదటి బోగీలో ఉన్నానని, ఒక్కసారిగా భూకంపం వచ్చిందని భావించామని, కానీ రైలు పట్టాలు తప్పిందన్నారు.



## పోర్చుగల్ ఎన్నికల్లో సోషలిస్టుల ఆధిక్యం

వచ్చేనెల 8న తుది విడత పోరు

**లిస్బన్:** లైబీరియన్ ద్వీపకల్పంలో ఉన్న దక్షిణ యూరప్ దేశం పోర్చుగల్‌లో అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో సోషలిస్టులు ముందంజలో ఉన్నారు. సెంటర్-లెఫ్ట్-సోషలిస్టుపార్టీకి చెందిన అభ్యర్థి ఆంటోనియో సెగురో, మితవాదపార్టీ నాయకుడు ఆండ్రే వెంచురా ఇద్దరూ రెండో విడత (రన్నాఫ్) పోరుకు సిద్ధమయ్యారు. వీరిద్దరూ అధ్యక్ష పదవికి నువ్వా-నేనా అనే రీతిలో పోటీ పడటంతో తుది విడత సమరం తప్పడంలేదు. ఏ అభ్యర్థికీ మొదటి విడత లెక్కింపులో 50 శాతం ఓట్లు లభించలేదు. దీంతో ఫిబ్రవరి 8వ తేదీన తుది విడత ఎన్నికలు నిర్వహిస్తారు. 1986కు ముందు ఒకసారి అధ్యక్ష పదవికోసం రెండోవిడత సమరం జరిగింది. ఆ తర్వాత మళ్లీ 50 సంవత్సరాలకు ఇప్పుడు అదే పరిస్థితి ఏర్పడింది. ఐతే మొదటిసారి ఒక మితవాద నాయకుడు పోటీలో ముందుకు దూసుకువచ్చారు. దేశంలో ఎట్టిపరిస్థితుల్లోనూ వలస ప్రజలకు స్థానం ఇవ్వబోమని మితవాద నాయకుడు వెంచురా ప్రజలకు వాగ్దానం చేసి ముందుకు రెండో స్థానంలోకి దూసుకువచ్చారు.అధ్యక్ష పదవికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో సెగురోకు 31.1 శాతం ఓట్లు లభించగా, వెంచురాకు 23.5 శాతం ఓట్లు లభించాయి. వ్యాపార వర్గాలకు అనుకూలుడైన లిబరల్ అభ్యర్థి జోవో కోటిమ్ డి.ఫిగ్యురెవో 16 శాతం ఓట్లతో మూడవస్థానంలో నిలిచారు. సోషలిస్టుపార్టీ నాయకుడు ఆంటోనియో జోస్ సెగురో,మితవాదపార్టీ నాయకుడు ఆంద్రే వెంచురా, సోషల్ డెమోక్రటిక్‌పార్టీ (పిఎస్‌డి) నాయకుడు మార్క్వెస్ మెండెస్ మధ్య ప్రధాన పోటీ జరిగింది. ఐతే ఈ ఎన్నికల్లో మొత్తం 45 మంది అధ్యక్ష పదవికోసం పోటీపడ్డారు.

# వచ్చేనెల 8న జపాన్ ఎన్నికలు

ఈ వారంలోనే పార్లమెంటు రద్దు



**టోక్యో:** జపాన్ పార్లమెంటును ఈ వారంలోనే రద్దు చేస్తారు. ఆ దేశ మొదటి మహిళా ప్రధానమంత్రి సనే తకైచీ ఈ విషయం చెప్పారు. ఫిబ్రవరి 8వ తేదీన జపాన్ పార్లమెంటుకు మెరుపు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కోరుకున్నవిధంగా దేశంలో తన ఆర్థిక, సాంఘిక సంస్కరణల విధానపరమైన ఎజెండాను అమలు చేసేందుకు వీలుగా ప్రజల నుండి బలమైన మెజార్టీ ఆశిస్తున్నందువల్ల ఈ ఎన్నికలు నిర్వహించాలని తకైచీ భావిస్తున్నారు. దేశంలో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్‌డిపి) ఇటీవలికాలంలో ప్రజాదరణ కోల్పోయింది. కానీ పార్టీని ఆమె విజయపథంలో నడిపించాలని కోరుకుంటున్నారు. అందుకే ఎన్నికలకు వెళుతున్నారు. తమ పార్టీగానీ, తానుగానీ బలమైన ప్రజా తీర్పునకు అర్హులమా? కాదా? అనే విషయం తెలుసుకోవడానికే సార్వభౌమాధికార ప్రజాతీర్పు కోరుతున్నామని సోమవారం పత్రికాగోష్టిలో తకైచీ చెప్పారు. సనే తకైచీ ప్రధానమంత్రి పదవికిఅర్హురాలా? కాదా? అనే విషయం ప్రజలను అడిగి తెలుసుకోదలిచామని ఆమె అన్నారు. జనవరి 23వ తేదీన పార్లమెంటును నిర్ణీత ప్రకారం రద్దుచేస్తారు. జనవరి 27వ తేదీ నుండి దేశంలో ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుంది. తకైచీకి చెందిన ఎల్‌డిపి కొన్ని అవాంతరాలు మినహా నిరాఘాటంగా అనేక దశాబ్దాలుగా జపాన్‌ను పాలిస్తోంది. ప్రస్తుతం అధికార కూటమిలో ఎల్‌డిపితోపాటు జపాన్ ఇన్నోవేషన్ పార్టీ (జెఐపి) కూడా భాగస్వామిగా ఉంది. ఈసారి జరిగే ఎన్నికల్లో ఎల్‌డిపి పూర్తిగా తనంతట తానుగా మెజారిటీ సంపాదించుకుంటే ఎవరిమీదా ఆధారపడకుండా తన పార్టీ కోరుకున్నవిధంగా ఆర్థిక ఎజెండాను, ఇతర సంస్కరణలను అమలు చేయాలని ఎల్ డిపి గట్టిగా భావిస్తోంది.

## చైనాలో గత ఏడాది 17 శాతం క్షీణించిన జననాలు



**బీజింగ్:** చైనాలో జననాలు వరుసగా నాలుగో సంవత్సరంలో కూడా గణనీయస్థాయిలో తగ్గిపోయింది. 2025లో చైనా జనాభా దాదాపు 10 మిలియన్ల మేరకు (కోటి) క్షీణించింది. చైనా చరిత్రలోనే ఇది అత్యంత క్షీణత. అంతకుముందు చైనా జనాభాలో విపరీతమైన పెరుగుదల ఉండేది. తర్వాత ఒకే కుటుంబం ఒకే బిడ్డ అనే విధానాన్ని చైనా అమలు చేసింది. చైనా నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2025లో చైనాలో 7.92 మిలియన్ల మంది జన్మించారు. అంతకుముందు 2024లో 9.24 మిలియన్లు జన్మించారు. అంటే దాదాపు 17 శాతం మేరకు జననాలు క్షీణించాయి. 1949లో గణాంకాలను లెక్కించడం ప్రారంభించిన తర్వాత నమోదైన అతి తక్కువ జననాల శాతం ఇదే. ఐక్యరాజ్యసమితిలోని ఆర్థిక,సామాజిక వ్యవహారాల విభాగం అంచనాల ప్రకారం 200 సంవత్సరం నాటికి చైనా జనాభా 633 మిలియన్లకు క్షీణిస్తుంది. 2025లో చైనా జనాభా 30.30 లక్షల మేరకు తగ్గిపోయిందని ఎన్‌బిఎస్ తాజా గణాంకాలు వెల్లడించాయి. చైనాలో ఇప్పుడు వయోవృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

## పరిరక్షణకు ఉద్యమాలు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలతో కలిసి పనిచేయాలని రాజా కోరారు. మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చిందని దీనిని నిరసిస్తూ ఫిబ్రవరి 12న 10 జాతీయ కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా జాతీయ కౌన్సిల్‌లో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ఢిల్లీ లో వా యుకాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరిందని దీని ని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. నిపుణులతో చర్చించి దీనిపై కమ్యూనిస్టు పార్టీ ఒక కార్యాచరణ ప్రకటిస్తుందన్నారు. శతాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించిన ఖమ్మంజిల్లా సమితితో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సిపిఐ శాఖలను జాతీయ కార్యవర్గం అభినందించింది. జాతీయ కార్యవర్గంలో ఎన్నికలు జరగనున్న పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల ప్రతినిధులు చర్చించారు. కార్యవర్గంలో చర్చించిన నిర్ణయాలను మంగళ, బుధవారాల్లో జరిగే జాతీయ కౌన్సిల్‌లో చర్చించి కార్యాచరణ ప్రకటించనున్నారు. ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో నేడు సెమినార్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఖమ్మం ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో జాతీయ స్థాయి సెమినార్ ఏర్పాటు చేసినట్లు సిపిఐ శతాబ్ది ఉత్సవాల ఆహ్వాన సంఘ కార్యదర్శి బాగం హేమంతరావు తెలిపారు. నేటి భారతదేశం వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సెమినార్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా, సిపిఎం జాతీయ కార్యదర్శి ఎంఎ బేబీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్‌ఎస్‌పి జాతీయ కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కార్యదర్శి డి.దేవరాజన్ తో పాటు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పాల్గొంటారని హేమంతరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సెమినార్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు బిజెపి తీరుతో పాటు వామపక్షాలు పురోగమనానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై వక్తలు ప్రసంగించనున్నారన్నారు. ఈ సెమినార్‌లో సిపిఐ జాతీయ నాయకత్వంతో పాటు పల్లా వెంకటరెడ్డి, రామకృష్ణ, జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నారాయణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎపి కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు పాల్గొంటారన్నారు.

## భక్తులకు అంకితం

(మొదటి పేజీ తరువాయి)



ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడారం జాతను ఎక్కడా లేని విధంగా రూ.252 కోట్లతో నిధులు మంజూరు చేసి మేడారం జాతరను ఒక అద్భుతంగా రూపుదిద్దడం జరిగిందని, అలాగే సమ్మక్క సారలమ్మ గద్దెలను పూర్వ వైభవం తేవడం జరిగిందని ఆయన అన్నారు. రాబోయే రోజులలో మేడారం జాతరను ఇంకా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా జాతరలో పనులు జరిగాయని మేడారం సమ్మక్క సారలమ్మ గద్దెలను అద్భుతమైన రీతిలో కట్టడం జరిగిందని ఆయన అన్నారు. 7.35 గంటలకు మేడారంలోని హెలిప్యాడ్1కి, 7.40 గంటలకు హెలిక్యాప్టర్ ద్వారా మేడారం నుండి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మంత్రులందరూ పాల్గొని సమ్మక్క సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ధనసరి అనసూయ(సీతక్క), అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 25న రవీంద్రభారతిలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యతను బలంగా చాటిచెప్పడమే లక్ష్యంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్న జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 25న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించనున్నారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి తెలిపా రు. ఉదయం 11 గంటలకు గవర్నర్ ఓటరు చైతన్య జ్యోతిని వెలిగించి ఈ వేడుకలను లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. ఈ ఏడాది జాతీయ థీమ్ మై ఓట్ ఐయామ్ ఇండియా నినాదాన్ని ఎంచుకున్నటు ఆయన వెల్లడించారు. ముఖ్యంగా తొలి ఓటర్లు, యువతలో అవగాహన పెంపొందించడం ఈ వేడుకల ప్రధాన లక్ష్యమని వివరించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (రిటైర్డ్) ఐ. రాణి కుముదిని, హాజరౌతారని తెలిపారు. పలువురు విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.ఈ ఏడాది లక్ష్యం అప్రమత్తమైన, పరిశీలనాత్మకమైన, నిజాయితీ గల ఓటరును తీర్చిదిద్దడం,ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే మా ప్రయత్నం అని సీఈవో సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.వేడుకల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞ స్వీకరణ, అవార్డుల ప్రధానం, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

## ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చాయని ఆమె తెలిపారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మోడీ సర్కార్ ప్రజలను, కార్మిక సంఘాలను చివరకు పార్లమెంటును కూడా గౌరవించే పరిస్థితిలో లేదన్నారు. మోడీ ప్రభుత్వానికి కేవలం ఇద్దరు మాత్రమే కనిపిస్తున్నారని అందులో ఒకరు అదానీ, మరొకరు అంబానీ అన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ సంస్థలకు మేలు చేయాలని మోడీ సర్కార్ భావిస్తుందన్నారు. భారతదేశంలో రాజ్యాంగం స్థానే కార్పొరేట్ వ్యవస్థను తీసుకు రావాలని మోడీ సర్కార్ ప్రయత్నిస్తుందని అమర్‌జిత్ ఆరోపించారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఈ నాలుగు లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆమె తెలిపారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కరువవుతుందని, సోషల్ సెక్యూరిటీ ఉండదని, పెన్షన్, గ్రాడ్యుటి ఉండవని ఆమె తెలిపారు. ప్రభుత్వం అబద్ధాలు చెబుతుందని గతంలో ఉన్న చట్టాల ద్వారా వచ్చిన హక్కులను ఈ నాలుగు లేబర్ కోడ్స్ హరించివేస్తున్నాయన్నారు. ఇప్పటికే కార్మికులకు యాజమాన్యాలు సరైన భద్రత కల్పించడం లేదని వృత్తిలో పనిచేస్తూ ప్రాణాలు కోల్పోయిన పరిహారం అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బ్రిటిష్ పాలనలో సైతం కార్మిక సంఘాలు పోరాడి హక్కులు సాధించుకున్నాయని బ్రిటిష్ పాలన కంటే మోడీ పాలన మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు. పని గంటల కాలాన్ని పెంచేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఇప్పుడు అదనపు పనికి అదనపు వేతనమని చెబుతున్న అది అమలు జరగడం లేదన్నారు. లేబర్ కోడ్స్ విషయంలో నలుగురు కేంద్ర మంత్రులు మారారని కేంద్ర కార్మిక మంత్రి డా॥ మన్సుఖ్ మండవియా చివరి లేబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చారన్నారు. కరోనా సమయంలో వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆమె తెలిపారు. లేబర్ కోడ్స్‌ను భారత దేశంలో యావత్ విపక్షం వ్యతిరేకించిందని అయినా మోడీ ప్రభుత్వం అమలుకు పూనుకుందన్నారు. భారత కార్మిక చట్టాలు ఒకప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయ్యాయని కౌర్ తెలిపారు. 1920లో ఏర్పాటైన ఎఐటియుసి స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించిందని లాలాలజపతి రాయ్, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, వివి గిరి లాంటి వారు ఎఐటియుసికి అధ్యక్షులుగా పనిచేశారని భారతదేశంలో ఏర్పాటైన తొలి కార్మిక సంఘం ఎఐటియుసి మాత్రమేనన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి సాధించిన హక్కులను హరించి వేస్తున్నారని ఆమె తెలిపారు. కార్మికుల హక్కుల గురించి ప్రశ్నిస్తే విధి రాతను బట్టి జీవితం నిర్ణయించబడుతుందని మనస్మృతిని గుర్తు చేస్తున్నారని ఆమె తెలిపారు. భవిష్యత్తులో ఐక్యంగా పోరాడాలని ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మె సందర్భంగా అన్ని సంఘాలు ఐక్యంగా బంద్‌కు పిలుపునిచ్చాయని తెలిపారు. రైతు సంఘాలు, ఎల్‌ఐసి, బ్యాంకింగ్, రైల్వేతో పాటు అసంఘటిత రంగ కార్మికులు సైతం సార్వత్రిక సమ్మెకు మద్దతుగా నిలుస్తున్నారని ఆమె తెలిపారు. నాలుగు లేబర్ కోడ్స్‌పై సభలు, సమావేశాలు, ఆందోళనల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షుడు ఎండి యూసుఫ్, ఎఐటియుసి నాయకులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, గాదె లక్ష్మి నారాయణ, రామాంజనేయులు, శివరామకృష్ణ, సిహెచ్ సీతామహలక్ష్మి పాల్గొన్నారు.

## భయోత్పాతం

(మొదటి పేజీ తరువాయి)

వివరాలు, ఓటీపీలు, స్క్రీన్ షేరింగ్‌కు అంగీకరిస్తున్నారు. అదే వారి పతనానికి కారణమవుతోంది.

**క్షణాల్లో ఖాతాలు ఖాళీ..**

ఒక్కసారి మోసగాళ్ల చేతికి డిజిటల్ యాక్సెస్ వెళ్ళగానే, ఖాతాలు ఖాళీ కావడం కేవలం సమయ ప్రశ్నగా మారుతోంది. కొన్ని ఘటనల్లో రూ.50 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు నష్టం జరిగినట్లు పోలీసు వర్గాలు అంగీకరిస్తున్నాయి. జీవితాంతం కూడబెట్టిన పొదుపు, వ్యాపార మూలధనం, రిటైర్మెంట్ నిధులు కళ్లముందే మాయమవుతున్నాయి.

**అంతర్రాష్ట్ర–అంతర్జాతీయ ముఠాల హస్తం..**

ఈ మోసాల వెనుక అంతర్రాష్ట్రమే కాదు, అంతర్జాతీయ సైబర్ ముఠాలు పనిచేస్తున్నట్లు దర్యా ప్తు సం స్థలు చెబుతున్నాయి. వర్చువల్ నంబ ర్లు, నకిలీ అధికారిక లోగోలు, నకిలీ ఐడీలు ఉపయోగిస్తూ ప్రజలను నమ్మిస్తున్నారు. చట్టపరమైన పరిజ్ఞానం లేని వారు సులభంగా వలలో పడుతున్నారు.

**'పోలీసుల పేరుతోనే మోసం' – నమ్మకం దెబ్బతింటోంది..**

పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థల పేర్లు వినగానే సాధారణ పౌరుడు భయపడటం సహజం. అదే భయాన్ని మోసగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఫలితంగా ప్రజల్లో వ్యవస్థలపై నమ్మకం దెబ్బతింటోంది. పోలీసుల పేరుతోనే మోసం జరుగుతుంటే ఎవరిని నమ్మాలి? అన్న ప్రశ్న బాధితుల నోటి నుంచి వినిపిస్తోంది.

**హెచ్చరికలు ఉన్నా అవగాహన లోపమే కారణమా?..**

ప్రభుత్వం, సైబర్ పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నప్పటికీ, ఈ మోసాలు ఆగడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, వృద్ధులు, కొత్తగా డిజిటల్ బ్యాంకింగ్ వాడుతున్నవారు ఎక్కువగా లక్ష్యంగా మారుతున్నారు.సాంకేతిక పరిజ్ఞానం లోపం, భయం, ఆతురత— ఈ మూడు కలిసి మోసగాళ్లకు అవకాశంగా మారుతున్నాయి.ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. మీడియా, పౌర సమాజం కూడా బాధ్యతగా ప్రజలను చైతన్యపరచాలి. లేనిపక్షంలో, 'డిజిటల్ అరెస్ట్' అనే ఈ కొత్త ఉచ్చు మరిన్ని కుటుంబాల జీవితాలను అంధకారంలోకి నెట్టే ప్రమాదం ఉందన్నది చేదు నిజం.

**టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ సూచనలు**

ఏ ప్రభుత్వ సంస్థ వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయదు. ఫోన్‌లో కేసుల విచారణ జరగదు.ఒటిపిలు, బ్యాంక్ వివరాలు, స్క్రీన్ షేరింగ్ ఎప్పటికీ చేయరాదు. అనుమానాస్పద కాల్ వచ్చిన వెంటనే 1930కు ఫోన్ చేయాలి. లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలి.అప్రమత్తతే అసలైన రక్షణ. డిజిటల్ యుగంలో సౌకర్యాలతో పాటు ప్రమాదాలూ పెరిగాయి. చట్టాలు, టెక్నాలజీ ఎంత బలంగా ఉన్నా, ప్రజల అప్రమత్తత లేకపోతే మోసాలు ఆగవు అని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ పేర్కొన్నారు.

## బిజెపి–ఆర్ఎస్ఎస్ యత్నం

(మొదటి పేజీ తరువాయి)

దాడి జరుగుతోందని విమర్శించారు. గ్రామీణస్థాయిలో వికేంద్రీకరించిన అధికారాలను కాపాడటంకోసమే రాజ్యాంగాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారు. ప్రముఖ మలయాళ రచయిత ఎం.లీలావతితో ఒక అవార్డు కార్యక్రమంలో పంచుకున్న అభిప్రాయాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, 98 ఏళ్ళ వయసుగల ఆ రచయిత్రి ''నిశ్శబ్ద సంస్కృతి''ని కోరుకుంటున్నారని, కానీ బిజెపి–ఆర్ఎస్ఎస్ రెండూ దేశంలో ప్రజల నోరు మూయించేందుకు సైద్ధాంతిక దాడి చేస్తున్నాయని విమర్శించారు. ''భారతదేశం నోరు తెరవకూడదని వారు కోరుకుంటున్నారు, భారతదేశం తనను తాను వ్యక్తీకరించుకోవాలని వారు కోరుకోవడంలేదు, కొన్ని వాణిజ్య, వ్యాపార సస్థలకోసం ఈ దేశం సంపదను సృష్టించాలని వారు కోరుకుంటున్నారు'' అన్నారు. ఐతే జాతి ఆస్తులను దేశంలో ఎంపిక చేసిన కొద్దిమంది చేతుల్లో పెట్టడంకోసమే ప్రజల నోరు మూయించాలని చూస్తున్నారని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. బిజెపి కేరళ రాష్ట్ర ప్రజల నోరు మూయించలేదని, వారు ఎన్నికల తీర్పు ద్వారా మాట్లాడతారని అన్నారు. అదేవిధంగా కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, యుడిఎఫ్ కూటమి బలమైన పనితీరు ప్రదర్శించిందని, ప్రత్యేకించి పంచాయతీస్థాయి ఎన్నికల్లో మంచి పనితీరు చూపించిందన్నారు. స్థానిక సంస్థలోని అన్ని స్థాయిలలోనూ యుడిఎఫ్, కాంగ్రెస్ కూటమి బ్రహ్మాండమైన పనితీరు చూపించిందని, పంచాయతీ ఎన్నికల ఫలితాలపై తానెంతో సంతోషంగా ఉన్నానన్నారు. ఢిల్లీలో చర్చల సందర్భంగా సీనియర్ నాయకులమధ్య భిన్నాభిప్రాయాలు కనిపించినప్పటికీ స్థానిక ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందని తాను ఎంతో విశ్వాసంతో ఉన్నానన్నారు. విజయం తర్వాత ఏం చెయ్యాలన్నదే కాంగ్రెస్–యుడిఎఫ్ ఎదుట ఉన్న అతిపెద్ద ప్రశ్న అన్నారు. కేరళలో భారీ ఎత్తున నిరుద్యోగం తాండవిస్తోందని, దీనికి యుడిఎఫ్ కూటమి సమాధానం చెప్పాలన్నారు. ఏ ప్రభుత్వం విజయవంతం కావాలన్నాగానీ ప్రజలతో మమేకం కావాల్సి ఉంటుందన్నారు.

## దావోస్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధికి ఉన్న అనుకూలతలను దావోస్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పాలని ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ పర్యటన ద్వారా తెలంగాణను ప్రపంచ పెట్టుబడి గమ్యస్థానంగా మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని సిఎం కార్యాలయం తెలియజేసింది. సిఎం రేవంత్ రెడ్డి 2025లో జరిగిన ప్రపంచ ఆర్థికవేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పాల్గొని రూ.1.84 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించారు. ఈ పెట్టుబడుల ఒప్పందాలతో దాదాపు 46 వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని గతంలో సిఎం కార్యాలయం ప్రకటించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్ రూ.60 వేల కోట్ల పెట్టుబడితో ఎఐ, క్లౌడ్ సర్వీసెస్ డేటా సెంటర్లు ఏర్పా టు, సన్ పెట్రో కెమికల్స్ 5440 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటు, రూ.45,500 కోట్ల పెట్టుబడి, 7,000 ఉద్యోగాలు, వెల్నెస్ రిసార్ట్ రూ.15,000 కోట్ల పెట్టుబడి, 5,250 మందికి ఉపాధి, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్ ఏర్పాటు, స్కైరూట్ ఏరో స్పేస్ రూ.500 కోట్ల పెట్టుబడితో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు, మేఘా ఇంజనీరింగ్ కామారెడ్డి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్ ఏర్పాటు, హెచ్‌సిఎల్ టెక్ సెంటర్ హైటెక్ సిటీలో కొత్త క్యాంపస్, 5,000 మందికి ఉపాధి, విప్రో హైదరాబాద్‌లో విస్తరణ, 5,000 మందికి ఉద్యోగాలు, ఇన్ఫోసిస్ పోచారంలో ఐటి క్యాంపస్ విస్తరణ, రూ.750 కోట్ల పెట్టుబడి, 17,000 ఉద్యోగాలు, యూనిలివర్ కంపెనీ రాష్ట్రంలో కొత్త తయారీ యూనిట్ ఏర్పాటు తదితర పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి.

## నితిన్ నబిన్ ఎన్నిక!

(మొదటి పేజీ తరువాయి)

రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా బిజెపి పార్లమెంటరీ బోర్డు తరపున కూడా నితిన్ నబీన్‌కు మద్దతుగా నామినేషన్ అందించారు. మొత్తం 37 నామినేషన్లు చెల్లుబాటు అయినట్లు రిటర్నింగ్ అధికారి లక్ష్మ ణ్ ప్రకటించారు. ఉపసంహరణకు గడువు ఉన్నందున నితిన్ ఎన్నికను మంగళవారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అనంతరం నితిన్ నబీన్ బిజెపి జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణం చేయనున్నారు.

# కమ్యూనిస్టులకు పురోగమన సంకేతమిచ్చిన ఖమ్మం సభ

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జనవరి 18న ఆదివారం నిర్వహించిన ప్రదర్శన, బహిరంగ సభ కమ్యూనిస్టులకు పురోగమన సంకేతాలు ఇచ్చింది. కమ్యూనిస్టు క్యాడర్ ఉత్తేజాన్ని, భవిష్యత్తు పోరాటాలకు కార్యోన్ముఖులను చేసింది. మారిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి కదిలి వచ్చి కమ్యూనిస్టు పార్టీ యేడల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ప్రదర్శన, బహిరంగ సభ సందర్భంగా ఖమ్మంకు వచ్చే దారులన్నీ సభకు వచ్చే వాహనాలతో కిటకిటలాడాయి. ఖమ్మం నగరంలో ఎటు చూసినా ఎర్ర దళాలే నడుస్తూ కనిపించాయి. జనసేవాదళ్ కవాతు, ప్రజా సంఘాల కళారూపాల ప్రదర్శన నాభూతో నాభవిష్యత్తు అన్న రీతిలో సాగింది. వేల మంది జనసేవాదళ్ శిక్షణ పొందిన యువ కామ్రేడ్స్ కవాతు చేస్తుంటే కమ్యూనిస్టు వ్యతిరేకుల గుండెల్లో లబ్‌డబ్ మనడం ఆగి లెఫ్ట్ రైట్ ప్రతిధ్వనించింది. జన సమీకరణ, ప్రదర్శన జరిగిన తీరు బహిరంగ సభ విషయాలకు మించి కమ్యూనిస్టుల పురోగమనంపై విస్తృత చర్చ సాగుతుంది. ఏదో ఒక రకంగా తాయిలాలు ఇస్తే రాజకీయ సభలకు ప్రజలు హాజరుకాని పరిస్థితుల్లో తామే వాహనాలను ఏర్పాటు చేసుకుని బహిరంగ సభకు హాజరుకావడం కమ్యూనిస్టుల పని అయిపోయిందనుకునే వారికి ఖమ్మం సభ ఓ సమాధానం ఇచ్చింది. దశాబ్దాల పాటు పార్టీలో పని చేసిన వారు వయో భారాన్ని లెక్క చేయక సభకు హాజరై పార్టీ పట్ల తమకున్న అంచలంచెల విశ్వాసాన్ని చాటారు. పార్టీ కార్యకర్తలు చెట్ల కింద చేరి వంటలు చేసుకున్న తీరు దశాబ్దాల కిందటి ఘటనలను స్ఫూరణకు తెచ్చింది. కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావమే ఓట్లు, సీట్లు కాదని ప్రజల హక్కులు, సంక్షేమానికేనని వందేళ్ల ప్రస్థానం రుజువు చేసింది. కమ్యూనిస్టుల శకం ముగిసిందంటూనే కమ్యూనిస్టులను చూసి భయపడుతున్న



మతశక్తులు సిపిఐ వందేళ్ల ప్రస్థానం తర్వాత గ్రహించాల్సిన అనేక విషయాలు ఉన్నాయి. సిపిఐ ఆవిర్భావం నాడు పరాయి పాలనలో ప్రజలు స్వేచ్ఛ కోసం తపిస్తున్న రోజులు. కనీస హక్కులు, శ్రమకు తగిన వేతనం దక్కకపోవడం అన్నింటికి నిర్బంధం అధికంగా ఉంది. ప్రజల స్వేచ్ఛ కోసమే 1925లోనే సిపిఐ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చింది. స్వాతంత్ర్య పోరాటంలో కీలక భూమిక పోషించిన సిపిఐ భారతదేశం నడిబొడ్డున స్వతంత్ర రాజుగా ప్రకటించుకున్న నిజాంను గద్దె దించి ఈ విముక్తి చేసేందుకు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చింది. చర్విత చరణ కాదు కాని కమ్యూనిస్టుల సాయుధ పోరాటం లేకుంటే నిజాం రాజ్యం మరో కశ్మీర్‌లా దేశం నడిబొడ్డున రగులుతూనే ఉండేది. స్వాతంత్ర్య అనంతరం కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు పురుడుపోసుకున్నాయి. అందుకే అధికారం లేకున్నా తమ పక్షాన నిలిచి పని చేస్తున్న సిపిఐని ప్రజలను ఆదరిస్తున్నారు. నోట్లు, ఓట్లు, సీట్లు రాజకీయాలలో వెనకడవచ్చు కానీ ప్రజల పక్షాన మరో వెయ్యేళ్లయినా పోరాడేందుకు కమ్యూనిస్టులకు ఖమ్మం సభ ఊతమిచ్చింది. సిపిఐ ఆవిర్భావం నాటి పరిస్థితుల కంటే దారుణమైన పరిస్థితులు నేడు దేశంలో నెలకొన్నాయి. లౌకికవాద దేశంలో మతం పాలనలో భాగమైంది. రాజకీయ లబ్ధి, అధికార కాంక్ష, మత రాజకీయాలను ప్రోత్సహిస్తుంది. సువిశాల దేశంలో దేశ సంపద కొందరి చేతుల్లో పోగుపడుతుంది. 99 శాతం మంది దగ్గర ఉన్న సంపాద కంటే ఒక్క శాతం ప్రజల వద్ద ఉన్న సంపాద అనేక రెట్లు ఎక్కువగా ఉంది. ఇది భవిష్యత్తులో ఆందోళనకు దారి తీయవచ్చు. సంపన్న వర్గాలు ప్రజలను తమ గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నంలో తిరుగుబాటుకు దారి తీస్తుంది. అన్నింటికి మించి స్వాతం త్ర్యం పూర్వం నాటి పరిస్థితులు దేశంలో పెరిగిపోతున్నాయి. ప్రజల స్వేచ్ఛ హరించబడుతుంది. తెల్లదొరల మాదిరిగానే తమను ప్రశ్నించే వారికి ఏదో ఒక ముద్ర వేసి నిర్బంధాలకు గురి చేస్తున్నారు. 150 కోట్లకు చేరుకున్న జనాభాలో సగ భాగం కలిగిన యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక నిర్వీర్యమవుతుంది. భారతదేశం నిరుద్యోగ భారత్ గా మారిపోతుంది. ఇదే సమయంలో యువశక్తి దారి తప్పి సమాజానికి ఇబ్బందికర పరిస్థితులను సృష్టిస్తుంది. వీటన్నింటిపై పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమే. అధికారం లేనప్పుడు ఏమి చెప్పినా అధికారంలోకి వచ్చిన తర్వాత గత పాలకుల అడుగులలోనే అడుగులు వేస్తున్న నేపథ్యంలో మిగిలిన రాజకీయ పక్షాలకు భిన్నంగా ప్రజల కోసం పనిచేసే కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుంది. మునుపెన్నడు లేని రీతిలో కార్పొరేట్ శక్తులు ప్రభుత్వాన్ని నడిపిస్తున్న తరుణంలో కమ్యూనిస్టు వ్యతిరేకులకు కమ్యూనిస్టులుంటే బాగుండు వారు ఉండాలి, బలపడాలి అన్న భావన పెరుగుతుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు కమ్యూనిస్టులు ఖమ్మం సభ ద్వారా ఒక సంకేతం ఇచ్చారు. ప్రజల పక్షాన మేమున్నాం అని నేతలు భరోసా ఇస్తే మీ వెనక మేము ఉన్నామంటూ సభకు తరలి వచ్చిన ప్రజలు చాటి చెప్పారు. పురోగమనం తథ్యమన్న సంకేతం శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ.

**– ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం**

# పేద ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

### నిమ్స్‌లో అత్యాధునిక స్టెమ్ సెల్ ల్యాబ్ ప్రారంభం : మంత్రి దామోదర్ రాజనర్సింహ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేద ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. నిమ్స్‌లో ఏర్పాటు చేసిన స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ఆదివారం మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంలో భాగంగా ప్రముఖ బయోటెక్నాలజీ సంస్థ, అమెరికాకు చెందిన తులసి థెరప్యూటిక్స్ సహకారంతో నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్ ను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు ఈ ల్యాబ్‌ను సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలంటే... ఒక పెద్ద వృక్షానికి విత్తనం ఎంత ముఖ్యమో, మన శరీరానికి ఈ స్టెమ్ సెల్స్ అంతే ముఖ్యమని, విత్తనం నుంచి మహా వృక్షం తయారు అయినట్టే, స్టెమ్ సెల్స్ నుంచి కొత్త కణాలను, అవయవాలను తయారు చేసుకోవచ్చని వివరించారు. మన శరీరంలో ఏదైనా భాగం దెబ్బతిన్నప్పుడు లేదా జబ్బు చేసినప్పుడు, ఆ భాగాన్ని రిపేర్ చేసే అద్భుతమైన శక్తి ఈ కణాలకు ఉంటుందని, మందులతో నయం కాని మొండి వ్యాధులను కూడా నయం చేయగలిగే శక్తి ఈ స్టెమ్ సెల్స్‌కు ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధులు, తలసేమియా వంటి జబ్బులతో బాధపడేవారికి ఈ చికిత్స సంజీవని లాంటిదని మంత్రి వెల్లడించారు. ఆయా వ్యాధుల వల్ల శరీరంలో దెబ్బతిన్న కణజాలాన్ని మళ్ళీ కొత్తగా సృష్టించేందుకు ఈ చికిత్స ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం స్టెమ్ సెల్ చికిత్స కొన్ని కార్పొరేట్ హాస్పిటల్స్‌లోనే అందుబాటులో ఉందని, అది కూడా లక్షల రూపాయల ఖర్చుతో కూడుకుని ఉంటుందన్నారు. సామాన్య ప్రజలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో నిమ్స్‌లో స్టెమ్ సెల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం ఈ ల్యాబ్‌లో ప్రధానంగా స్టెమ్ సెల్స్‌పై లోతైన పరిశోధనలు జరుగుతాయని, వీటిని తులసి థెరప్యూటిక్స్, నిమ్స్ డాక్టర్లు పరిశోధనలు చేయనున్నారని తెలిపారు. ఈ పరిశోధనల ఫలితంగా, భవిష్యత్తులో నిమ్స్‌లోనే పేద పేషెంట్లకు అతి తక్కువ ఖర్చుతో స్టెమ్ సెల్ థెరపీ అందించగల్గనున్నామని త్వరలోనే ఈ ల్యాబ్ రీసెర్చ్ ఫలాలు ప్రజలకు అందుతాయని ఆశిస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ్ అన్నారు.

# శతాబ్ది ఉత్సవాలు ఘనవిజయం




### లక్షలాది మంది కష్టజీవులు పాల్గొనడం పట్ల ఎఐకెఎస్ హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖమ్మం నగరంలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాలు చారిత్రాత్మక విజయవంతం కావడం పట్ల తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) రాష్ట్ర నాయకత్వం హర్షాన్ని వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని నలుమూలల నుంచి కష్టజీవులు, రైతులు, కార్మికులు, డాక్టర్లు, లాయర్లు, విద్యార్థులు, యువత, మహిళలు లక్షలాదిగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారన్నారు. ఈ సందర్భంగా ఏఐకెఎస్ రాష్ట్ర నాయకత్వంలోని భాగం హేమంత్ రావు, పశ్య పద్మ, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, వెంకటరెడ్డి, మందాడపు రాణి సోమవారం రైతు సంఘం నాయకులు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. రైతులు పంచలు కట్టుకుని, పచ్చ కండువాలు తలకు చుట్టుకుని, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) కండువాలను మెడలో వేసుకుని, నాగలిని భుజంపై పెట్టుకుని ప్రదర్శనలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని తెలిపారు. కొప్పోజు సూర్యనారాయణ, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, కంబాల శ్రీనివాస్, దొడ్డ వెంకటయ్య, ప్రభు లింగం, కంజర భూమయ్య, కొల్లూరి రాజయ్య, దేవ భక్తుని సంధ్య, నెల్లూరు నాగేశ్వరరావు, సి.హెచ్. దశరథ, సంజీవరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మాధవ రెడ్డి, రవీందర్ రెడ్డి తదితరుల నాయకత్వంలో రైతుల ప్రదర్శన సాగిందని తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేసిన రైతులు, కష్టజీవులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, కార్యకర్తలందరికీ ఏఐకెఎస్ రాష్ట్ర నాయకత్వం కృతజ్ఞతలు తెలిపింది. కమ్యూనిస్టు ఉద్యమ వందేళ్ల ప్రస్థానం భవిష్యత్ పోరాటాలకు కొత్త ఉత్తేజాన్ని ఇచ్చిందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాడుతామని ఈ సందర్భంగా నాయకులు చెప్పారు.

# మాజీ ఎంపి సంతోశ్ రావుపై ఇడికి రమ్యరావు ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోశ్ రావు భూ అక్రమాలపై విచారణ జరపాలని కెసిఆర్ అన్న కూతురు, కాంగ్రెస్ నేత రమ్యరావు సోమవారం డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని ఇడి అధికారులను స్వయంగా కలిసిన రమ్యారావు.. సంతోశ్రావుతో పాటు ఆయన టీమ్ సభ్యులపై ఫిర్యాదు చేశారు. ఓ డాక్యుమెంట్ ఫైల్స్‌తో ఇడి కార్యాలయంలోకి వెళ్లిన ఆమె సంతోశ్ రావు భూకుంభకోణాలకు సంబంధించిన కీలక ఆధారాలను ఇడికి సమర్పించినట్లు అధికారులతో భేటీ అనంతరం మీడియాతో చెప్పారు. సంతోశ్ రావు ఆయన టీమ్ సభ్యులు మహిళలతో పాటు అనేక మందిని బెదిరించి భూ అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆస్తులపై లోతైన దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ అధికారం కోల్పోయినా తాము ఇంకా అధికారంలో ఉన్నట్లుగానే భావిస్తూ తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు, తశీల్దార్ స్థాయి అధికారులను మేనేజ్ చేసుకుంటూ నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఆస్తులు ట్రాన్స్ ఫర్ చేసుకున్నారని ఆరోపించారు. అక్రమంగా భూదందాలు చేస్తూ వాటిలో వచ్చిన డబ్బును లిక్కర్ స్కామ్లో పెట్టారని ఆరోపించారు. మరో రెండు మూడు రోజుల్లో మరోసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి వీళ్ల అవినీతి బాగోతం మొత్తం వివరిస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎంతగానో గౌరవించి అభిమానించే సుమిత్ర ఆంటీ కోడలు సుచరిత రెడ్డిని సైతం సంతోశ్ రావు అండ్ టీమ్ అన్యాయం చేశారని ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే సిబిఐ, ఎసిబికి ఫిర్యాదు చేశామని ఇప్పుడు ఇడికి ఫిర్యాదు చేశామన్నారు. సంతోశ్ రావు ఆయన టీమ్ భూదందాల నుంచి వచ్చిన డబ్బులే లిక్కర్ దందాకు బదిలీ చేశారని ఆమె ఆరోపించారు.




సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ పక్షాన రాష్ట్ర శాఖ యూనిట్‌కు రూ.లక్ష విరాళం ఇచ్చారు.

# మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో స్క్రీనింగ్ కమిటీల ఏర్పాటు

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** త్వరలో జరగబోయే మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్ల ఎన్నికలలో కాంగ్రెస్ తరపున పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కోసం టిపిసిసి ఆధ్వర్యంలో స్క్రీనింగ్ కమిటీల ఏర్పాటు చేసినట్లు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతి పార్లమెంట్‌కు ఇంచార్జ్ మంత్రి చైర్మన్‌గా, పార్లమెంట్ పరిధిలోని డిసిసి అధ్యక్షులు కన్వీనర్‌లుగా, పార్లమెంట్ నియోజక వర్గంలోని ఎంపి, ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు, సీనియర్ నాయకులు కమిటీ మెంబర్లుగా ఉంటారని చెప్పారు.

టికెట్ల ఎంపికలో కమిటీదే కీలకపాత్ర ఉంటుందని మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



ఖమ్మంలో సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వర్‌రావును మర్యాదపూర్వకంగా కలుసుకున్న తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రజాపక్షం జర్నలిస్టులు

# మాజీ మంత్రి హరీష్‌రావుకు సిట్ నోటీసులు

### ఫోన్ ట్యాపింగ్ కేసులో

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్‌రావుకు సోమవారం సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు నోటీసులో పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కలవరం మొదలైంది. ఈ కేసులో ఇప్పటి వరకు పోలీసు అధికారులను సిట్ అధికారులు విచారించారు.ఈ కేసులో ఇప్పటి వరకు సిట్ అధికారులు ఎస్ఐబి డిఎస్‌పి డి.ప్రణీత్‌రావు,అదనపు ఎస్‌పిలు ఎన్.భుజంగరావు, తిరుపతన్న,టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావులను అరెస్టు చేశారు. ప్రస్తుతం వీరంతా బెయిల్‌పై విడుదలయ్యారు. ఇటీవలే ఈ కేసులో ఎ1 ముద్దాయిగా ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును సుప్రీంకోర్టు అనుమతులతో పాలుమార్లు విచారించారు. ప్రభాకర్‌రావు అరెస్టుపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతుంది. ఇదిలావుండగా మాజీ మంత్రి హరీష్‌రావుకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేయడం చర్చానీయాంశంగా మారింది.ముందు జాగ్రత్త చర్యగా జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సీనియర్ ఫొటో జర్నలిస్టు విద్యాసాగర్ హఠాన్మరణం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సీనియర్ ఫొటో జర్నలిస్టు ఎం.విద్యాసాగర్ (63) హఠాన్మరణం చెందారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అప్పటికే విద్యాసాగర్ మరణించినట్టు వైద్యులు ధృవీకరించారు. విద్యా సాగర్ కు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. విద్యాసాగర్ నమస్తే తెలంగాణ పత్రికలో సీనియర్ ఫొటోజర్నలిస్టుగా పనిచేసి రిటైర్ అయ్యారు. గతంలో ఉషోదయం, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఎపి టైమ్స్, హిందీ మిలాప్, వార్త పత్రికల్లో పని చేశారు. విద్యాసాగర్ మరణవార్త తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర ఫొటోజర్నలిస్టుల సంఘం అధ్యక్షులు ఎ.గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విద్యాసాగర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. విద్యాసాగర్ మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఫొటోజర్నలిస్టుల సంఘం నాయకులు కె.అనిల్ కుమార్, నక్కా శ్రీనివాసులు, రజనీ కాంత్, శ్రీనివాస్, బిహెచ్‌ఎంకె.గాంధీ, సలీం, జాన్, సుధీర్ తదితరులు సంతాపాన్ని, ఆయన కుటుం సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# సత్ఫలితాలిస్తోన్న సీ -మిత్ర

### పది రోజుల్లోనే 1000 మంది బాధితులకు ఫోన్ కాల్స్
### 200 ఫిర్యాదు డ్రాఫ్టులను సిద్ధం చేసిన వర్చువల్ పోలీసులు
### ఇప్పటివరకు 100 ఎఫ్ఐఆర్‌ల నమోదు
### సీ-మిత్ర పనితీరుపై బాధితుల హర్షం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేర బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు హైదరాబాద్ పోలీసులు చేపట్టిన వినూత్న కార్యక్రమం 'సీ మిత్ర' సత్ఫలితాలను ఇస్తోంది. దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ఈ విధానం అమల్లోకి వచ్చిన కేవలం పది రోజుల్లోనే వందల మందికి భరోసానిచ్చింది. ఈ స్వల్ప వ్యవధిలో సీ మిత్ర బృందం 1000 మంది బాధితులకు స్వయంగా ఫోన్ చేసి, వారి సమస్యలను అడిగి తెలుసుకుంది. రోజుకు సగటున 100 ఫోన్ కాల్స్ చేస్తున్నారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో 200 మందికి పక్కాగా ఫిర్యాదు డ్రాఫ్టులను సిద్ధం చేసి పంపింది. వారి నుంచి సంతకం చేసిన ప్రతులు అందగానే, ఎక్కడా జాప్యం లేకుండా 100కి పైగా ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. గంటల తరబడి స్టేషన్లలో పనిలేకుండా, నిమిషాల్లోనే వర్చువల్ పోలీసులు స్పందిస్తుండటం, ఎఫ్ఐఆర్ కాపీలు నేరుగా మొబైల్‌కే వస్తుండటంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఇంటి నుంచే ఫిర్యాదు.. ఫోన్‌కు ఎఫ్ఐఆర్ కాపీ


సైబర్ నేర బాధితులు 1930 నంబరుకు, జాతీయ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సరిపోతుంది. ఆ వెంటనే 'సీ మిత్ర' బృందం రంగంలోకి దిగుతుంది. బాధితులకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీసి, ఏఐ సాంకేతికతతో లీగల్ అంశాలతో కూడిన పక్కా ఫిర్యాదు డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసి వాట్సాప్, మెయిల్‌కు పంపిస్తారు. బాధితులు ఆ ఫిర్యాదును ప్రింట్ తీసుకొని, సంతకం చేసి బషీర్‌బాగ్ సైబర్ క్రైమ్ స్టేషన్‌కు కొరియర్, పోస్ట్ ద్వారా పంపాలి. ఆ కాపీ అందగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ వివరాలను బాధితుల మొబైల్‌కే మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు. సీ మిత్ర సేవలను వేగంగా బాధితులకు అందించేందుకు ప్రత్యేక బృందాన్ని సైబర్ క్రైం విభాగం ఏర్పాటు చేసింది. రెండు షిఫ్ట్‌ల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ 'వర్చువల్ హెల్ప్‌డెస్క్' బాధితులకు అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని సైబర్ నేర బాధితులకు ఇబ్బందులు కలగకుండా సత్వర న్యాయం అందించాలనే ఉద్దేశంతో వినూత్న కార్యక్రమం సీ మిత్రను జనవరి 9వ తేదిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ప్రారంభించారు.

### పోలీసులా కాదు.. ఒక సోదరిలా: దీక్షిత, కానిస్టేబుల్




సాధారణంగా మోసపోయామన్న బాధలో ఉన్నవారు పోలీస్ స్టేషన్‌కు రావాలంటేనే భయపడతారు. కానీ, మేమే స్వయంగా ఫోన్ చేసి.. 'భయపడకండి, మీకు న్యాయం చేయడానికి మేమున్నాం' అని చెప్పగానే వారి గొంతులో కనిపించే ధైర్యం వెలకట్టలేనిది. ఒకప్పుడు స్టేషన్‌కు రావాలంటే ఆలోచించే సామాన్యుడికి, పోలీసులకు మధ్య 'సీ మిత్ర' ఒక బలమైన వారధిలా నిలిచింది. నేను ప్రతి రోజు 20 మంది బాధితులకు ఫోన్ చేస్తా. ఒక సోదరిలా వారి సమస్యను విని, ఇంటి నుంచే ఫిర్యాదు తీసుకుంటున్నప్పుడు బాధితులు చూపిస్తున్న కృతజ్ఞత మా బాధ్యతను మరింత పెంచుతోంది.

### భవిష్యత్తులో 'సీ-మిత్ర' బంద్ అవ్వాలన్నదే మా లక్ష్యం: పృథ్వీక, కానిస్టేబుల్



టెక్నాలజీని, మానవతా దృక్పథాన్ని జోడించి హైదరాబాద్ పోలీస్ సృష్టిస్తున్న ఈ 'డిజిటల్ విప్లవం'లో ప్రజలకు ఇంత వేగంగా సేవలందిస్తున్నందుకు నాకు చాలా గర్వంగా ఉంది. గతంలో సైబర్ మోసం జరిగితే, ఫిర్యాదు ఎలా రాయాలి? ఏ సెక్షన్లు వర్తిస్తాయి? అని తెలియక బాధితులు సతమతమయ్యే వారు. కానీ 'సీ మిత్ర'తో ఆ ఇబ్బందులు ఇప్పుడు లేవు. బాధితుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఫోన్ చేసి వివరాలు అడగ్గానే సానుకూలంగా స్పందించి, అన్ని వివరాలు తెలియజేస్తున్నారు. భవిష్యత్‌లో హైదరాబాద్‌లో ఒక్క సైబర్ బాధితుడు కూడా లేకుండా చేసి, సీ మిత్ర బంద్ అయ్యే విధంగా మేమంతా పనిచేస్తున్నాం.


**శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము**
ధర్మపురి పట్టణం - జగిత్యాల జిల్లా.

ఆర్.సి నెం.బి/229/2025 | టెండర్ ప్రకటన | తేది: 19-01-2026

తేది: 01.04.2026 నుండి తేది: 31.03.2027 వరకు దేవస్థానమునకు అవసరమగు 01. ప్రోవిజన్ ఐటమ్స్, 02. పూలదండలు, 03. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను, 04. అన్స్కిల్ లేబర్, 05. కూరగాయలు, 06.పాలు & పెరుగు, 07. ఎలక్ట్రికల్ ఐటమ్, 08. టికెట్ బుక్కులు,09. ఫ్లెక్సీ బ్యానర్స్, సప్లయి చేయుట గూర్చి ఆన్ లైన్ ఇ.ప్రొక్యూర్‌మెంట్ ద్వారా తేది: 21.01.2026 ఉ. 11.30 గంటల నుండి తేది: 04.02.2026 సా. 4.30 గంటల వరకు ఆన్‌లైన్ టెండర్ దాఖలు చేయవచ్చును అదేవిధంగా 10.స్టేషనరీ ఐటమ్, 11. శనిగపప్పు గిర్నీ పట్టుట, 12. భక్తులు మొక్కుబడిగా సమర్పించిన మిక్స్‌డ్ బియ్యం, 13. మిక్స్‌డ్ బెల్లం, 14. ఖాళీ నూనె డబ్బాలు సేకరించుకొనుట కొరకు తేది: 21.01.2026 ఉ. 11.30 గంటల నుండి తేది: 06.02.2026 మ. 01.00 గంటల వరకు, సీల్డు కోటేషన్ కొరకు దరఖాస్తు చేసి తేది: 06.02.2026 రోజున మ.02.00 గంటలలోగా సీల్డు టెండర్ బాక్స్‌లో టెండర్ దాఖలు చేయవలెను. ఆన్‌లైన్ టెక్నికల్ బిడ్ తేది: 04.02.2026 సా.5.00 గంటలకు ఓపెన్ చేసి తదుపరి ప్రైజ్ బిడ్ తేది: 06.02.2026 రోజున మ.02.30 గంటలకు ఓపెన్ చేయబడను. పూర్తి వివరములకు కార్యాలయ పనివేళలో 9849259289 నంబర్ సంప్రదించవచ్చును.

అధ్యక్షులు & ధర్మకర్తల మండలి | సం/- కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 13925-PP/CL/ADVT/1/2025-26, Date: 19-01-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివిజన్-8
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

| Nit No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
| --- | --- | --- | --- | --- |
| 57/EE-23/RJNRZ/GHMC/2025-26 | పనుల సంఖ్య (1) | రూ. 2.70 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 19.01.2026న సా.4.00గం.ల నుండి. బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 22.01.2026న సా.4.15గం.ల వరకు. | శ్రీ బి.నరేందర్ గౌడ్, ఇఇ, సర్కిల్-23, ఫూల్‌బాగ్, హైదరాబాద్. ఫోన్ నెం. 9989930608 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
గమనిక: 1) టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% EMD పొందాలి మరియు విజయవంతమైన టెండరుదారులు దానిని 3 రోజులలోపు వెంటనే ఈ కార్యాలయానికి సమర్పించాలి. అలా చేయడంలో విఫలమైనా లేదా ఏదైనా వ్యత్యాసం గమనించినా, జి.ఓ. ఎం.ఎస్. నెం. 174, ఐ&సిఎడి (P0..00.000.W- Reforms) డిపార్ట్‌మెంట్, తేది: 01.09.08 ప్రకారం, మిమ్మల్ని ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో టెండర్లలో పాల్గొనకుండా 3 సంవత్సరాల పాటు సస్పెండ్ చేయడం జరుగుతుంది.
2) వడ్డెర కార్మిక సంఘాలకు కేవలం రిజర్వ్ చేయబడిన పనులకు మాత్రమే ఈఎండి చెల్లింపు నుండి మినహాయింపు ఉంది మరియు ఇతర పనులకు వారు 1% EMD చెల్లించవలసి ఉంటుంది.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-23, చాంద్రాయణగుట్ట, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 13939-PP/CL/ADVT/1/2025-26, Date: 19-01-2026

# లక్నోలో తెలంగాణ శాసన బృందం పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో తెలంగాణ రాష్ట్ర శాసన మండలి, శాసనసభకు చెందిన ఉన్నత స్థాయి బృందం పర్యటిస్తోంది. లక్నోలో నిర్వహించనున్న 86వ ఆల్ ఇండియా ప్రెసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ (ఎఐపిఓసి)లో పాల్గొనేందుకు వచ్చిన ఈ బృందం, సోమవారం నగరంలోని పలు చారిత్రక ప్రాంతాలను సందర్శించింది. తెలంగాణ శాసన మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ నాయకత్వంలోని ఈ బృందం తమ స్టడీ టూర్‌లో భాగంగా లక్నోలోని సుప్రసిద్ధ కట్టడాలైన, బార ఇమాం బార, చోటా ఇమాం బార, బు ల్‌బులయియా (చారిత్రక భ్రమలయం), క్లాక్ టవర్ వంటి ప్రాంతాలను సందర్శించి, అక్కడి వాస్తు శిల్పం, చారిత్రక ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి కార్యదర్శి డాక్టర్ నరసింహా చార్యులు, శాసన సభ కార్యదర్శి ఆర్. తిరుపతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీరితో పాటు శాసన మండలి చైర్మన్ ఓఎస్‌డి వి. గోవర్ధన్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ పి.ఎస్. బి. యాదగిరి తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రెసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో దేశవ్యాప్తంగా ఉన్న శాసనసభల స్పీకర్లు, మండలి చైర్మన్లు పాల్గొననున్నారు. శాసన వ్యవస్థలో పారదర్శకత, సాంకేతికత వినియోగం, ప్రజాస్వామ్య విలువల బలోపేతంపై ఈ సమావేశాల్లో విస్తృతంగా చర్చించనున్నారు. ఆదివారమే లక్నో చేరుకున్న తెలంగాణ బృందం, ఈ ప్రతిష్టాత్మక సమావేశాల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనుంది.



## సింగరేణి టెండర్ల కుంభకోణంలో.. సిఎం, మంత్రుల మధ్య వాటాల పంచాయితీ

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నైనీ బ్లాక్ టెండర్ల విషయంలో సిఎం, మంత్రుల మధ్య వాటాల పంచాయితీ కొనసాగుతుందని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రేవంత్ ప్రభుత్వం 2024లో 'సైట్ విజిట్' అనే కొత్త నిబంధనను తెచ్చిందని, ఇది కేవలం తమ అనుయాయులకు టెండర్లు కట్టబెట్టడానికేనని ఆరోపించారు. ఈ విధానం వల్ల మొదటి లబ్ధిదారు సిఎం రేవంత్ రెడ్డి బావమరిదికి చెందిన 'శోదా కన్‌స్ట్రక్షన్' అని, ఆ కంపెనీకే తొలి టెండర్ దక్కిందన్నారు. గతంలో మైనస్ 10 నుంచి 22 శాతానికి పోయే టెండర్లు, ఇప్పుడు ప్లస్ 7 నుంచి 20 శాతానికి అస్మదీయులకు ఇస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వానికి భారీ నష్టం జరుగుతోందన్నారు. కేవలం నైనీ బ్లాక్ టెండర్లు మాత్రమే కాకుండా, ఈ కొత్త విధానంలో జరిగిన అన్ని టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి టెండర్ల విషయంలో సిఎం, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రుల మధ్య 'వాటాల' కోసమే గొడవలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో ఐఎఎస్ అధికారులు, జర్నలిస్టులు బలిపశువులు అవుతున్నారని విమర్శించారు. గతంలో సింగరేణి సంస్థే బల్క్ లో డీజిల్ సరఫరా చేసేదని, ఇప్పుడు కమీషన్ల కోసం కాంట్రాక్టర్లకే డీజిల్ బాధ్యత అప్పగించి సంస్థపై భారం మోపారన్నారు. నిజాయితీ ఉంటే సింగరేణి అక్రమాలపై వెంటనే సిబిఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా చొరవ తీసుకోవాలని కోరారు. రెండేళ్లుగా రెగ్యులర్ సిఎండి లేకపోవడంతోనే ఇన్‌చార్జ్‌లతో ఇలాంటి అడ్డగోలు వ్యవహారాలు నడిపిస్తున్నారని, వెంటనే అర్హత కలిగిన సిఎండిని నియమించాలన్నారు. బిఆర్‌ఎస్ జెండాను, గద్దెలను తాకితే ప్రజలే రేవంత్ రెడ్డిని గద్దె దించుతారని, తమ పార్టీ ప్రజల గుండెల్లో ఉందన్నారు.

## కొత్త పార్టీ దిశగా కవిత అడుగులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో ఆసక్తికర మలుపు తిరగబోతోంది. బిఆర్‌ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల కవిత, తన రాజకీయ భవిష్యత్తుపై పూర్తిస్థాయి దృష్టి సారించారు. ప్రజల అభీష్టం మేరకు కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేసేందుకు ఆమె వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పికె)తో ఆమె సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్ర స్థితిగతులు, వివిధ వర్గాల సమస్యలు, వనరుల వినియోగంపై అధ్యయనం చేయడానికి ఏర్పాటు చేసిన 50 కమిటీలు తమ నివేదికను కవితకు సమర్పించాయి. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలంగాణ సమగ్రాభివృద్ధికి అవసరమైన బ్లూ ప్రింట్ రూపకల్పన పనిలో తెలంగాణ జాగృతి నిమగ్నమై ఉందని ఆ సంస్థ వర్గాలు వెల్లడించాయి. ఇదే సమయంలో, తెలంగాణ జాగృతిని రాజకీయ శక్తిగా మార్చాలనే దిశగా కవిత స్పష్టమైన కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. గత రెండు నెలల్లో పికె రెండుసార్లు హైదరాబాద్ వచ్చి కవితతో రహస్యంగా సమావేశమయ్యారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగ సమయంలో వీరిద్దరి మధ్య జరిగిన ఐదు రోజుల సుదీర్ఘ చర్చలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పార్టీ నిర్మాణం, ప్రజల్లోకి వెళ్లే విధానంపై పికె మార్గదర్శకత్వం వహిస్తున్నట్లు సమాచారం. తన సారథ్యంలోని 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మారుస్తానని కవిత ఇప్పటికే ప్రకటించారు. ఈ పార్టీకి 'తెలంగాణ సెక్యులర్ పార్టీ' అనే పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.పికె వ్యూహాత్మక మార్గదర్శకత్వంతో త్వరలోనే కొత్త పార్టీ ప్రకటన ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ కొత్త రాజకీయ ప్రయోగం తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాల్సి ఉంది.

## రైలు భద్రతపై దక్షిణ మధ్య రైల్వే జిఎం సమగ్ర సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతే ప్రధాన లక్ష్యంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో జరిగిన ఈ సమావేశంలో జోన్ వ్యాప్తంగా చేపడుతున్న భద్రతా చర్యలను ఆయన సవివరంగా పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల ప్రధానాధిపతులు పాల్గొన్నారు. అలాగే సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డిఆర్‌ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.రైళ్లు సజావుగా నడవాలంటే ట్రాక్ నిర్వహణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో కఠిన భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని జీఎం అధికారులను ఆదేశించారు. రైలు కార్యకలాపాల్లో పాల్గొనే సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా



పాటించాలని సూచించారు. లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద భద్రతపై ప్రత్యేకంగా చర్చించిన జీఎం, సాధారణ ప్రజలు రైల్వే ట్రాక్‌లను అక్రమంగా దాటవద్దని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి నిర్లక్ష్య చర్యలే ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. జోన్ వ్యాప్తంగా అగ్నిమాపక భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. రైళ్లలోని విద్యుత్ పరికరాల భద్రతపై నిర్వహించిన తనిఖీల వివరాలను అధికారులు జీఎంకు వివరించారు. అలాగే ఫైర్ అండ స్మోక్ డిటెక్షన్ సిస్టమ్ (ఎఫ్‌ఎస్‌డిఎస్) పనితీరుపై చేపట్టిన ప్రత్యేక భద్రతా డ్రైవ్‌ల పురోగతిని సమీక్షించారు. ఈ భద్రతా డ్రైవ్‌లను నిరంతరం కొనసాగించాలని డిఆర్‌ఎంలను ఆయన ఆదేశించారు. రైళ్లలోపల స్టేషన్ ప్రాంగణాల్లో అగ్ని ప్రమాదాలపై ముందస్తు జాగ్రత్త సూచన బోర్డులను స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. ప్రయాణికుల్లో అప్రమత్తత పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అవసరాల మేర అగ్నిమాపక యంత్రాలు, పొగ గుర్తింపు పరికరాల కొనుగోలుకు చురుకైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి, అసాధారణ సంఘటనలు జరగకుండా సకాలంలో చర్యలు తీసుకోవాలని జిఎం సూచించారు.

## రచయిత శ్రీపాద శ్రీనివాస్‌కు 'వివేకానంద స్ఫూర్తి రత్న' పురస్కారం



**రాజమహేంద్రవరం:** రిపబ్లిక్ డేను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ప్రముఖ సాంస్కృతిక సంస్థలు వైద్యుల గ్లోబల్ ఫౌండేషన్ వసుంధర విజ్ఞాన వికాస మండలి సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాలలోని ప్రతిభావంతులకు స్ఫూర్తి రత్న పురస్కారాలను ప్రకటించారు. సాహిత్య రంగంలో రాజమండ్రి నగరానికి చెందిన ఔత్సాహిక రచయిత శ్రీపాద శ్రీనివాసును ప్రతిష్టాత్మక వివేకానంద స్ఫూర్తి రత్న పురస్కారానికి ఎంపిక చేశారు. శ్రీపాద రచించిన 16కు పైగా కథ లు, కథానికలు తన స్వీయ స్వరంతో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ద్వారా వినిపించారు. గుండె చప్పుళ్ళు, చట్టసభల్లో గోదావరి గళం, మనసున ఉన్నది, అంతరంగం వంటి నాలుగు పుస్తకాలను రచించారు. వీరు రచించిన పుస్తకాలకు ఉండవల్లి అరుణ్ కుమార్, మండలి బుద్ధ ప్రసాద్, డి.శ్రీధర్ బాబు, దనసరి అనసూయ (సీతక్క) వంటి రాజకీయ ఉద్దండులు ముందు మాటను అం దించారు. తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ శాసనసభాపక్షం కార్యాలయ సి బ్బందిగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఈ పురస్కారం అందుకోబోతున్న శుభతరుణం లో పలువురు సాహితీ మిత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ముస్సిపాలిటీ ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ కీలక పాత్ర :సునీతా రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో మహిళా కాంగ్రెస్ కీలక పాత్ర పోషిస్తుందని అధ్యక్షురాలు మొగలి సునీతా రావు తెలిపారు. గాంధీభవన్‌లో ఆమె అధ్యక్షతన సోమవారం ఎంజిఎన్ఆర్ ఇజిఎ అంశంపై తెలంగాణ ప్రదేశ్ మహిళ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎంజిఎన్ఆర్ఇజిఎ అమలు, కార్మికుల సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై చర్చించామని, ఈ సమావేశానికి తెలంగాణ మహిళా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారని తెలిపారు. క్రమశిక్షణ(డిసిప్లిన్)పై స్పష్టమైన హెచ్చరికలు, ప్రోటోకాల్ ఉల్లంఘనలకు ఎటువంటి ఉపేక్ష లేదని డిస్టిక్ ప్రెసిడెంట్లు, స్టేట్ ఆఫీస్ బేరర్స్‌కు అప్పగించిన పని పూర్తి చేయాలని సునీత రావు స్పష్టం చేశారు. ఎఐఎంసి, పిసిసి, టిఎంసి పిలుపు మేరకు జరిగే ప్రతి కార్యక్రమానికి మహిళా కాంగ్రెస్ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పునరుద్ధరించాలని, గాంధీజీ పేరు మార్పుపై చర్చించడం జరిగిందన్నారు. ప్రతి జిల్లా నుంచి మంత్లీ యాక్టివిటీ రిపోర్ట్ తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్స్. జనరల్ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

## జస్టిస్ ఘోష్ కమిటీ నివేదిక ఆధారంగా చర్య వద్దు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కట్టడాలో అక్రమాలపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోరాదు అంటూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు సోమవారం మరోసారి పొడిగించింది. మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఐఎస్ అధికారి స్మితా సభర్వాల్, రిటైర్డ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషిలపై చర్యలు తీసుకోవాలన్న మధ్యంతర ఉత్తర్వులను సోమవారం మరోసారి పొడిగించింది. విచారణను ఫిబ్రవరి 25వ తేదీకి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన బెంచ్ ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వం గడువు కోరడంతో విచారణ వాయిదా పడింది.

## కొత్తగూడెం కార్పొరేషన్‌పై స్టేకు నిరాకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కొత్తగూడెం, పాల్వంచలను విలీనం చేసి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు ఉత్తర్వుల అమలు ను నిలిపివేచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. జీవో 103 అమలుపై స్టే ఇవ్వడానికి పిటిషనర్లు తగిన ఆధారాలు చూపలేదని పేర్కొంది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు జీవో 103ను సవాలు చేస్తూ పాల్వంచ మండలం గట్టాయగూడెం నకు చెందిన ప్రవీణ్‌కుమార్ ఇతరులు వేసిన పిటిషన్ను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలోని ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారించింది. ఏడు గిరిజన గ్రామాలు షెడ్యూల్ ఏరియాలో ఉన్నాయని పిటిషనర్లు తగిన ఆధారాలు చూపలదని, కాబట్టి స్టే మంజూరు చేయడం లేదని పేర్కొంది

## 6.12 ఎకరాల ప్రభుత్వ భూమికి కంచె

నల్లమల్లారెడ్డి ఆక్రమణలపై హైడ్రా చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సరిగ్గా ఏడాది క్రితం దివ్యానగర్ లేఔట్‌లో అక్రమ అడ్డుగోడలను తొలగించిన హైడ్రా, సోమవారం మరోసారి అదే ప్రాంతంలో ప్రభుత్వ భూమిని కాపాడింది. నాడు, నేడూ హైడ్రా ఆపరేషన్‌కు చిక్కింది విద్యాసంస్థల అధినేత నల్లమల్లారెడ్డే కావడం గమనార్హం. ప్రభుత్వ భూమిలో అనుమతి లేని లేఔట్ వేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న వ్యవహారాన్ని హైడ్రా సీరియస్‌గా పరిగణించింది. మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారం గ్రామం సర్వే నెంబర్లు 66/2, 3, 4, 5లలో ఉన్న 6.12 ఎకరాల ప్రభుత్వ భూమిని సోమవారం హైడ్రా స్వాధీనం చేసుకుంది. ప్రభుత్వ భూమికి ఆనుకుని లేఔట్ వేసిన నల్లమల్లారెడ్డి, ప్రభుత్వ స్థలంలోకి చొరబడి కొంతభాగాన్ని ప్లాట్లుగా మార్చి విక్రయించినట్టు ఆరోపణలు రావడంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. సర్వే ల్యాండ్ రికార్డుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ నివేదిక ఆధారంగా ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వ భూమిలో నల్లమల్లారెడ్డి వేసిన దాదాపు 50 ప్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అక్రమ ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు హైడ్రా చుట్టూ కంచె వేసి, 'ప్రభుత్వ భూమి' అని పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. నోటీసులు ఇవ్వకుండా కంచె ఎలా వేస్తారంటూ నల్లమల్లారెడ్డి అడ్డుకునే ప్రయత్నాలు చేసినా, అవి ఫలించలేదు.



## పంజాబీ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా 'లోహ్రి సగన వేడుకలు'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంజాబీ సేవా సమితి 27వ 'లోహ్రి సగన' వేడుకలు సికింద్రాబాద్ లోని తివోలి గార్డెన్స్ ఘనంగా జరిగాయి. అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలు, పంజాబీ సమాజం సభ్యులతో ఉత్సాహ భరితంగా ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ హాజరయ్యారు. పంజాబీ ఆచారం ప్రకారం నువ్వులు, బెల్లం, మొక్కజొన్నలు, వేరుశెనగలను పవిత్ర అగ్నిలో భక్తితో సమర్పించారు. అనంతరం ప్రజాశ్రేయస్సు, సామరస్యం, ఆశీర్వాదాల కోసం ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మాట్లాడుతూ పంజాబీ సేవా సమితి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు మన సంస్కృతి, వారసత్వాలను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు దోహదపడతాయన్నారు. ప్రజలు తమ సంస్కృతి సాంప్రదాయాలను ముందుకు తీసుకుపోతూ విలువలతో కూడిన మెరుగైన జీవితాన్ని గడపాలన్నారు.




## అమీన్‌పూర్ చెరువు ఎఫ్‌టిఎల్‌ను నిర్ధారించండి

హైడ్రా ప్రజావాణిలో అమీన్‌పూర్ వాసుల వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్) హద్దులను నిర్ధారించాలంటూ స్థానికులు హైడ్రాను కోరారు. ప్రతి ఏడాది చెరువులో నీటి నిల్వ పెరుగుతుండటంతో తమ ఇళ్లు, ప్లాట్లు ముంపునకు గురవుతున్నాయని వాపోయారు. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ హద్దులను స్పష్టంగా నిర్ధారించి తమకు న్యాయం చేయాలని అమీన్‌పూర్ నివాసితులు సోమవారం హైడ్రా ప్రజావాణిలో పెద్ద సంఖ్యలో హాజరై వినతిపత్రాలు సమర్పించారు. చెరువు అభివృద్ధి నిర్ణయం నేపథ్యంలో ప్లాట్లు, ఇళ్లు కోల్పోయినవారికి న్యాయం చేయాలని, వీలైతే ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని వారు కోరారు. రంగారెడ్డి జిల్లా పెద్దంబర్‌పేట గ్రామంలోని శబరిహిల్స్ లేఔట్‌లో రహదారులు, ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలు అక్రమంగా కబ్జా అవుతున్నాయంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్రజావాణికి అందిన ఫిర్యాదులను కమిషనర్ ఏ.వి. రంగనాథ్ పరిశీలించి, పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

## కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి

వేతనాలు పెంచకుంటే సమ్మె తప్పదు : బాలకృష్ణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అతి తక్కువ వేతనాలతో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందని తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్(టిజిహెచ్‌ఎంఇయు) అధ్యక్షుడు కొమ్మగళ్ల బాలకృష్ణ అన్నారు. తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్‌ను బాలకృష్ణ జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఔట్‌సోర్సింగ్ కార్మికులు చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వేతనాలు పెంచకపోతే పని బంద్ చేసి సమ్మెకు దిగుతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దాస్, నాయకులు అంజయ్య, మల్లేష్, నాగరాజ్, ఎల్లయ్య, ధర్మేందర్, దుర్గయ్య, సురేందర్, భూషణం, మల్లేష్, టింకు, ప్రేమానందం, నవీద్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కప్ పోటీలకు సాంకేతిక హంగులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం కప్ 2025–26ను పూర్తిగా సాంకేతికత ఆధారంగా నిర్వహించేందుకు తెలంగాణ క్రీడా శాఖ స్పష్టమైన కార్యాచరణ రూపొందించింది. క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాల్గొనేలా డిజిటల్ సపోర్ట్ సిస్టమ్ను బలోపేతం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈసారి సిఎం కప్‌లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడి వివరాలను కేంద్రీకృత డేటాబేస్‌లో నమోదు చేయనున్నారు. ఈ డేటా ద్వారా భవిష్యత్తులో నిర్వహించే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల సమాచారం, ఎంపిక ప్రక్రియలు, శిక్షణ శిబిరాల వివరాలను నేరుగా క్రీడాకారుల మొబైల్‌కు చేరవేయాలని క్రీడా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.పోటీల సమయంలో ఏర్పడే సమస్యలు, ఫిర్యాదులు, అనుమానాలను తక్షణమే పరిష్కరించేందుకు ఏఐ ఆధారిత చాట్‌బాట్, వాట్సాప్ బాట్, ఏఐ కాల్ సెంటర్లను సమన్వయంగా ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదు నమోదైన వెంటనే సంబంధిత అధికారులకు చేరి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కారం జరిగేలా రియల్ టైమ్ ట్రాకింగ్ సిస్టమ్ను అమలు చేయనున్నట్లు చెప్పారు. సిఎం కప్–2024కు లభించిన విశేష స్పందన, దాదాపు మూడు లక్షల మంది విద్యార్థి క్రీడాకారుల పాల్గొనడం ఈ కార్యక్రమానికి మరింత బలం చేకూర్చిందని అధికారులు పేర్కొన్నారు. అదే ఉత్సాహంతో రెండో విడత సీఎం కప్‌ను మరింత పారదర్శకంగా, వేగంగా, క్రీడాకారులకు అనుకూలంగా నిర్వహించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. సాంకేతికత వినియోగంతో క్రీడాకారులపై దృష్టి కేంద్రీకృతమై, ప్రతిభావంతులకు న్యాయం జరుగుతుందని, సిఎం కప్ తెలంగాణలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేసే వేదికగా మారుతుందని క్రీడా శాఖ అధికారులు అభిప్రాయపడ్డారు.

## గ్రూప్-1 అధికారులకు 6 వారాల ఫౌండేషన్ కోర్స్ ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో 274 మంది కొత్తగా నియమితులైన గ్రూప్I అధికారుల కోసం నిర్వహిస్తున్న కాంబైన్డ్ ఫౌండేషన్ కోర్స్2026ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగస్వాములుగా అధికారులు నిబద్ధత, నిజాయితీ, నాయకత్వంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని, విధానాల అమలులో సమర్థత చూపాలన్నారు.రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణకు ఉన్న సమృద్ధమైన పరిపాలనా సంప్రదాయాలను కొనసాగిస్తూ నైతికతతో కూడిన, ప్రజాకేంద్రీకృత పాలన అందించాలని సూచించారు. ఆరు వారాల పాటు జరిగే ఈ ఫౌండేషన్ కోర్స్‌లో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ, ఫీల్డ్ విజిట్లు, వివిధ సేవల మధ్య సమన్వయం వంటి అంశాలను సమగ్రంగా బోధిస్తారు. ప్రజాసేవ పట్ల దృఢమైన విలువలు, వృత్తి నైపుణ్యాలు పెంపొందించడమే ఈ శిక్షణ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## పి అండ్ ఎల్ ఐజిగా గజరావు భూపాల్ బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పి అండ్ ఎల్ ఐజిగా డాక్టర్ గజరావు భూపాల్ సోమవారం రాష్ట్ర డిజిపి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. పోలీసు సంక్షేమం, స్పోర్ట్స్ విభాగాల పూర్తి అదనపు బాధ్యతలను కూడా ప్రభుత్వం ఆయనకు అప్పగించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 2008 ఐపిఎస్ బ్యాచ్ గజరావు భూపాల్ వివిధ హోదాల్లో పనిచేశారు. తన 18 ఏళ్ల సర్వీసులో గజరావు భూపాల్ ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణలోనూ బాధ్యతలను నిర్వహించారు. ప్రారంభంలో భద్రాచలం ఎఎస్‌పిగా పని చేసిన ఆయన, ఆ తర్వాత వరంగల్ కమాండెంట్‌గా, నెల్లూరు జిల్లా ఎస్‌పిగా, సిఐడి విభాగంలో సేవలందించారు. విజయవాడ డిసిపిగా, మంగళగిరి బెటాలియన్ క మాండెంట్‌గా పని చేయడంతో పాటు ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి జిల్లా ఎస్‌పిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్‌లో సౌత్ జోన్ డిసిపిగానూ అనంతరం హైదరాబాద్ సిటీ జా యింట్ సిపిగా క్రైమ్ విభాగం (డిడి)తో పాటు అడ్మిన్ విభాగాల్లో పనిచేశా రు. డిజిపి కార్యాలయంలో డిఐజి కోఆర్డినేషన్‌గా, సైబరాబాద్ జాయింట్ సిపి (ట్రాఫిక్)గా పని చేస్తూ పి అండ్ ఎల్ ఐ జి పి గా డిజిపి కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

## చట్టబద్ధమైన వేతన సవరణలపై ప్రభుత్వం స్పందించాలి

ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ జారీ కానున్న నేపథ్యంలో చట్టబద్ధమైన వేతన సవరణలపై ప్రభుత్వం స్పందించాలని, 58 నెలలుగా జాప్యమవుతున్న వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో కలిపి తక్షణమే ప్రకటించాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. అలాగే 10 నెలలుగా జాప్యమవుతున్న వేతన సవరణపై చర్యలు ప్రారంభించాలని, దీంతో పాటు పదవీ విరమణ చేసిన 14 వేల మంది కార్మికుల 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి, ఆర్‌టిసి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

## సిపిఐ వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నాం

ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మ ణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ జాతీయ మహాసభల్లో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి ఎంపి, ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మ ణ్ అన్నారు. సిపిఐతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో కాంగ్రెస్ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతోందని విమర్శించారు.

## స్పీకర్‌కు సుప్రీం నోటీసులు : బిజెపి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ఫిబ్రవరి 6 లోపు వివరణ ఇవ్వాలంటూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన స్పీకర్ ప్రభుత్వ ఒత్తిడికి లోనవడం రాజ్యాంగ విరుద్ధమని బిజెపి నేతలు విమర్శించారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ కూడా స్పందించాలని డిమాండ్ చేశారు.

## సిఎం హార్వర్డ్ పర్యటనపై బిజెపి అభ్యంతరం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో 'లీడర్‌షిప్ కోర్సు' కోసం వెళ్లడాన్ని బిజెపి రాష్ట్ర ముఖ్య ప్రతినిధి ఎన్.వి. సుభాష్ తప్పుబట్టారు. ప్రజల పన్నుల సొమ్ముతో వ్యక్తిగత కోరికలు తీర్చుకోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. 'నిజమైన నాయకత్వం వారం రోజుల కోర్సుతో రాదు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఉంటుంది' అని హితవు పలికారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని చెబుతూ, విదేశీ పర్యటనలకు నిధులు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు.

# డిజిటల్ అరెస్టుతో బెదిరింపు : అరెస్టు

రూ. 10.5 లక్షలు వసూలు చేసిన నిందితుడు




**కన్నూర్:** దేశ వ్యాప్తంగా డిజిటల్ అరెస్టు మోసాలు పెచ్చుమీరుతున్నాయి. తాజాగా ఉత్తర కేరళ జిల్లాలోని తలస్సేరికి చెందిన మహిళా డాక్టర్ నుండి రూ. 10.5 లక్షలు వసూలు చేసిన కేసులో కన్నూర్ సిటీ సైబర్ పోలీసులు ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. పంజాబ్‌లోని లూధియానాకు చెందిన నిందితుడు జీవన్ రామ్ (28) డబ్బు చెల్లించమని ఓ వైద్యుడిని 'డిజిటల్ అరెస్ట్' చేస్తామని బెదిరించాడని ఆరోపించారు. ఈ ఘటన నవంబర్ 30న జరిగింది. ముంబయిలోని సిబిఐ అధికారులుగా నటిస్తూ మోసగాళ్ళు వాట్సాప్ వీడియో కాల్ ద్వారా వైద్యుడిని సంప్రదించారు. ఆమె పేరుతో మనీలాండరింగ్ కేసు నమోదు చేయబడిందని, ఈ విషయాన్ని పరిష్కరించడానికి డబ్బు బదిలీ చేయమని ఆమెపై ఒత్తిడి తెచ్చారని వారు పేర్కొన్నారు. డాక్టర్ వివిధ ఖాతాల ద్వారా రూ. 10,50,000 పంపారని, తరువాత నిందితులు చెక్ ద్వారా దానిని తీసుకున్నారు. డిజిటల్ అరెస్ట్ అనేది ఒక రకమైన సైబర్ నేరం, దీనిలో మోసగాళ్ళు చట్ట అమలు అధికారులు, కోర్టు అధికారులు లేదా ప్రభుత్వ సంస్థల సిబ్బందిగా నటిస్తూ ఆడియో, వీడియో కాల్స్ ద్వారా బాధితులను బెదిరిస్తారు. వారు బాధితులను బందీలుగా ఉంచి డబ్బు బదిలీ చేయమని వారిపై ఒత్తిడి తెస్తారు. కాగా, పోలీస్ కమిషనర్ నిధిన్‌రాజ్ పి సూచనలను అనుసరించి కన్నూర్ నగర పోలీసులు నిందితుడిని లూధియానాలోని ఒక గ్రామంలో ట్రాక్ చేశారు. నిందితులు నిరంతరం స్థానాలు మారుస్తున్నప్పటికీ, కేరళ పోలీసు బృందం పంజాబ్‌లో కఠినమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, ఐదు రోజుల నిఘా తర్వాత నిందితుడిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# గ్రామీణ పేదలకు తాయిలంలా పని

ప్రభుత్వం నిర్ణయించినప్పుడు మాత్రమే అప్పగింత

కొత్త 'విబి-జి రామ్ జి' చట్టంపై రాహుల్, ఖర్గే విమర్శ



**న్యూఢిల్లీ :** 'ఎంజి నరేగా' స్థానంలో వచ్చిన కొత్త 'విబి–జి రామ్ జి' చట్టాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. దేశంలోని గ్రామీణ జనాభా కోసం ఇప్పుడు పని తాయిలంలా మారుతుందని, ప్రభుత్వం నిర్ణయించినప్పుడు మాత్రమే వారికి అప్పగించబడుతుందని, ఇకపై అది హక్కు కాదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు వారు లేఖ రాశారు. కొత్త చట్టం ద్వారా రాష్ట్రాలపై ఆర్థికంగా భారం పడుతున్నప్పటికీ, వారి పని హక్కు 'దొంగిలించబడుతోంది' అని ఆ లేఖలో వారు ఆరోపించారు. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఎంజి నరేగా బచావో సంగ్రామ్'లో భాగంగా గత చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఖర్గే, రాహుల్‌గాంధీ లేఖ రాశారు. జనవరి 10న ప్రారంభమైన ఆ కార్యక్రమం ఫిబ్రవరి 25 వరకు కొనసాగుతుంది. ఈ లేఖను అన్ని స్థానిక భాషలలోకి అనువదించిన తర్వాత గ్రామీణ ప్రజలలో వ్యాప్తి చేయాలని కాంగ్రెస్ తన రాష్ట్ర యూనిట్ ముఖ్యులను కోరింది. 20 సంవత్సరాల క్రితం అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజినరాగే) ను అమలు చేయడం ద్వారా రాజ్యాంగబద్ధమైన పని హక్కుకు ప్రాణం పోసిందని లేఖలో పేర్కొన్నారు. అప్పటి నుండి ఎంజి. నరేగా 180 కోట్లకు పైగా పనిని సృష్టించింది. గ్రామ ట్యాంకులు, రోడ్లు వంటి దాదాపు 10 కోట్ల ఆస్తులను సృష్టించింది. గ్రామ స్థాయి ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకునే అధికారం గ్రామ పంచాయతీలకు ఇవ్వడం ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేసిందని అది పేర్కొంది. కొవిడ్ 19 మహమ్మారి వంటి సంక్షోభాల సమయంలో, ఇది గ్రామీణ భారత ఆర్థిక వ్యవస్థకు జీవనాడి. మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఎంజి నరేగా ఆత్మను నాలుగు కీలకమైన మార్గాల్లో నాశనం చేయాలని యోచిస్తోంది. 'మీ పని హక్కు దొంగిలించబడుతోంది. ముందు: భారతదేశం అంతటా ప్రతి గ్రామీణ కుటుంబానికి పని చట్టబద్ధమైన హామీ. ఏదైనా గ్రామ పంచాయతీలో పని కోరుకునే ఏ కుటుంబానికి అయినా 15 రోజుల్లోపు పని అందించాలి. తరువాత: పని ఇకపై హక్కుగా ఉండదు, కానీ మోదీ ప్రభుత్వం నిర్ణయించినట్లుగా అందజేయవలసిన 'రెవ్డి'గా ఉంటుంది. ఈ పథకం కింద ఏ గ్రామ పంచాయతీలకు పని ఇవ్వాలో మోదీ ప్రభుత్వం ఎంచుకుంటుంది' అని లేఖలో పేర్కొన్నారు. వేతన హక్కును కూడా దొంగిలిస్తున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు ఉన్న పథకంలో సంవత్సరానికి పెరిగే, సంవత్సరంలో 365 రోజులు అందుబాటులో ఉండే నోటిఫైడ్ కనీస వేతనాలకు పని అందించబడింది. కనీస వేతన హామీతో కుటుంబాలు అవసరమైనప్పుడల్లా పని కోరుకోవచ్చు. కొత్త పథకంలో వార్షిక సవరణలకు హామీ లేకుండా వేతనాలు ఏకపక్షంగా నిర్ణయించబడతాయి. పంట కాలంలో ఈ పథకం అమలు చేయబడదు, కాబట్టి కార్మికులు కనీస వేతనం లేకుండా వారు పొందే ఇతర పనులను అంగీకరించవలసి వస్తుంది అని కాంగ్రెస్ నాయకులు లేఖలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల అధికారాలను కాంట్రాక్టర్లకు అప్పగిస్తామని పేర్కొంటూ, గ్రామ పంచాయతీలు ముందుగా వారి అవసరాలకు అనుగుణంగా వారి స్వంత అభివృద్ధి ప్రాజెక్టులను ప్లాన్ చేసి చేపట్టాయని, కాంట్రాక్టర్లను నిషేధించారని, కార్మికులకు స్థానిక ఎంజి నరేగా సహచరులు, రోజ్‌గర్ సహాయక్‌లు మద్దతు ఇస్తున్నారని వారు చెప్పారు. ఇప్పుడు, ఢిల్లీ నుండి రిమోట్ కంట్రోల్ ద్వారా ప్రాజెక్టులకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారని వారు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆదేశాల అమలు సంస్థగా మాత్రమే మారుతుంది, కాంట్రాక్టర్లను తీసుకువస్తారు, కార్మికులు వారి చేతుల్లో కేవలం కార్మికులుగా మారతారని వారు చెప్పారు. నరేగా సహచరులు లేదా రోజ్‌గర్ సహాయకులు కూడా ఉండరని ఖర్గే, రాహుల్‌గాంధీ అన్నారు. రాష్ట్రాలు ఆర్థికంగా భారం పడుతున్నాయని పేర్కొంటూ, గతంలో కేంద్రం ఎంజి నరేగా వేతనాలలో 100 శాతం చెల్లిస్తుందని, రాష్ట్రాలు పని కల్పించినందుకు ప్రోత్సాహకాలు అందించబడతాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు.

### ఉన్నావ్ అత్యాచార కేసు...

# సెంగార్ పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో 2017లో జరిగిన సంచలనాత్మక అత్యాచార కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో దోషిగా తేలిన మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. తనకు విధించిన పదేళ్ల జైలుశిక్షను నిలిపి వేయాలంటూ ఢిల్లీ హైకోర్టులో సెంగార్ పిటిషన్ వేశాడు. దీనిపై సోమవారం విచారణ చేపట్టిన ఢిల్లీ న్యాయస్థానం.. ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. 'రిలీఫ్ మంజూరు చేయడానికి నిందితుని తరఫు న్యాయవాదులు ఎలాంటి కారణాలూ చూపలేదు. శిక్షను నిలిపివేయాలని కోరుతూ దాఖలు చేసిన వాజ్యాన్ని తిరస్కరిస్తున్నాం' అని జస్టిస్ రవీందర్ దుడేజా స్పష్టం చేశారు. ఉన్నావ్ బాధితురాలి తండ్రి మృతి కేసులో ట్రయల్ కోర్టు 2020 మార్చి 13న సెంగార్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా విధించింది. ఒక కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని హతమార్చినందుకు దోషి విషయంలో ఎలాంటి సానుభూతి చూపలేమని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసులో కుల్దీప్ సెంగార్ సోదరుడు అతుల్ సింగ్ సెంగార్‌తో పాటు మరో ఐదుగురికీ పదేళ్ల జైలు శిక్ష విధించింది న్యాయస్థానం. సెంగార్ అండతో పోలీసులు.. బాధితురాలి తండ్రిని హింసించారు. చివరకు ఆయన.. 2018 ఏప్రిల్ 9న మరణించాడు. ఈ అత్యాచార కేసులో నిందితునికి జీవితాంతం జైలుశిక్ష విధించిన డిసెంబర్ 2019 నాటి తీర్పునకు వ్యతిరేకంగా.. అలాగే బాధితురాలి తండ్రి కేసులోనూ సెంగార్ దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. అత్యాచార కేసులో తనపై విధించిన శిక్ష, తీర్పును సవాలు చేస్తూ దాఖలు చేసిన అప్పీల్ పెండింగ్‌లో ఉండటంతో 2025 డిసెంబర్ 23న హైకోర్టు సెంగార్ శిక్షను నిలిపివేసింది. దీన్ని సవాల్ చేస్తూ సిబిఐ స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేసింది. కుల్దీప్ బయటకు వస్తే కేసుపై ప్రభావం పడే అవకాశముందని సిబిఐ పేర్కొంది. ఈ పిటిషన్‌ను 2025 డిసెంబర్ 29న విచారించిన సుప్రీం న్యాయస్థానం.. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది.

### హైవేకు 500మీటర్ల పరిధిలో మద్యం షాపుల తొలగింపు కేసులో

# రాజస్థాన్ హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే



**న్యూఢిల్లీ :** జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల పరిధిలో మద్యం షాపుల తొలగింపుపై సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారులపైన ఉన్న వైన్ షాపులను తొలగించడం లేదా తరలించాలంటూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైందేనని చెప్పిన సుప్రీం, కానీ తీర్పుపై సమగ్ర అధ్యయనం అవసరమని అభిప్రాయపడింది. రోడ్డు ప్రమాద మరణాలపై ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు, నిజానికి చాలా మరణాలు జరిగాయని పేర్కొంది. మద్యం మత్తులో వాహనం నడపడం పెను ప్రమాదానికి దారి తీస్తుందని చెప్పింది. భవిష్యత్తులో మద్యం విధానాన్ని రూపొందించే క్రమంలో ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. 2025 నవంబర్ 24న రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రామ్ స్వరూప్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సమస్య చాలా సున్నితమైనదని, పరిష్కారం కోసం కొన్ని విధానపర నిర్ణయాలను అమలు చేయాల్సి ఉంటుందని సుప్రీం కోర్టు పేర్కొంది. మద్యం వినియోగం, హైవేలపై ప్రమాదాలతో ముడిపడి ఉన్న మరణాలు ఒక ప్రధాన ప్రజా భద్రతా సమస్యగా మిగిలిపోయాయని ధర్మాసనం అభిప్రాయపడింది. దీని పరిష్కారానికి సమగ్ర విధానపర నిర్ణయం అవసరమని చెప్పింది.

**రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలపై స్టే**

మరోవైపు హైకోర్టు ఉత్తర్వును అమలు చేయడానికి అనుమతిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదించారు. ఏ పక్షానికి ఎటువంటి అవకాశం ఇవ్వకుండానే ఈ ఉత్తర్వును జారీ చేశారని పిటిషనర్ తరపున న్యాయవాది కోర్టుకు చెప్పారు. ఈ క్రమంలోనే రాజస్థాన్ ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అనేక నగరాలు, పట్టణాలు జాతీయ లేదా రాష్ట్ర రహదారులపై మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు. 500 మీటర్ల నియమాన్ని పూర్తిగా అమలు చేయడం వల్ల పెద్ద పట్టణ ప్రాంతాల్లో మద్యం దుకాణాలు తొలగిపోతాయని కోర్టుకు తెలిపారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల పరిధిలో ఎలాంటి మద్యం దుకాణాలు ఉండకూడదని సుప్రీంకోర్టు గతంలో ఆదేశించిందని గుర్తు చేశారు. అయితే ఈ రహదారులు నగరాలు, పట్టణాల గుండా వెళ్లే చోట ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. ఈ క్రమంలోనే మున్సిపల్ పరిధిలో మద్యం దుకాణాలపై అలాంటి నిషేధం ఉండదని ఆ ఉత్తర్వులపై తర్వాత స్పష్టత ఇచ్చారని వివరించారు. ఈ ఉత్తర్వు అమలులో ఆచరణాత్మక ఇబ్బందులను లేవనెత్తిన ఆయన, దానిని నిలిపివేయాలని పిటిషన్‌కు మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలోనే రెండు పక్షాల వాదనలు విన్న సుప్రీం కోర్టు, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది.

**రెండు నెలల్లో తొలగించాలని రాజస్థాన్ హైకోర్టు ఆదేశాలు**

అంతకుముందు హైవేలను లిక్కర్ ఫ్రెండ్లీ కారిడార్‌లుగా మార్చారంటూ రాజస్థాన్ ప్రభుత్వాన్ని హైకోర్టు విమర్శించింది. రోడ్డు ప్రమాద మరణాలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల పరిధిలో ఉన్న 1,102 మద్యం దుకాణాలను తొలగించడం లేదా మరో చోటుకు తరలించాలని ఆదేశించింది. మున్సిపల్, స్థానిక సంస్థలు లేదా చట్టబద్ధమైన అభివృద్ధి సంస్థల పరిధిలోకి వచ్చినా రాకపోయినా, రెండు నెలల్లోగా తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పింది. ఇంకా ప్రయాణికులకు కనిపించే విధంగా రహదారులపై మద్యం అమ్మకాలను ప్రోత్సహించే ఎలాంటి సైన్ బోర్డులు, హోర్డింగ్‌లు లేదా ప్రకటనలు ఉండకూడదని స్పష్టం చేసింది.

# ఓట్లు తొలగించేందుకు బిజెపి కుట్ర

ఫారమ్‌లపై ఫోరెన్సిక్ దర్యాప్తు జరపాలి : రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ దోత్రసా



**న్యూఢిల్లీ :** రాజస్థాన్‌లో బిజెపి ప్రతిపక్ష పార్టీకి మద్దతు ఇచ్చే ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుండి మోసపూరితంగా తొలగించడానికి కుట్ర చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడాన్ని ఎంత మాత్రమే అంగీకరించబోమని మండిపడింది. రాజస్థాన్‌లో ఓటర్ల తొలగింపుకు ఉపయోగించే ఫారమ్‌లపై ఫోరెన్సిక్ దర్యాప్తు జరపాలని కూడా ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేసింది. రాజస్థాన్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు టికారామ్ జుల్లీతో కలిసి రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ గోవింద్ సింగ్ దోత్రసా సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తన రాష్ట్రంలో 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ల జాబితా ప్రక్రియ తర్వాత, విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 45 లక్షల మంది గైర్హాజరు, బదిలీ లేదా మరణించినట్లు తేలిందని, జనవరి 15 వరకు అభ్యంతరాలకు అవకాశం ఇచ్చారన్నారు. 'జనవరి 3 వరకు ఎటువంటి గందరగోళం లేదు. మొత్తం వ్యవస్థ సజావుగా నడుస్తోంది. అయితే, జనవరి 3న, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థ) బి ఎల్ సంతోష్ రాజస్థాన్‌ను సందర్శించి, అక్కడ సమావేశం నిర్వహించారు. ఆపై మోసపూరితంగా ఓట్లను చేర్చడం, తొలగించడం ప్రారంభమైంది' అని ఆయన ఆరోపించారు. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుండి తాను పొందిన డేటాను మీడియాతో పంచుకున్నారు. డిసెంబర్ 17 నుండి జనవరి 14 వరకు, బిజెపి 937 బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ఎ) ద్వారా 211 పేర్లను చేర్చడానికి, 5,694 ఓట్లను తొలగించడానికి దరఖాస్తులను సమర్పించిందని వెబ్‌సైట్ ద్వారా వెల్లడైందన్నారు. కాంగ్రెస్ పార్టీ 110 బిఎల్ఏల ద్వారా 185 పేర్లను చేర్చడానికి, రెండు పేర్లను తొలగించడానికి దరఖాస్తులను సమర్పించిందని, అని దోత్రసా చెప్పారు. ఎన్నికల కమిషన్ గత గురువారం గోవా, లక్షద్వీప్, రాజస్థాన్, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల డ్రాఫ్ట్ రోల్స్‌పై వాదనలు, అభ్యంతరాలను దాఖలు చేయడానికి చివరి తేదీని జనవరి 19 వరకు పొడిగించింది. ఇసి పాత షెడ్యూల్ ప్రకారం, డిసెంబర్ 16, 2025న ప్రచురించబడిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాలపై వాదనలు, అభ్యంతరాలను ఓటర్లు జనవరి 15 వరకు దాఖలు చేయాల్సి ఉంది. పేర్లు తొలగించబడిన వారు ఇప్పుడు జనవరి 19వరకు వాదనలు దాఖలు చేయవచ్చని ఇసి తన సూచనలలో తెలిపింది.కాంగ్రెస్ భావజాలంతో అనుసంధానించబడిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడానికి గడువును పొడిగించడానికి బిజెపి, ఎన్నికల కమిషన్ కుట్ర పన్నుతాయని తాము ఇప్పటికే అనుమానించామని, సరిగ్గా అదే జరిగిందన్నారు. ఝుంఝునులో పేర్ల తొలగింపు కోసం ఒకే రోజులో 13,882 ఫారం 7 దరఖాస్తులు వచ్చాయని, మాండవాలో, 16,276, ఉదయపూర్వతిలో 1,241, ఖేత్రిలో, 1,478 వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఇయితే 140,000 ఫారాలు ఇప్పటికే నమోదు అయ్యాని దోత్రసా చెప్పారు. రాజస్థాన్ కాంగ్రెస్ చీఫ్ తన పార్టీ రాష్ట్రంలో ఈ ప్రజాస్వామ్య ఖూనిని అనుమతించదన్నారు. పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్మికులు, బూత్‌స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు, తద్వారా చట్టబద్ధమైన ఓటు తొలగించబడదు. హోంమంత్రి అమిత్ షా జనవరి 13న రాష్ట్రాన్ని సందర్శించి ముఖ్యమంత్రి నివాసంలో బస చేశారని, జనవరి 3–13 మధ్య 'రహస్య ఆపరేషన్' జరిగిందని దోత్రసా పేర్కొన్నారు.

### భారత్ చేరుకున్న

# యుఎఇ అధ్యక్షుడు

స్వయంగా స్వాగతం పలికిన మోదీ

**న్యూఢిల్లీ :** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్ చేరుకున్నారు. ప్రధాని మోదీ స్వయంగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లి ఆయనకు స్వాగతం పలికారు. యుఎఇ అధ్యక్షుడిని ఆలింగనం చేసుకోవడంతో పాటు ఎయిర్‌పోర్ట్ నుంచి వారిద్దరూ ఒకే కారులో ప్రయాణించారు. ఆ తర్వాత మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఆయన కుటుంబ సభ్యులను కొత్త అధికార నివాసానికి మోదీ తీసుకెళ్లారు. భారత సంప్రదాయ బహుమతులను వారికి అందజేశారు. సుమారు రెండు గంటల అధికార పర్యటనకు వచ్చిన యుఎఇ అధ్యక్షుడితో పలు అంశాలపై ప్రధాని మోదీ చర్చించారు. ఆయనను ఆత్మీయ మిత్రుడిగా ఎక్స్ పోస్ట్‌లో మోదీ అభివర్ణించారు.కాగా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో యూఏఈ అధ్యక్షుడు అల్ నహ్యాన్ భారత్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకున్నది. ప్రధాని




మోదీ ప్రత్యేక ఆహ్వానం మేరకు రెండు గంటల పర్యటనకు ఆయన విచ్చేశారు. యుఎఇ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత్‌లో పర్యటించడం ఇది మూడోసారి. గత పదేళ్లలో ఐదో పర్యటన కావడం విశేషం.

# డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ చట్టం కింద చర్యలు తీసుకోండి

ఐదు కేంద్రపాలిత ప్రాంతాల ఎల్జీలకు అధికారం ఇచ్చిన కేంద్రం

**న్యూఢిల్లీ :** క్యాన్సర్, డయాబెటిస్ వంటి కొన్ని వ్యాధుల చికిత్సకు సంబంధించిన ఔషధాల విషయంలో తప్పుదారి పట్టించే ప్రకటనలపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఔషధాలకు సంబంధించి తప్పుడు, తప్పుదారి పట్టించే ప్రకటనల విషయంలో ఏదైనా ప్రాంగణంలో సోదాలు జరపడానికి, అక్కడి ఏదైనా రికార్డును స్వాధీనం చేసుకోవడానికి ఐదు కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా నిర్వాహకులు అధికారాలను ఇచ్చింది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ చట్టం (అభ్యంతరకర ప్రకటనలు) కింద ఈ చర్యలు తీసుకునే అధికారం ఐదు కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా నిర్వాహకులకు కేంద్రం ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వు జారీ చేసింది. జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలి, డామన్ అండ్ దయ్యూ, పుదుచ్చేరి వంటి కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా నిర్వాహకులకు అధికారాలను అప్పగించింది. 'లక్షద్వీప్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలి, డామన్ అండ్




దయ్యూ, పుదుచ్చేరి, జమ్ముకశ్మీర్ వంటి కేంద్రపాలిత ప్రాంతాల నిర్వాహకుడు (లెఫ్టినెంట్ గవర్నర్ లేదా అడ్మినిస్ట్రేటర్) రాష్ట్రపతి నియంత్రణకు లోబడి ఉండాలి. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వారి సంబంధిత కేంద్రపాలిత ప్రాంతాల్లో డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ చట్టం (అభ్యంతరకర ప్రకటనలు) 1954 (1954లో 21) కింద అధికారాన్ని వినియోగించుకోవాలి. అలాగే విధులను నిర్వర్తించాలని రాష్ట్రపతి ఆదేశించారు' అని కేంద్ర హోం శాఖ ఉత్తర్వులో పేర్కొంది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటనలు) చట్టం 1954 అనేది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో కనిపించే ఆయుశ్ మందులు, ఇతర మెడిసిన్, ఔషధాలకు సంబంధించిన తప్పుదారి పట్టించే ప్రకటనలు, అతిశయోక్తి వాదనల నిషేధానికి సంబంధినది. ఈ చట్టం గెజిటెడ్ అధికారులు ఏదైనా ప్రాంగణంలోకి ప్రవేశించి అక్కడ సోదాలు జరపడానికి, తప్పుదారి పట్టించే, అనుచిత ప్రకటనలకు సంబంధించిన ఏదైనా రికార్డును పరిశీలించడానికి లేదా స్వాధీనం చేసుకోవడానికి, డిఫాల్ట్ కేసులపై చర్య తీసుకోవడానికి ఇది కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా అడ్మినిస్ట్రేటర్‌కు అనుమతిస్తుంది. మధుమేహం, ఊబకాయం, క్యాన్సర్ సహా 54 రకాల వ్యాధులు, రుగ్మతల చికిత్స కోసం కొన్ని ఔషధాల ప్రకటనలను ఈ చట్టం నిషేధిస్తుంది. ఈ వ్యాధులు చట్టం నిషేధించిన షెడ్యూల్ కిందకు వస్తాయి. రోగాల నివారణకు ఔషధాలను ప్రోత్సహించడం లేదా మార్కెటింగ్ చేయకుండా చట్టం ఔషధ కంపెనీలను నిషేధిస్తుంది. చట్టంలో పేర్కొన్న ఏదైనా వ్యాధి, రుగ్మతను నయం చేయడం, తగ్గించడం, చికిత్స చేయడం, నివారణ కోసం ఆ ఔషధాన్ని ఉపయోగించడాన్ని సూచించే ఏదైనా ప్రకటన ప్రచురణలో ఏ వ్యక్తి కూడా పాల్గొనకూడదని పేర్కొంది. ఈ క్రమంలోనే కేంద్రం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్ అండ మ్యాజిక్ రెమెడీస్ చట్టం (అభ్యంతరకర ప్రకటనలు) కింద ఈ చర్యలు తీసుకునే అధికారం ఐదు కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు లేదా నిర్వాహకులకు కేంద్రం ఇచ్చింది.

# లద్ధాఖ్‌లో భూకంపం..

### లేహ్‌లో 5.7 తీవ్రతతో ప్రకంపనలు



**లేహ్:** కేంద్రపాలిత ప్రాంతమైన లద్ధాఖ్‌లో సోమవారం భూకంపం సంభవించింది. 5.7 తీవ్రతతో కూడిన భూ ప్రకంపనలు లేహ్‌ను కుదిపేశాయి. ఉదయం 11:51 గంటలకు ఈ భూకంపం సంభవించినట్లు జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం (ఎన్‌సీఎస్) తెలిపింది. కార్గిల్‌కు వాయువ్య దిశలో 290 కిలోమీటర్ల దూరంలో, 171 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. కాగా, లద్ధాఖ్‌లోని లేహ్‌తో పాటు జమ్ముకశ్మీర్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె), భారత్‌కు ఉత్తరాన ఉన్న పొరుగు దేశాల సమీప ప్రాంతాల్లో కూడా భూమి కంపించినట్లు ఎన్‌సిఎస్ వివరించింది. మధ్య ఆసియాలోని తజికిస్థాన్ వరకు భూ ప్రకంపనలు వ్యాపించినట్లు వెల్లడించింది. మరోవైపు ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు ఎలాంటి సమాచారం అందలేదని ప్రభుత్వ అధికారులు తెలిపారు. లద్ధాఖ్‌లోని లేహ్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

# సమస్యాత్మక ఓటర్ల పేర్ల జాబితా పంచాయతీ భవన్ల వద్ద నోటీసుబోర్డ్‌లో పెట్టండి

బెంగాల్‌లో 'సర్'పై ఇసికి సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ:** ఓటర్ల పేర్లు, ఇతర వివరాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే అలాంటి ఓటర్లందరినీ కలిపి ఒక జాబితాగా తయారు చేసి పశ్చిమ బెంగాల్ పంచాయతీ భవనాల వద్ద నోటీసు బోర్డుల్లోఅంటించాలని ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ కార్యాలయాలు లేదా బ్లాక్ కార్యాలయాలవద్ద వారి నుండి తగిన అధికారిక పత్రాలను, వివరాలను సేకరించాలని, వారి అభ్యంతరాలు తెలియజేసే అవకాశం ఇవ్వాలని కోరింది. అదేవిధంగా సమస్యాత్మక ఓటర్లు వారికి సంబంధించిన సవరణలను, సంబంధిత ఆధారిత పత్రాలను సమర్పించే ప్రక్రియ సజావుగా, సక్రమంగా పూర్తయ్యేవిధంగా చూడాలని, ఈ విషయంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా భరోసా ఇవ్వాలని పశ్చిమ



బెంగాల్ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్‌కు కూడా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా ఈ ప్రక్రియ సజావుగా సక్రమంగా కొనసాగేందుకు తగినంతమంది సిబ్బందిని సమకూర్చాలని, పంచాయతీ భవనాలవద్ద సంబంధిత విభాగాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఆదేశాలు ఇచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో 1.25 కోట్ల మంది ఓటర్ల పేర్లు సమస్యాత్మకంగా ఉన్నాయి. ఈ ఓటర్లకు సంబంధించిన ఆధార పత్రాలు, ఇతర సాక్ష్యాధారాలను పంచాయతీ కార్యాలయాలవద్ద సమర్పించేందుకు అవకాశం ఇవ్వాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. సర్ ప్రక్రియలో సమస్యలు ఎదుర్కొనే ఓటర్లు తమ అభ్యంతరాలను, సాక్ష్యాధారాలను సమర్పించేందుకు అనివార్యంగా తగిన అవకాశం ఇవ్వాలని, వారి సమస్యలను జాగ్రత్తగా ఆలకించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సమస్యాత్మక ఓటర్లతో సహా పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో విధానపరమైన అవతవకలు,నిరంకుశత్వం కొనసాగుతోందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా,జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం పై విధంగా మార్గదర్శకాలు జారీ చేసింది. అదేవిధంగా పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ వల్ల నష్టపోయేందుకు అవకాశం ఉన్న ఓటర్లు సంబంధిత తమ ఆధారాలను, ఇతర పత్రాలను సమర్పించేందుకు, అభ్యంతరాలు తెలియజేసేందుకు పూర్తి అవకాశం ఇవ్వాలని కూడా ఆదేశించింది. 2002 ఓటర్ల జాబితాతో ముడిపడిన సంతానానికి ఈ సర్ ప్రక్రియలో తార్కిక వ్యత్యాసాలు, సమస్యలు అంటే తల్లిదండ్రుల పేర్లులో తేడాలు ఉండటం, తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య నిర్దేశించిన విధంగా 15 ఏళ్ళు అంతకంటే ఎక్కువగా 50 సంవత్సరాలు వయసు తేడాలు ఉండాలన్న విషయాలపై ఎక్కువగా సమస్యలు తలెత్తుతున్నాయి.

# లౌకికవాదానికి బలమైన కోట 'కేరళ'

ముఖ్యమంత్రి పినరయి విజయన్

**కొల్లం :** కేరళను లౌకికవాదానికి బలమైన కోటగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభివర్ణించారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో కులం, మతం పేరుతో జరిగే దారుణాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దక్షిణాది రాష్ట్రానికి ప్రత్యేక లక్షణాలు ఉన్నాయని, బలమైన లౌకిక ఆధారాలు కేరళను ఇతర రాష్ట్రాల కంటే ఒక నమూనాగా నిలుస్తున్నాయని తాను గమనించానన్నారు. శ్రీ నారాయణ గురు సాంస్కృతిక సముదాయంలో సాధువు, సామాజిక సంస్కర్త, పునరుజ్జీవనోద్యమ నాయకుడు శ్రీ నారాయణ గురు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత ముఖ్యమంత్రి మాట్లాడారు. మహిళలు, పిల్లలపై దాడులు, మత అల్లర్లు, హత్యల నివేదికలు ఇతర చోట్ల పెరుగుతున్నప్పటికీ, కేరళ తన లౌకికత్వానికి కట్టుబడి ఉందని వామపక్ష అనుభవజ్ఞుడు చెప్పారు. 'ఈ మధ్య,



కేరళ లౌకికవాదానికి బలమైన కోటగా నిలుస్తోంది. శ్రీ నారాయణ గురు జోక్యం రాష్ట్ర లౌకిక ప్రమాణాలకు బలమైన పునాది వేసిందని సందేహం లేకుండా చెప్పగలం' అని ఆయన అన్నారు. సాంస్కృతిక సముదాయాలు కేవలం భౌతిక నిర్మాణాలుగా మాత్రమే కాకుండా, సంభాషణ, కళాత్మక వ్యక్తీకరణ, గురువు బోధనల నుండి ప్రేరణ పొందిన ప్రగతిశీల సామాజిక ఆలోచనల ప్రచారానికి స్థలాలుగా పనిచేయాలని విజయన్ నొక్కి చెప్పారు.

# మున్సిపల్ పోల్స్‌కు పచ్చజెండా

రాష్ట్రంలోని పురపాలక సంఘాలకు ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాలని ఆదివారం మేడారంలో జరిగిన మంత్రివర్గ సమావేశం నిర్ణయించటంతో, గడువు ముగిసిన 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్‌లకు రాష్ట్ర ఎన్నికల సంఘం నేడో రేపో ఎన్నికల షెడ్యూలు విడుదల చేయనుంది. 2025 డిసెంబర్‌లో పార్టీరహిత ప్రాతిపదికగా గ్రామ పంచాయతీ ఎన్నికలు కోలాహలంగా ముగిసాయి. డిసెంబర్ 22వ తేదీన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు పదవీ ప్రమాణం స్వీకరించటంతో పల్లెల్లో కొత్త ప్రజాస్వామిక పాలన పునరారంభమైంది.

ఔటర్ రింగ్ రోడ్డు లోపల, జిహెచ్‌ఎంసి పరిధికి వెలుపల ఉన్న 7 మున్సిపల్ కార్పొరేషన్‌లు, 20 మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసే అధికారిక లాంఛనాలు పూర్తి కావటంతో తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీల సంఖ్య 121కి, మున్సిపల్ కార్పొరేషన్‌ల సంఖ్య 10కి తగ్గింది. వాటిలో పాలకమండళ్ల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగుతాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీ రహిత ప్రాతపదికన జరిగినందున ప్రధాన రాజకీయ పార్టీల్లో ప్రతి ఒక్కటి తాము గెలిచిన పంచాయతీల సంఖ్యను తమ ఇష్టానుసారం ప్రచారం కోసం ప్రకటించుకున్నాయి. ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు జరగాల్సి ఉంది. గ్రామపంచాయతీ ఎన్నికలు డిసెంబర్‌లో జరపడం వల్లనే అభివృద్ధి నిధుల కోసం ఆత్రుతతో ఎదురుచూస్తున్న పంచాయతీలకు కేంద్రం నుండి చట్ట ప్రకారం అందాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధుల రాక మొదలైంది.

గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు చట్టరీత్యా 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం డేటా సేకరణపరంగా, శాసనపరంగా, కేంద్రం ఆమోదం కోసం ఒత్తిడి చేసేందుకు ఆందోళన నిర్వహణ పరంగా చేసిన సర్వ ప్రయత్నాలూ మోదీ ప్రభుత్వం ముందు చెవిటివాని ముందు శంఖం ఊదిన చందమే అయింది. అన్ని రకాల రిజర్వేషన్లు కలిసి సుప్రీంకోర్టు విధించిన 51 శాతం పరిమితి పెంపుదలకుగాని లేదా తెలంగాణ శాసనాన్ని రాజ్యాంగం 6వ షెడ్యూల్ చేర్చి పెంచిన రిజర్వేషన్లకు రక్షణ కల్పించేందుకుగానీ కేంద్రం ప్రయత్నం చేయలేదు. దాంతో గతంలో చట్టం ప్రకారం ఉన్న 27శాతం బిసి రిజర్వేషన్‌తోనే ఎన్నికలకు వెళ్లాల్సి వచ్చింది, వస్తున్నది. అయితే బిసి సంఘాల వారు 42శాతం అమలును డిమాండ్ చేయడంలో తప్పులేదు. కానీ 42 శాతం అమలులోకి తెచ్చే వీలు కల్పించని నరేంద్ర మోదీ ప్రభుత్వంతో కొట్లాడే బదులు, 42 శాతం సాధించేవరకు ఎన్నికలు జరిపితే భూకంపం సృష్టిస్తాయని బిసి నాయకులు పోటాపోటీగా రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేయడం గాడి తప్పిన ఆలోచనగా ఉంది. బిసి హక్కుల సాధనకై జీవితాన్ని వెచ్చించిన కృష్ణయ్య ఇప్పుడు బిజెపి రాజ్యసభ సభ్యుడిగా కూడా ఉన్నారు. ఆయన తమ న్యాయమైన కోర్కె సాధనకై కనీసం రెండు తెలుగు రాష్ట్రాల (ఇంతకుముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపిగా కూడా ఉన్నారు) ఎంపిలను కూడగట్టి ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్తే ఏమైనా ప్రయోజనం ఉంటుందేమో ప్రయత్నించాలి. మండల్ కమిషన్ సిఫారసులు అమలులోకి రావడానికి ఎన్ని సంవత్సరాలు పట్టిందీ గుర్తుకు తెచ్చుకోవాలి. ఒక సామాజిక, రాజకీయ సంస్కరణ సంబంధీకులు తొందరపడినంతగా అమలులోకి రాదు. తమ కోర్కెను బలపరిచేందుకు, కేంద్రం అనుమతి లభిస్తే అమలు చేసేందుకు సంసిద్ధంగా ఉన్న ఒక రాష్ట్ర ప్రభుత్వం దొరికినందుకు సంతోషించాల్సింది పోయి దానినే బదనాం చేయటం సమంజసమని ప్రజలు భావించరు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిసిలు శక్తి మేరకు గెలిచారు. రేపు మున్సిపల్ ఎన్నికల్లో సైతం రిజర్వేషన్ల వెలుపల కూడా గెలుస్తారు. 42శాతం అమలు జరిగే వరకు ఎన్నికలు జరపకూడదన్న వాదన అప్రజాస్వామికం, స్థానిక అభివృద్ధికి వ్యతిరేకమవుతుంది.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సర్వసన్నద్ధంగా ఉంది. మంత్రివర్గ నిర్ణయం దరిమిలా, ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నుంచి ఇసి రాణి కుమిదినికి అధికారిక లేఖ అందింది. ఈ ఎన్నికల్లో మొత్తం 52,43,023 మందికి ఓటు హక్కు ఉంది. వారిలో పురుషులు 25,62,369 మంది, కాగా స్త్రీలు 26,86,014, ట్రాన్స్‌జెండర్లు 640. మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి శనివారం నాడు ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితా ప్రకటించారు. డెడికేటెడ్ కమిషన్ నిర్ణయం ప్రకారం రాష్ట్రం యూనిట్‌గా 121 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్ల ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇసి ప్రకటించారు.

నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా 1,34,774 మంది కొత్తగూడెంలో ఉన్నారు. మున్సిపాలిటీల్లో అధికంగా 1,43,655 మంది ఓటర్లు ఆదిలాబాద్‌లో, అత్యల్పంగా 9,147 మంది అమరచింతలో ఉన్నారు. అన్ని కేటగిరిల్లో మహిళలకు చట్ట ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు ఖరారు చేశారు. 10 కార్పొరేషన్స్ మేయర్ పదవులను ఎస్‌సి, ఎస్‌టిలకు చెరొకటి, బిసిలకు 3 (ఒకటి మహిళ), జనరల్ 5. మున్సిపల్ చైర్మన్ పదవులు 121లో ఎస్టి 5 (మహిళ 2), ఎస్సీ 17 (మహిళ 8), బిసి 38 (మహిళ 19), జనరల్ 61 (మహిళ 31).

పట్టణ, నగర స్థాయిల్లో ఇది ప్రజాస్వామ్యం పండుగ. గ్రామపంచాయతీల్లో 60శాతం పైగా తమ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిచినట్లు చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మున్సిపల్ ఎన్నికల్లో అంతకుమించి అనుకూల ఫలితాలు ఆశిస్తున్నారు. పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికల్లో ఏ పార్టీకైనా క్లెయింలకు అవకాశముండదు.



## శాశ్వత పరిష్కారం చూపాలి

దేశంలో వీధి కుక్కల సమస్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాలి. సాధారణంగా సమాజంలో కుక్క మనిషిని కరవడం తప్పే. ఆ ఒక్క మూగజీవి కోసం మిగతా కుక్కలను ఎందుకు బలి చేయాలి? వంద కుక్కలు ఉంటే అందులో 5 కుక్కలు మాత్రమే మనుషులను కరిస్తే మిగతా 95 కుక్కలను కూడా చంపేస్తున్నారు. ఆ విధానం సరికాదు. మనిషిని కుక్క కరిస్తే స్పందించే వ్యవస్థలు, రోడ్డు ప్రమాదాలు, హత్యలు, అత్యాచారాలు, డెంగీ, మలేరియా, ఇతర వ్యాధుల బారినపడి సంభవించే మరణాలు, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవడం, చిన్నారుల జరుగుతున్న అత్యాచారాలపై ఎందుకు స్పందించడం లేదు? మనుషులతో పాటు అన్ని ప్రాణులకు జీవించే హక్కు ఉంది.

ప్రముఖ సినీ నటి రేణూ దేశాయ్



## భూగర్భజలాల సంక్షోభం – ముప్పులో రేపటి జీవితం

నీరు లేకుండా జీవితం ఊహించలేం. అయినప్పటికీ, మనం నీటి విలువను సరిగ్గా గుర్తించకపోవడంవల్ల, ముఖ్యంగా భూగర్భజలాలు వేగంగా తగ్గిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే, భవిష్యత్తులో తాగు నీటి కోసం కూడా తీవ్ర సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఇది కేవలం రైతుల సమస్య మాత్రమే కాదు, మొత్తం సమాజం ఎదుర్కొంటున్న పెద్ద సమస్యగా మారబోతోంది. భూమిపై నీటి వాస్తవ స్థితి భూమి ఉపరితలంపై సుమారు 71 శాతం నీరు ఉంది. అయితే ఇందులో ఎక్కువ భాగం సముద్రాల్లో ఉన్న ఉప్పు నీరు. దాదాపు 97 శాతం ఉప్పు నీరు కాగా, కేవలం 3 శాతం మాత్రమే తీపి నీరు. ఈ తీపి నీటిలో కూడా పెద్ద భాగం మంచు రూపంలో లేదా మనకు చేరని ప్రాంతాల్లో ఉంది. నిజంగా తాగడానికి, వ్యవసాయానికి ఉపయోగపడే నీరు మొత్తం నీటిలో ఒక శాతం కంటే కూడా తక్కువ. అంటే మనం వినియోగిస్తున్న నీరు అత్యంత పరిమితమైన వనరు. భూగర్భజలాలు 30 శాతం కంటే ఎక్కువ తగ్గుదలకు దారి తీస్తే తీవ్రమైన సంక్షోభం ఎదుర్కోవాల్సి వస్తుంది అని నిపుణులు చెపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడిన ప్రాంతాల్లో, భూగర్భజలాల వినియోగం గత కొన్ని సంవత్సరాల్లో గణనీయంగా పెరిగింది. ఎక్కువగా బోర్లు వేయడం, నీటి అవసరం అధికంగా ఉండే వరి, మొక్కజొన్న వంటి పంటలను అధికంగా సాగు చేయడం, వర్షపు నీటిని నిల్వ చేయకపోవడం, చెరువులు, కుంటలు పూడికతో నిండిపోవడం, చెట్ల నరుకుడు వంటి కారణాలు భూగర్భజలాల తగ్గుదలకు ప్రధాన కారణాలుగా మారాయి. అదేవిధంగా, వర్షపాతం తగ్గినా, పడిన వర్షం నేలలోకి చేరకుండా వృథాగా పోతుండడం కూడా మరో పెద్ద సమస్య. భూగర్భజలాలు తగ్గితే వచ్చే పరిణామాలు భూగర్భజలాలు తగ్గితే ముందుగా బోర్లు ఎండిపోతాయి. దాంతో తాగునీటి కొరత ఏర్పడుతుంది. వ్యవసాయం దెబ్బతింటుంది, పంట దిగుబడులు తగ్గుతాయి, రైతులు అప్పుల పాలవుతారు. గ్రామాల్లో జీవనాధారం కష్టమవడంతో ప్రజలు పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది. దీర్ఘకాలంలో ఆహార కొరత, ఆరోగ్య సమస్యలు, సమాజంలో ఘర్షణలు పెరిగే ప్రమాదం కూడా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే నీటి కోసం గొడవలు జరుగుతున్న పరిస్థితిని మనం చూస్తున్నాం.

ఈ పరిస్థితిని మార్చాలంటే ఇప్పుడే చర్యలు తీసుకోవాలి. రైతులు తక్కువ నీరు అవసరమైన పంటల వైపు దృష్టి పెట్టాలి. డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగించాలి. అవసరం లేకుండా వరుసగా బోర్లు వేయకుండా నియంత్రణ అవసరం. గ్రామ స్థాయిలో చెరువులు, కుంటలను పునరుద్ధరించడం, వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్) అమలు చేయడం, చెట్లు విస్తృతంగా నాటడం వంటి చర్యలు అత్యంత అవసరం. ప్రతి ఇంట్లో నీటి వృథాను తగ్గించే అలవాటు పెంపొందించాలి. నీరు కాపాడితేనే రేపటి జీవనం. నీరు కేవలం ఒక వనరు కాదు అది జీవనాధారం. నేడు మనం నిర్లక్ష్యం చేస్తే, రేపు మన పిల్లలకు తాగడానికి నీరు కూడా దొరకని పరిస్థితి రావచ్చు. అందుకే నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి పౌరుడి బాధ్యత. నీటిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటమే.

**– మలిపెద్ది పవన్‌కళ్యాణ్ (గుండాల)**
**7093052815**

# మేడారంలో ఆదివాసీ సాంస్కృతిక పునరుజ్జీవనం



తోట సుధాకర్
9440582716

మేడారం జాతరలో చేపడుతున్న గ్రానైట్ నిర్మాణాలు, గద్దెల పునరుద్ధరణ, ప్రాకారం, రాతి కట్టడాలపై శిల్పులు చెక్కిన బొమ్మలు ఆదివాసీల సాంస్కృతిక పునర్జీవనానికి ప్రతీకగా అభివర్ణిస్తున్నారు. ముఖ్యంగా కోయల చారిత్రక పూర్వపరాలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రతిబింబించే చిత్రాలను చెక్కుతున్నారు. ఆధ్యాత్మిక జీవన విధానానికి సంబంధించి చిహ్నాలతోపాటు కోయల జీవన విధానం, సమ్మక్క,సారలమ్మ, జంపన్న, పగిడిద్ద రాజు, గోవిందరాజుల చరిత్ర, కోయల గోత్రాలు వారి చరిత్రకు సంబంధించి ఆనవాళ్ళు, మూలాలు ప్రతిబింబించే చిహ్నాలను చెక్కుతున్నారు.


మేడారంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన మాస్టర్ ప్లాన్‌లో శాశ్వత నిర్మాణాలు చేపట్టడంతోపాటు ఆదివాసీల సాంస్కృతిక పునర్జీవనానికి వేదికగా తీర్చిదిద్దుతోంది. ప్రతీ రెండేళ్ళకోసారి జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర సందర్భంగా వచ్చే లక్షలాది భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా వందల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మాణాలు, వసతులు చేపట్టడం గత కొన్నేళ్ళుగా సాగుతోంది. ఈసారి మాత్రం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి భిన్నంగా మేడారంలో మాస్టర్ ప్లాన్ అమలుకు నిర్ణయం తీసుకున్నది. ఈ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దాదాపు రూ.250 కోట్ల వ్యయంతో శాశ్వత ప్రతిపదికన నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమైంది. దీనిలో భాగంగా సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణంలో పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ పనులను పూర్తిస్థాయిలో రాతి కట్టడాలు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు.

### నాలుగు వేల టన్నుల గ్రానైట్ వినియోగం

మేడారం గద్దెల ప్రాంగణంలో చేపడుతున్న రాతి కట్టడాల కోసం నాలుగువేల టన్నుల గ్రానైట్ వినియోగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని ఆళ్ళగడ్డ ప్రాంతంలోని ఈ ప్రత్యేక గ్రానైట్‌ను గద్దెల చుట్టూ రాతికట్టడం, ప్రాకారం, ప్రవేశ ద్వారాల నిర్మాణానికి వినియోగిస్తున్నారు. 500 సంవత్సరాలలో ఇలాంటి రాతి కట్టడం మరెక్కడా లేదంటున్నారు. చరిత్రలో ఒక మైలు రాయిగా నిలవనుంది. గద్దెల ప్రాంగణంలో చేపట్టిన నాలుగు వేల టన్నుల గ్రానైట్‌పై సమ్మక్క, సారలమ్మ తల్లుల చరిత్రను తెలియజేసే 7వేల బొమ్మలతో ప్రాంగణంలో నిర్మాణం శరవేగంగా కొనసాగుతోంది. టార్గెట్ వంద రోజుల లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి. ఈ నెల 12వ తేదీలోపు పనులను పూర్తిచేసి 19న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. రాయచోటి నుంచి తెప్పించిన భారీ గ్రానైట్‌రాళ్లను 600 కిలోమీటర్ల దూరంలోని మేదారానికి తరలించారు. వీటిని చెక్కేందుకు ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో దాదాపు 450 మంది కళాకారులు నెలల తరబడి రేయింబవళ్లు శ్రమించారు. అన్నమయ్య జిల్లాకు చెందిన కళాకారులు పాల్గొన్నారు.

### రాతి కట్టడాలపై కోయల చరిత్ర చిహ్నాలు

శిల్పాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు శిల్పాలు ప్రతీకలు గ్రానైట్ కట్టడాలపై సమ్మక్క, సారక్క, పగిడిద్దరాజు, గోవిందరాజు. కోయల ఇష్టదైవాలకు ప్రతిరూపంగా భావించే పులి, జింక, దుప్పి, పావురం, ఏనుగు, నెమలి, మొసలి. పశుపక్ష్యాదులతో పాటు వారి జీవనశైలి,



గ్రానైట్‌పై చెక్కిన కోయల చరిత్ర చిహ్నాలు

### ఆదివాసీ సాంస్కృతిక పునరుజ్జీవనం

మేడారం జాతరలో చేపడుతున్న గ్రానైట్ నిర్మాణాలు, గద్దెల పునరుద్ధరణ, ప్రాకారం, రాతి కట్టడాలపై శిల్పులు చెక్కిన బొమ్మలు ఆదివాసీల సాంస్కృతిక పునర్జీవనానికి ప్రతీకగా అభివర్ణిస్తున్నారు. ముఖ్యంగా కోయల చారిత్రక పూర్వపరాలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రతిబింబించే చిత్రాలను చెక్కుతున్నారు. ఆధ్యాత్మిక జీవన విధానానికి సంబంధించి చిహ్నాలతోపాటు కోయల జీవన విధానం, సమ్మక్క,సారలమ్మ, జంపన్న, పగిడిద్దరాజు, గోవిందరాజుల చరిత్ర, కోయల గోత్రాలు వారి చరిత్రకు సంబంధించి ఆనవాళ్ళు, మూలాలు ప్రతిబింబించే చిహ్నాలను చెక్కుతున్నారు. దీంతో ఇప్పటి వరకు కేవలం కొద్ది మందికే పరిమితమైన ఆదివాసీల ఆధ్యాత్మిక విధానం, జీవన విధానానికి సంబంధించిన చరిత్ర చిహ్నాలు శాశ్వతంగా భద్రపరిచేందుకు అవకాశం లభించింది. భవిష్యత్ తరాలకు ఈ చరిత్ర చాటిచెప్పే విధంగా నిర్మాణాలు సాగుతున్నాయి. గ్రానైట్ నిర్మాణాలు, గద్దెల పునరుద్ధరణ, ప్రాకారం, ద్వారాలు, భారీ తోరణాలు, ఆచార సంప్రదాయాలకు, గొట్టు, గోత్రాలకు ప్రతిరూపంగా భావించే సూర్యచంద్రులు, త్రిశూలం, నెలవంక, బండి చక్రాలు, అడ్డ నిలువు గీతలు స్తంభాల పై చెక్కారు. సమ్మక్క సారక్క వంశస్తులతోపాటు, 250 వంశాలకు చెందిన ఇంటి పేర్లు, మూలాలను శిలలపై చెక్కారు. తెల్లని గ్రానైట్ స్తంభాల ప్రధాన ద్వారం, ఆయా శిలలపై సమ్మక్క సారక్క పూర్వీకులతో పాటు కోయల జీవనశైలిని తెలిపేలా శిల్పాలు చెక్కారు. 3,4,5,6,7 గొట్టుగోత్రాలను బొమ్మలు చెక్కారు.శిలలపై ఆదివాసీల జీవన విధానం, వారి దేవతల బొమ్మలు, ఇంకా 750 కోయ ఇంటి పేర్ల జీవన చిత్రాలను గీశారు. స్వాగత తోరణం పై 58 బొమ్మల్లో సమ్మక్క వంశీయుల మూలాలు, పక్షులు, జంతువుల బొమ్మలున్నాయి. సమ్మక్కకు చెందిన రాయి బందానీ వంశంలోని 5వ గొట్టు ఒంటికొమ్ము దుప్పి, అడవి దున్న కొమ్ములు, ఆరు నెమలి ఈకలు చిత్రించారు.మరో ప్రధాన ద్వారంపై మూడో గొట్టు సారక్క వంశవృక్షంతో పాటు వడ్డే గోత్రం సిద్ద బోయిన, కొక్కెర వంశం వృక్షాన్ని తెలియజేస్తోంది. మూడు నిలువు, అడ్డం గీతలు, మూడో గొట్టు గోత్రం గురించి తెలిపే గుర్తులున్నాయి. త్రిభుజాలు పగిడిద్దరాజు సమ్మక్క నాగులమ్మల బిడ్డ సారలమ్మ రాజ్యం మూడో గొట్టుకు ప్రతీకగా నిలుస్తోంది.

### ఒక్కో చిత్రం.. ఒక్కో చరిత్ర


చతురస్రం సగం ముక్కలు, ఎడమవైపు రెండో పిల్లర్ మీద ఇప్ప చెట్టు, మూడోగొట్టు పవిత్ర వృక్షంగా చెబుతున్నారు. మనిషి చేతిలో బాణం,ఉడుము, మూడో గొట్టు వారు పూజించే జంతువు ఎనిమిది లతలు, ఎనిమిదో గొట్టు రాజ్యం గుర్తు, ఎక్స్ ఆకారం, ఎనిమిదోగొట్టు వడ్డె గోత్రంగుర్తుగా చెబుతున్నారు. సమ్మక్క తల్లిది 5వ గొట్టు, సారలమ్మది 3వ గొట్టు, ఆదమరాజు వంశ వృక్షం, వడ్డే గోత్రం సిద్దరబోయిన, కొక్కెర వంశ వృక్షం, శివ గొట్టు నాగులమ్మ రాయి బందనీ వంశం, పగిడిద్దరాజు, గోవిందరాజుల మూలాలకు ప్రతీకగా ఐదు నిలువు గీతలు ఐదవ గొట్టును తెలియజేస్తుంది.ప్రాచీన అఖండ భారత భూభాగంలోని 18 దిక్కులను తెలియజేస్తుంది. ఉత్తరభారతాన మూడో గొట్టు 36 రాజ్యాలను, దక్షిణాన ఆరో గొట్టు 18 రాజ్యాలు పాలించినట్లు కోయల చరిత్ర చెబుతున్నది. వీటితో పాటు నెలవంక, ఏనుగు, ఆరో గొట్లు బేరం వంశం వారి నుదుటి బొట్టును తెలియజేస్తోందన్నారు. మూడు అడ్డగీతలు మధ్యలో చుక్క, ఆది శక్తి మళ్లీ సమ్మక్క రూపంలో అవతరించిందని కోయలు సమ్ముతారు. సమ్మక్క తల్లి పులి రూపంలో ఉంటుందన్నది కోయల విశ్వాసం. కోయత్వర్ ధర్మ చిహ్నం: కోయల ఇంటి పేర్లు, సంప్రదాయాలతో పాటు పశుపతి బేరంబోయిన రాజు ధర్మం దిశానిర్దేశంగా భావిస్తారు. తూతకొమ్ము కోయలు వేల్పు పండగ, చక్రం రంభ, నాగుపాము, ఐదు పలకల గుర్తు ఐదో గొట్టు రాజ్యం గుర్తుకు ప్రతీక, నాలుగు నిలువు గీతలు నాలుగో గొట్టును, కంకవనం ఐదో గొట్టు గోత్రం వృక్షం వెదురు చెట్లు, పక్షి పావురం, తెల్లగుర్రం, స్వస్తిక్: కోయ రాజ్యాలు పూర్వం వ్యాపారాలకు ప్రతీకగా నెమలిని సమ్మక్క తల్లి ప్రతిరూపంలో భావిస్తారు.

### ఒక్కో బొమ్మకు ఒక్కో అర్థం

మారేడు చెట్టును బందానీ వంశం పూజిత వృక్షంగా, 7వ గొట్టు గట్టు పొరేడు వంశస్తులది. ఇది వారి నుదుటి బొట్టును తెలియజేస్తోంది. శివ లింగాలు, వెంకన్న నామాలు కూడా. గోవిందరాజుల ప్రధాన గద్దలపై తిరుపతి వెంకన్న నామాలు, శంకు, స్వస్తిక్ వంటి చిత్రాలు ఉన్నాయి. ఎండి ముక్కు కొకాడి, పైడిముక్కు కోకాడి, ఎద్దు వన్దే గోత్రం మూగ గొట్టు సుదుటి బొట్లు, మూడు అడ్డ గీతలు మధ్యలో చుక్క, ఖడ్గమృగం నిలువు గీత నాల్గవ గోట్టు సనపగాని మతం నుదుటి బొట్టును తెలియజేస్తుంది. వీళ్ల గోత్ర జంతువు ఖడ్గమృగం, త్రిశూలం, ఒంటికొమ్ము దుప్పి, త్రిశూలం ఐదో గొట్టు రాయి బందానీ వంశం నుదుటి బొట్టును తెలియజేస్తుంది. వీళ్ల గోత్ర పూచిత జంతువు ఒంటికొమ్ముదుప్పిగా చెబుతున్నారు. మరుబోతు: సంవంకలో చుక్క ఏదో గొట్టు పాలేడుగట్టు వంశం నుదుటి బొట్టును తెలుపుతుంది. మనుబోతు, సింహం, సూర్య చంద్రులు, కల కోడి, కలక తామరపువ్వు బొమ్మలను చిత్రీకరించారు. ఒక్కో బొమ్మకు ఒక్కో అర్థం, ఆచారం, సంప్రదాయం ఉందని కోయల చరిత్రపై పరిశోధన చేసిన అర్కిటెక్టులు చెబుతున్నారు.

# బడుగుల ఆరాధ్యదైవం ఠక్కర్ బాపా

**నేడు అమృత్ లాల్ విఠల్ దాస్ ఠక్కర్ వర్ధంతి**



దేశంలోని గిరిజన ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడిన వారిలో అమృత్ లాల్ విఠల్ దాస్ ఠక్కర్ ముఖ్యమైన వారు. సామాజిక కార్యకర్తగా పేరొందిన ఆయన ఠక్కర్ బాపాగా ప్రసిద్ధి చెందారు. ఠక్కర్ బప్పా 1869 నవంబర్ 29న గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర ప్రాంతంలోని భావ్‌నగర్‌లో మధ్యతరగతి లోహనా గుజరాతీ వైష్ణవ కుటుంబంలో జన్మించారు. అనారోగ్యంతో ఠక్కర్ బాపా 1951 జనవరి 20న మరణించారు. 1886లో ఆయన భావ్‌నగర్ హైస్కూల్ నుండి మెట్రిక్యులేషన్ పూర్తి చేసి సర్ జస్వంత్ సింగ్ జీ స్కాలర్‌షిప్ పొందారు. ఆయన తండ్రి విఠల్ దాస్ ఠక్కర్ ఆ బిడ్డకు అమృత్ లాల్ అని పేరు పెట్టారు. ఆయన 1890లో పూనా ఇంజనీరింగ్ కళాశాల నుండి సివిల్ ఇంజనీరింగ్ లైసెన్స్ పొందారు. ఆయన పోర్బందర్‌లో ఇంజనీర్‌గా పనిచేశారు, సాంగ్లి రాష్ట్రంలో చీఫ్ ఇంజనీర్‌గా కూడా పనిచేశారు, తరువాత బొంబాయి మునిసిపాలిటీలో ఇంజనీర్‌గా ఉద్యోగం పొందారు. బొంబాయి పట్టణం మొత్తం చెత్తను పారవేయాల్సిన చెత్తాచెదారాలతో దయనీయ పరిస్థితులను ఆయన మొదటిసారిగా ఇక్కడే చూశారు. స్వీపర్లు నివసిస్తున్న మురికి కాలనీలను చూసి అతను షాక్ అయ్యాడు, ముంబాయి ప్రజల కష్టాలను తీర్చడానికి తన జీవితాంతం అంకితం చేయాలని దృఢంగా నిర్ణయించుకున్నాడు. తమిళనాడులో ఠక్కర్‌ను 'రక్కర్ బాపా' యొక్క తమిళ వెర్షన్ అయిన 'అప్పా ఠక్కర్' అని పిలుస్తారు. బాపా చాలా పరిజ్ఞానం కలిగిన మేధావి. తరచుగా అతనిపై విసిరిన ప్రశ్నలకు తక్షణమే సమాధానమివ్వడం వల్ల, మద్రాస్ బాషా పదంలో 'అప్ప టక్కర్' అని పిలవడంలో 'అన్నీ తెలిసిన వాడు' అని అర్థం. ఆ తరువాత ఠక్కర్ తూర్పు ఆఫ్రికాలోని ఉగాండా (దేశం) రైల్వేలలో పనిచేశారు. 1914లో ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. అతను 1905లో గోపాల్ కృష్ణ గోఖలే స్థాపించిన సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీలో 1914లో సభ్యత్వం తీసుకున్నారు. అంట రానితనం, గిరిజనుల హక్కుల కోసం వాదించారు. 1922లో భీల్ సేవా మండల్‌ను స్థాపించారు. 1930–32లలో అటవీ నివాసలైన గిరిజన ప్రజలను సూచించడానికి 'ఆదివాసీ' అనే పదాన్ని ఠక్కర్ తొలిసారి ప్రాచుర్యంలోకి తెచ్చారు. 1932 హరిజన సేవక్ సంఘ్ ప్రధాన కార్యదర్శి అయ్యారు. ఠక్కర్ చొరవతోనే భారతీయ అదిమజాతి సేవక్ సంఘ్ స్థాపించబడింది. ఒక సందర్భంలో మహాత్మాగాంధీ బాపాను హరిజనుల తండ్రి అని పిలిచారు. మహారాష్ట్ర ప్రభుత్వం 2007లో ఠక్కర్ బప్పా ఆదివాసీ వస్తీ సుధారణ పేరుతో ఆదివాసీ గ్రామాలు, కాలనీలను మెరుగు పరచడానికి పథకాన్ని రూపొందించింది.

**– సుధాకర్.ఏ.వి**
**9000674747**

# నరేగా పునరుద్ధరణకు ఐక్యపోరాటాలు

కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి దాని స్థానంలో తెచ్చిన విబి జి రామ్ జిని రద్దు చేసి నరేగాను పునరుద్ధరించి పకడ్బందీగా అమలు జరపాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాలు నిర్వహించడానికి వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సంఘాల ఉమ్మడి వేదిక, నరేగా సంఘర్ష మోర్చా పిలుపునిచ్చాయి. ఢిల్లీలో ఈ అంశంపై హెచ్‌కెఎస్ సూర్జిత్‌భవన్‌లో మొదటి జాతీయ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ఇటీవల జరిగింది. ఇందులో వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాలు, నరేగా సంఘర్ష్ మోర్చ, కేంద్ర కార్మిక సంఘాలు సంస్థలతో కూడిన విస్తృత జాతీయ స్థాయి ఉమ్మడి వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశానికి అధ్యక్ష వర్గంగా వి.ఎస్.నిర్మల్ (బికెఎంయు) బి.వెంకట్ (ఏఐఏడబ్ల్యూ) ముఖేష్ నిర్వాసిత్ (నరేగా సంఘర్ష్ మోర్చా) అనురాధ తల్వార్, ముఖేష్ నిర్వాసిత్ వ్యవహరించారు. ప్రముఖ ఆర్థికవేత్త జయతి ఘోష్ సమావేశాన్ని ప్రారంభించారు. అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి గోరియా, నరేగా సంఘర్ష మోర్చా నుండి నిఖిల్ డే, వివిఎస్ గిరి ఎఐటియుసి, సుదీప్ దత్త సీఐటీయు, షహనాజ్ రఫిక్ ఐఎన్టీయూసీ, కిసాన్ మోర్చా ప్రతినిధులు రంజాన్ క్షీరసాగర్, ప్రేమ్ సింగ్ గెహ్లాట్, ఆర్.ఎస్.డాగర్ ఎఐఎస్‌కెఎస్, అర్చన ప్రసాద్, డాక్టర్ అర్తి, హిమాంగ్ రాజ్, హరీష్ బాల, సుభాష్ జాకర్, విక్రమ్ సింగ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న నరేగాను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం వ్యవసాయ కార్మికులకు పేద రైతులకు గ్రామీణ కార్మికులకు తీరని శాపంగా మారుతుందని సమావేశంలో మాట్లాడిన వక్తలు అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలను నిరోధించి కోట్లాదిమంది గ్రామీణ పేదలకు కొంతమేరకు ఉపాధి కలిగించడంలో ఉపాధి హామీ పథకం దోహదం చేసిందని, దానిని రద్దు చేయడం అంటే గ్రామీణ పేదల హక్కులపై ప్రత్యక్ష దాడే,గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడమేనన్నారు. కేంద్రం కొత్తగా తెచ్చిన చట్టం విబి జి రామ్ జి ('వికసిత్ భారత్ రోజ్గార్ యోజన అజీవిక హామీ మిషన్' (గ్రామీణ)) ఉపాధి పనులను కేంద్రం నిర్ణయించిన మేరకే, కేంద్రం నోటిఫై చేసిన గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే అమలు చేస్తుందని, వేతనాల చెల్లింపు బాధ్యతను నీరుగారుస్తుందని, కేంద్రం నిధులను 90 శాతం నుండి 60 శాతానికి తగ్గించడం, రాష్ట్రం నిధులను 10 శాతం నుండి 40 శాతానికి పెంచడం వలన రాష్ట్రాలపై గణనీయమైన ఆర్థికభారం పడుతుందని, ఇది ప్రజాస్వామ్యం చట్రంలో సమాఖ్య వాదంపై దాడిగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి కొత్త చట్టాన్ని రద్దు చేసి నరేగాను పునరుద్ధరించేంతవరకు ఐక్యంగా పోరాడాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

**కేంద్ర ప్రభుత్వం ఈ క్రింది డిమాండ్స్ ఆమోదించాలి.**

* గ్రామీణ కార్మికుల ఉపాధి హామీ, పని హక్కు, దానితో పాటు వారి గౌరవాన్ని హరించే విబి జి రామ్ జీని వెంటనే రద్దుచేసి ఎంజీ నరేగాను పునరుద్ధరించాలి.
* ప్రతి గ్రామీణ కార్మికుడికి సంవత్సరంలో 200 రోజులు పని కలిగించాలి, కనీస వేతనం రూ.700 ఇవ్వాలి.
* నరేగా పనులను ప్లాన్ చేయడానికి, అమలుకు గ్రామ సభల అనుమతి తప్పనిసరి చేయాలి.

**ఆందోళన పోరాట కార్యక్రమాలు**

* విబి జి రామ్ జి రద్దు, నరేగా పునరుద్ధరణ, పట్టిష్టంగా అమలు కోసం మొదటిదశగా నెలరోజుల పోరాట కార్యక్రమాన్ని సమావేశం నిర్ణయించింది.
* జనవరి 25వరకు విబి జి రామ్ జి కొత్త చట్టం, దాని యొక్క లోపాలను, కేంద్ర ప్రభుత్వం దుష్ప్రచారాలు గురించి గ్రామీణ ప్రజలకు, కార్మికులకు అవగాహన కలిగించేందుకు అట్టడుగు స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలి.
* జనవరి 26న సభలు, సమావేశాలు నిర్వహించి కొత్త చట్టానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలి.
* ఫిబ్రవరి 2న రెండు దశాబ్దాల క్రితం నరేగా ప్రారంభించబడిన రోజును పురస్కరించుకొని ఆ రోజున రాష్ట్ర, జిల్లా ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసన ప్రదర్శనలు నిర్వహించాలి.
* ఫిబ్రవరి 12న కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలి.

నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగాను, వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి ఎంజీ నరేగాను పునరుద్ధరించి పకడ్బందీగా అమలు జరపాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూరించాలి. పై ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సంఘాల జాతీయ ఉమ్మడి వేదిక, నరేగా సంఘర్ష్ మోర్చా దేశంలోని వ్యవసాయ కార్మిక, పేద, సన్నకారు, చిన్నకారు రైతులకు, గ్రామీణ పేదలకు విజ్ఞప్తి చేస్తున్నది.

**– తాటిపాముల వెంకట్రాములు,**
**భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్,**
**జాతీయ కార్యవర్గ సభ్యుడు**



## ప్రజావాణిలో 67 అర్జీలు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 67 అర్జీలను దరఖాస్తుదారులు అధికారులకు సమర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా లా అధికారి చంద్రావతితో కల్సి అర్జీలను స్వీకరించారు. అనంతరం వారితో పాటు ఉన్న వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులను అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. ఒకవేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం దరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.

## కాలనీ వాసులంతా ఐక్యతగా ఉన్నప్పుడే కాలనీ అభివృద్ధి సాధ్యం




ఎమ్మెల్యే వివేకానంద్

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : కాలనీ వాసులంతా ఐక్యతగా ఉన్నప్పుడే కాలనీ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం 131 కుత్బుల్లాపూర్ డివిజన్ బాల్‌రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన లే ఔట్ డిస్‌ప్లే బోర్డ్‌ను బిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె ఎం గౌరీష్, కాలనీ అధ్యక్షులు పి.దుర్గారెడ్డి, ఉపాధ్యక్షులు భగీరథరెడ్డి, నాగభూషణం, వర్కింగ్ ప్రెసిడెంట్ జలునాథ్ భాను, వేమారెడ్డి, సలహాదారులు సుధాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, రామారావు, లింగారెడ్డి, శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి కార్తిక్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, యువ నాయకులు గిరిధర్, రమణారెడ్డి, వెంకట్, ఆంజనేయులు, అజయ్‌చారి, బొంబాయి శ్రీను, జయం చారి, రమేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన పిఎసి చైర్మన్



ప్రజాపక్షం/కూకట్‌పల్లి : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీ నుండి గోవింద్ హోటల్ చౌరస్తా వరకు రూ.70లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులను పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, జిహెచ్‌ఎంసి ఈఈ గోవర్ధన్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన మెరుగైన రవాణా సౌకర్యం కొరకు నిరంతరం కృషి చేస్తామన్నారు. అన్నివేళల ప్రజలకు అందుబాటులో ఉంటూ, మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని అన్నారు.

## ఖమ్మం సభతో కమ్యూనిస్టుల బలం తెలిసిపోయింది



సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : ఖమ్మం సభతో కమ్యూనిస్టుల బలం తెలిసిపోయిందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం ఖమ్మంలో జరిగినటువంటి భారీ బహిరంగ సభకు లక్షలాదిమంది సిపిఐ కార్యకర్తలు తరలిరావడం ఆహ్వానించదగ్గ పరిణామం అని, దీన్ని చూసి కమ్యూనిస్టులను హేలన చేసేటువంటి రాజకీయ నాయకులకు చెంపపెట్టులాంటిదని అన్నారు. బూర్జువ పార్టీలు తమ పార్టీ మీటింగ్‌లకు కార్యకర్తలకు మందును, డబ్బును, బిర్యానీ పొట్లాలను ఇచ్చి తీసుకెళ్ళే సంప్రదాయం కనిపిస్తున్న సందర్భంలో సిపిఐ పార్టీకి వచ్చేటువంటి కార్యకర్తలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా పేద ప్రజల కోసం కార్మికుల కోసం రైతుల కోసం మహిళల కోసం నిజంగా పోరాటం చేసేటువంటి పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అనుకొని స్వచ్ఛందంగా వచ్చే సంప్రదాయం కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు ఉందని ఈ విషయం బూర్జువ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు కూడా తెలుసునని అన్నారు. ఈ బహిరంగ సభ ద్వారా సిపిఐ కార్యకర్తల్లో నూతన ఉత్తేజం పెరిగిందని రానున్న రోజుల్లో ఈ సభను స్ఫూర్తిగా తీసుకొని సిపిఐ పార్టీని మరింత బలోపేతం చేసి సమ సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు.

## సత్యనారాయణను పరామర్శించిన మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

ప్రజాపక్షం/నాగారం: మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ(96)ను పరామర్శించారు. జిహెచ్‌ఎంసి 5వ డివిజన్ నాగారం గోపికృష్ణ కాలనీలోని ఆయన నివాసానికి విచ్చేసి ఆయన శాలువాతో సత్కరించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, నాయకులు నాగరాజు, మాజీ జెడ్పిటిసి మునగంటి సురేష్, శ్యామసుందర్‌శర్మ, బుధవరం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు పోటీ చేసి పదవులు అధిష్టించాలి

మూడుచింతలపల్లిలో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట : ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్ల కోటాలో మహిళలు పోటీ చేసి పదవులను అధిష్టించాలని, ప్రభుత్వం మహిళల కొరకు ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మేడ్చల్ నియోజకవర్గంలోని ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీల్లో సుడిగాలి పర్యటన చేసి రూ.40 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. మూడుచింతలపల్లి నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని మేడ్చల్ మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. అలియాబాద్ మున్సిపల్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ఇందిరమ్మ స్త్రీ శక్తి సంఘాలకు 18,506 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మహిళలకు గతంలో 2 కోట్ల 33 లక్షల వడ్డీలేని రుణాలను అందించామని చెప్పారు. మేడ్చల్ జిల్లాలో రూ.45 లక్షల నిధులతో 900 మంది మైనార్టీ నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశామని మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ఎల్లంపేట మున్సిపల్‌లో రూ.9 కోట్ల 43 లక్షలు, అలియాబాద్‌లో రూ.15 కోట్లు, మూడుచింతలపల్లిలో రూ.15 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కీసర ఆర్‌డిఒ రాజేష్‌కుమార్, డిప్యూటీ



కలెక్టర్ మెక్కి శ, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కాంతమ్మ, జిల్లా డిఆర్‌డిఒ సాంబశివరావు, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, గంధమల్ల చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఆటిపిపి మెంబర్ జైపాల్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, మాజీ డిసిసి హరివర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్, మూడుచింతలపల్లి అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, ఎల్లంపేట అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ ఇద్రిస్, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/వికారాబాద్ : ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజలనుండి 85 ఫిర్యాదుల స్వీకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను ఆన్‌లైన్ నంబర్ కేటాయించాలని తెలిపారు. ఏదైన ఫిర్యాదు పరిష్కారం కానట్లయితే పరిశీలించి క్షేత్రస్థాయి నుండి రిపోర్టు తెప్పించి వెంటనే పరిష్కరించాలని అన్నారు. జిల్లా అధికారులు ఆర్‌డీఓలు ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ అధికారి రాజేశ్వరి, సుధీర్, డిఆర్‌ఓ మంగ్లీలాల్, ఆర్‌డిఓ వాసుచంద్ర పాల్గొన్నారు. అనంతరం గెజిటెడ్ ఆఫీసర్స్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

## కాంట్రాక్టు కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలంటూ ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం రెండు గంటల పాటు ఆస్పత్రి ప్రాంగణంలో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న 300 మందికిపైగా కంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎం.నరసింహ ఆక్టివిటీ సంస్థ పేరిట పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటరీ సిబ్బందికి గత ఐదు మాసాలుగా వేతనాలు చెల్లించలేదని, ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు పలు సార్లు చెప్పినా ఫలితం లేకపోవటం వల్ల కార్మికులు చివరికి ఆందోళనలకు పట్టాల్సి వచ్చిందన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు తమ కుటుంబ అవసరాల కోసం చాలీ చాలని జీతాలతో పని చేస్తున్న వారికి ప్రతి నెల వేతనాలు చెల్లించక పోవటం అమానుషమని ఆయన అన్నారు. దీంతో పాటు వారికి నిబంధనల మేరకు చెల్లించాల్సిన ఈఎస్ఐ, పిఎఫ్ డబ్బులు సైతం ఆయా సంస్థలకు చెల్లించటం లేదన్నారు వేతనాల బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో ఈ నెల 22 వరకు ఆస్పత్రి ప్రాంగణంలో ప్రతి రోజు 2 గంటల పాటు ధర్నా నిర్వహించి అప్పటికీ సమస్య పరిష్కారం కాని పక్షంలో ఆస్పత్రి విధులు బహిష్కరించటం ద్వారా ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణు కుమార్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షురాలు విక్టోరియా, కాంట్రాక్టు కార్మికుల సంఘం బ్రాంచ్ అధ్యక్షులు నర్సింగరావు, లింగమ్మ, సుధా, క్రాంతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# తాండూరు మున్సిపల్ కాంగ్రెస్‌దే

ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరు: తాండూరు మున్సిపల్‌ను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని, ప్రతిపక్ష పార్టీల ఆగడాలు ఇక సాగవని తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు పట్టణంలోని పాత తాండూరు, శెనిగేష్‌పూర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రూ.18.70కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ అధికారులతో కలసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లడుతూ గత మున్సిపల్ కౌన్సిల్‌లో ఇరువర్గాల తగాదాల వల్లే అభివృద్ధి పనులు కుంటపడిందని, ఇది పట్టణ ప్రజలు గమనించారని విమర్శించారు. తాను ఎమ్మెల్యే అయిన తరువాత మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు సజావుగా జరిగే విధంగా చూసానని గుర్తు చేశారు. తాండూరు మున్సిపాలిటీ రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన మాడల్ మున్సిపాలీటిగా తీర్చిదిద్దుతామన్నారు. కుటుంబాలలో నాయకులలో తగాదాలు పెట్టి లబ్ది పొందాలని చూస్తే సహించేది లేదని, రాబోయే రోజుల్లో పైలెట్ ఆధ్వర్యాన జరిగిన మాఫియా ఆగడాలను, అవినీతిని బట్టబయలు చేస్తానని హెచ్చరించారు. పైలెట్ రోహిత్‌రెడ్డి చేసిన మోసాల గూర్చి నా కంటే ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి బాగా తెలుసునని ఎద్దేవా



చేశారు. తాండూరు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సమావేశంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ స్వప్న పరిమళ్, జిల్లా పార్టీ అధ్యక్షులు ధారాసింగ్, డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, సీనియర్ నాయకులు రావుఫ్, అప్పు, మాజీ కౌన్సిలర్‌లు జుబేర్ లాల, ముక్తర్ హైమ్మద్, నాయకులు బంటు మల్లప్ప, మహిళ అధ్యక్షురాలు మాదవి, పట్టణ పార్టీ అధ్యక్షులు హబీబ్‌లాల, మున్సిపల్ కమీషనర్ యాదగిరి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, డిఈ తదితర నాయకులు పాల్గొన్నారు.

## రైల్వే ఓవర్ బ్రిడ్జి వెడల్పు చేయాలి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : నిత్యం ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న ఎన్‌ఎఫ్‌సి రైల్వే ఓవర్ బ్రిడ్జి వెడల్పు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. సోమవారం మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్‌ను స్థానిక కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డితో పాటు కల్సిన ఎమ్మెల్యే ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి అప్పటి అవసరాల మేరకు ఏర్పాటు చేసారని, ఇటీవలి కాలంలో సమీప ప్రాంతాలన్ని నివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాలుగా అభివృద్ధి చెందిందన్నారు. దీంతో పాటు హబ్సిగూడఈసిఐల్, బోడుప్పల్ ఈసిఐఎల్ మధ్య రాకపోకలకు ఈ బ్రిడ్జి మార్గమే కీలకమవటం వల్ల నిత్యం రేయింబవళ్లు వందలాది వాహనాలు తిరుగుతుంటాయన్నారు. బ్రిడ్జి వెడల్పు తక్కువ అవటం కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. దీనికి స్పందించిన ఎంపి ఈటెల దీనికి సంబంధించి రైల్వే అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు బిఆర్‌ఎస్ నేతలు బోదాసు లక్ష్మి నారాయణ, చిగుళ్ల శ్రీనివాస్, ధూళిమెట్ల దయాకర్ రెడ్డి, కోదండం దర్మారెడ్డి, ఎండి ఉస్మాన్, రాజేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.


# చెరువు సమస్యలపై అధికారులకు వినతి

ప్రజాపక్షం/నిజాంపేట్ : నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని వివిధ చెరువులు గుఱ్ఱపు డెక్కతో నిండిపోవడంతో పరిసరాలలోని కాలనీ వాసులు దోమలతో తీవ్ర ఇబ్బందులకు గురికావడాన్ని, డ్రైనేజీ తరుచూ లీక్ అవుతూ రోడ్డు మీద ప్రవహిస్తూ పాదచారులకు ఇబ్బంది కలగడాన్ని మరియు బాచుపల్లి బైరం చెరువు పెద్ద చెరువును హెచ్‌ఎండిఏ ద్వారా ఆధునీకరణ, సుందరీకరణకు కార్యచరణ రూపు దాల్చినందువల్ల గత వర్షాకాలం సమయంలో చెరువు కట్ట తెగి పరిసర ప్రాంతాల ఇల్లు జలమయమయ్యే పరిస్థితిని ప్రజలందరూ చూశారని తృటిలో ప్రాణం నష్టం మరియు ఆస్తి నష్టం నుంచి తప్పించుకోవడం జరిగిందనీ అన్నారు. ఈ వేసవికాలంలో యుద్ధ ప్రాతిపదికన చుట్టూ బండ్ నిర్మించి వాటిని స్టోన్ పిచ్చింగ్ ద్వారా పరిరక్షించి ఇన్‌లెట్స్‌ను, అవుట్‌లైట్స్‌ను ఎస్ఎన్‌డిపి నాళాలకు అనుసంధానం చేయవలసిందిగా, అత్యంత ముఖ్యాంశంగా పరిగణించి ఇన్ ఇన్‌ఫ్లో నాల మరియు అవుట్ ఫ్లో నాలాలను పునరుద్ధరించవలసిందిగా జోనల్ కమిషనర్ సందీప్ కుమార్ ఝా దృష్టికి తీసుకెళ్లగా వారు ఈ విషయాలపై సవివరంగా చర్చించడం జరిగిందనీ, కొన్ని సమస్యలను పరిష్కరించడానికి




అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేసి, మిగతా సమస్యల విషయమై రెండు రోజుల్లో ఆయా ప్రాంతాలను స్వయంగా సందర్శించి, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంసి మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, రాష్ట్ర ఎస్‌సి మోర్చా అధికార ప్రతినిధి దాసి నాగరాజు, జిల్లా నాయకులు ఎమ్మార్పీఎస్ రాజు,రచ్చ చక్రధర్, జగదీశ్ పాల్గొన్నారు.

## అభివృద్ధికి సహకరిస్తా



జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్

ప్రజాపక్షం/మల్కాజిగిరి : జోనల్ పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి సహకరిస్తానంటూ జిహెచ్‌ఎంసి మల్కాజిగిరి జోనల్ కమిషనర్ స ంచిత్ గంగ్వార్ తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులను మంజూరు చేయటంతో పాటు అవసరమైన కొత్త పనులకు ప్రతిపాదనలు చేపట్టాలంటూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి, కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి, మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్‌గౌడ్, బికె హన్మంతరావులతో సోమవారం జోనల్ కమిషనర్‌ను కల్సి అభివృద్ధి పనులపై చర్చించిన సందర్భంగా ఈ మేరకు కోరారు. కార్పొరేటర్లు శాంతి శ్రీనివాసరెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, అమినుద్దీన్, నెంకటేష్, ఉస్మాన్, ఉపేందర్, బాలకృష్ణ, సంపత్, బాచి, సంపత్ యాదవ్ తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## అరైవ్–అలైవ్‌లో డ్రైవర్లకు అవగాహన




ప్రజాపక్షం/చర్లపల్లి: రోడ్ల మీద ప్రమాదాలు, మరణాలు తగ్గించడమే లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం చేపట్టిందని ఏసిపి వెంకట్‌రెడ్డి అన్నారు. చర్లపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ కార్యక్రమానికి ఏసిపి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అవగాహన కల్పించారు. పిఎస్ పరిధిలోని చక్రీపురంజైల్ రోడ్, జయశంకర్ విగ్రహం వద్ద రెండు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ఆటో, లారీ డ్రైవర్లకు మద్యం సేవించి వాహనాలను నడపరాదని, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలు ప్రమాదానికి కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ సుధాకర్, ఎస్ఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ప్రజాపక్షం/మల్కాజిగిరి : రాజకీయాలతో సంబంధం లేకుండా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నానంటూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని రామాంజనేయనగర్‌లో రూ. 29 లక్షల వ్యయంతో చేపట్టిన నూతన సిసి రోడ్డు పనులను ఆయన సోమవారం స్థానిక కార్పొరేటర్ మేకల సునితా రాము యాదవ్‌తో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని డివిజన్లలోనూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నన్నారు. ఎన్నికల హామీల మేరకు ప్రణాళికాబద్ధంగా నెరవేరుస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు




ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ గండిమైసమ్మ మండల పరిధిలోని శంకర్ నగర్ సర్వే నంబర్ 62లో జరుగుతున్న అక్రమ కట్టడాలపై అదేవిధంగా బహదూర్ పల్లి గ్రామంలోని పిర్జది కుంట సర్వే నంబర్ 142 ప్రాంతంలో జరుగుతున్న అక్రమా నిర్మాణాలకు రెవెన్యూ, మున్సిపల్ నుండి ఏటువంటి అనుమతులు లేవని పూర్తిగా ఎఫ్టిఎల్, బఫర్ ప్రాంతాలలో నిర్మాణాలు జరుపుతున్నారని ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని కుంటలు చెరువులు మాయమయ్యే ఆస్కారం ఉందని సోమవారం బహదూర్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుడ్డు రాహుల్ దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్, దుండిగల్ గండి మైసమ్మ తహసిల్దార్ రాజేశ్వర్ రెడ్డిని కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.

## యాబాజిగూడ సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక



ప్రజాపక్షం/పరిగి : వికారాబాద్ జిల్లాలోని పరిగి మండల పరిధిలోని యాబాజిగూడ గ్రామ సర్పంచు కంకరి యాదమ్మ నరసింహులు, ఉపసర్పంచు, వార్డు మెంబర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసామన్నారు. ఈ కార్యక్రమంలో రామ్‌రెడ్డి ,రాజు, వెంకటేష్, పుల్లయ్య, రాములు, నర్సింలు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్యలను పరిష్కరించాలని డిసికి వినతి

మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : జిహెచ్‌ఎంసీ ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలో నెలకొన్న మిషన్ భగీరథ మంచినీటి సమస్య, రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జికి ఇరువైపుల ఉన్న అడ్డంకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఘట్‌కేసర్ జిహెచ్‌ఎంసీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణికి వినతి పత్రాన్ని మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ అందజేశారు. సోమవారం అబ్బసాని యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు, కాలనీ ప్రజలు, నాయకులు జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయం ముందు త్రాగు నీటి సమస్యలను పరిష్కరించాలని కాలి బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతు డివిజన్ పరిధిలో ఉన్న పలు కాలనీలలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గాంధీనగర్, బాలజీనగర్ ద్వారకనగర్ ఇడబ్ల్యూస్‌కాలనీ, పటేల్‌నగర్, వేమననగర్, దత్తాత్రేయ, ఎన్‌ఎఫ్‌సినగర్ కాలనీ ప్రజలు నీటి కొరతతో చాల అవస్థలు పడుతున్నారని అబ్బసాని యాదగిరి యాదవ్ డిప్యూటి కమిషనర్‌కు వివరించారు.

## రేపు ఎఫ్‌పిఒ శాఖ ప్రారంభం

ప్రజాపక్షం/శామీర్‌పేట : రేపు (బుధవారం) మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని పోతారం చౌరస్తాలో శామీర్‌పేట రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పిఒ) శాఖను ప్రారంభిస్తామని ఎఫ్‌పిఒ శాఖ చైర్మన్ వంగ పెంటారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్టివాటిక్ ప్రిషిషన్ అగ్రిటెక్, ఎఫ్‌పిఒ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శాఖను ప్రారంభిస్తామని చెప్పారు. ఇట్టి శాఖ పరిధిలోని 8 గ్రామాల రైతు సంఘాల సభ్యులు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

## కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు

యాచారం సిఐ నందీశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం/యాచారం : విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని సిఐ నందిశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తమ్మలోనిగూడ పాఠశాలలో విద్యార్థులకు అవగాహణ సదస్సు నిర్వహించారు. ఈ సంధర్బంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుండి మంచి అలవాట్లను అలవర్చుకోని క్రమశిక్షణతో ఉండాలన్నారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మధుకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైనవారికి ఇందిరమ్మ ఇండ్లు



ప్రజాపక్షం/కేశంపేట : అర్హులైన ప్రతి లబ్దిదారుడికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నిర్థవెల్లి సర్పంచ్ చెదురువెల్లి భాస్కర్‌గౌడ్ వివరించారు. సోమవారం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. బిల్లులపై లబ్దిదారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ నిర్థవెల్లి గ్రామానికి 48ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, అనేక ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయని, వాటిని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, వై.చెన్నయ్య, రిజ్వాన్ భేగం, రొయ్యల మంజుల జంగేష్, సిల్వేర్ చంద్రయ్య, మూడావత్ రమేష్, కాటుక రాములు, కోడిగంటి నాగరాజు, సిల్వర్ వెంకటమ్మ మల్లయ్య, నేతలు కొత్త శ్రీశైలం, ఖాజాపాషా, దిద్దెల ముత్యాలు, ఎండి బద్రు తదితరులు పాల్గొన్నారు.

## పాడి పశువులకు వైద్యసేవలు



ప్రజాపక్షం/కొందుర్గు: పాడి పశువులకు నాణ్యమైన వైద్యసేవలు అంధించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పర్వతాపూర్ సర్పంచ్ బోయ అశోక్ కోరారు. సోమవారం మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామంలో గోపాలమిత్ర ఏర్పాటు చేసి పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బోయ అశోక్ మాట్లాడుతూ మూగజీవాలకు నాణ్యమైన వైద్యసేవలు అంధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేష్, రైతులు మరాఠి సిద్ధు, శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వర్, మల్లేష్, కావలి శ్రీను, చాకలి ఈశ్వరయ్య, కర్రల వెంకటయ్య, ఆంజనేయులు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంకల్ప యాత్ర దిగ్విజయం కావాలి

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం వరకు సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ నిర్వహిస్తున్న సంకల్ప మహా పాదయాత్ర దిగ్విజయం కావాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద సినీ నిర్మాత బండ్ల గణేష్‌కు పూలమాలలు వేసి స్వాగతం ఫలికారు. షాద్‌నగర్ నుండి తిరుపతి వరకు మహాపాదయాత్ర నిర్వహించడం గొప్ప విషయమని, స్వామి ఆశీస్సులు బండ్ల గణేష్‌పై ఉండాలన్నారు. ఏపి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడి కోసం షాద్‌నగర్ ప్రాంతం నుండి సంకల్ప మహాపాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, శశిధర్, సతీష్, సుదర్శన్ గౌడ్, శ్రీశైలం గౌడ్, ఇసాక్, మార్గం రాజేష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయం



ప్రజాపక్షం/సరూర్‌నగర్: ఐటిడిఇఎస్ సొసైటీ కాలనీ అభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కెపురం డివిజన్ శ్రీ రామకృష్ణపురం కాలనీలోని ఐటిడిఇఎస్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని సాంస్కృతిక, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని అకాంక్షిస్తూ, తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజేశ్రీరామారావు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, గోపాల్, నరహరిరావు, గణేష్, సుధాకర్‌రావు, రమణమూర్తి, అన్నపూర్ణ, రాధ, శకుంతల, నీలిమ, విజయలక్ష్మి , మాదవి, స్వప్న, అర్చన, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## బస్సులు పునరుద్ధరించాలని వినతి

ప్రజాపక్షం/యాచారం : కరోనా సమయంలో బంద్ చేసిన బస్సులను కల్వకుర్తి డిపో అధికారులు పునరుద్ధరించాలని మేడిపల్లి గ్రామ స్వచ్ఛంద కార్యకర్త, పిఆర్‌జి పౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రవీందర్‌గుప్త కోరారు. సోమవారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ కడ్తాల్, అమన్‌గల్ మాడ్గుల మండలాల పరిధిలోని మేడిసల్లి, మాల్, మేడిపల్లి, హైద్రాబాద్ ,మేడిపల్లి మాల్ నైట్ హాల్ట్ , ముద్విన్, మాల్, మాడ్గుల ,మాల్ గ్రామాలకు బస్సులను పునరుద్ధరించాలని విన్నవించిన స్పందనలేదన్నారు. అధికారులు బస్సులను వేయకపోతే కల్వకుర్తి డిపోకు చెందిన బస్సులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

# హైదరాబాద్‌లో 54మంది సిఐల బదిలీ

ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ స్థాయిలో బదిలీలు చోటుచేసుకున్నాయి. నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఒకేసారి 54 మంది పోలీస్ ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యంగా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్), సైబర్ క్రైమ్ విభాగాల నుండి పెద్దసంఖ్యలో అధికారులు బదిలీ అయ్యారు.

గత కొంతకాలంగా ఒకే విభాగంలో కొనసాగుతున్న వారిని, పాలనాపరమైన అవసరాల దృష్ట్యా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. బదిలీ అయిన వారిలో 26 మంది సిఐలను తక్షణమే సిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ విభాగంలో నూతన సంస్కరణలు చేపట్టాలని భావిస్తున్న సిపి, ఈ భారీ బదిలీల ద్వారా పనితీరును మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే ఆదివారం రాత్రి వచ్చిన ఈ బదిలీ ఉత్తర్వుల ప్రకారం, 26 మంది ఇన్స్పెక్టర్లను తక్షణమే రిలీవ్ చేసి, తదుపరి ఆదేశాలు వచ్చేవరకు సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, అబిడ్స్ వంటి కీలక ప్రాంతాలఎస్‌హెచ్‌ఓలను మార్చడంతో పాటు, సైబర్ నేరాలను అరికట్టే దిశగా ఆ విభాగంలో నూతన అధికారులను కేటాయించారు. ఎన్నికలు, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పోలీస్ శాఖలో జరిగిన ఈ ఆకస్మిక మార్పులు ఇప్పుడు నగరవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

## మద్యం షాపులో ఘర్షణ పాతబస్తీలో యువకుడి హత్య

ప్రజాపక్షం/హైదరాబాద్ : వైన్ షాప్ ముందు ఓ యువకుడు ఆదివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. ఛత్రినాక పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. కర్ణాటకకు చెందిన సతీష్ చావ్లా (35) శంషీర్ గంజ్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం రాత్రి తన బైక్‌పై శంషీర్ గంజ్‌లోని తుల్జా భవానీ వైన్స్‌లో మద్యం తాగేందుకు వచ్చాడు. మద్యం తాగే క్రమంలో మరో వ్యక్తితో గొడవ జరిగింది. ఇద్దరు గల్లాలు పట్టుకొని బయటికి వచ్చారు. రోడ్డుపైకి వచ్చాక మరో వ్యక్తి తన స్నేహితుడికి ఫోన్ చేసి పిలిపించుకున్నాడు. అక్కడికి చేరుకున్న ఆ వ్యక్తి తన వద్ద ఉన్న కత్తితో కడుపు, మెడ భాగాలలో తీవ్రంగా పొడిచాడు. సమాచారం అందుకున్న ఛత్రినాక పోలీసులు గాయపడ్డ వ్యక్తిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మద్యం షాపులో గుర్తు తెలియని వ్యక్తితో అనుకోకుండా గొడవ జరిగిందా...? ఏదైనా ముందస్తు పథకంలో భాగంగా ఈ హత్య జరిగిందా..? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# 14 ఏళ్లలోనే అత్యధిక కేసులు

ఎసిబిలో 'రివార్డ్ మేళా' – పనితీరుపై చారుసిన్హా సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) 2025 ఏడాదిలో కీలక మైలురాయిని అధిగమించింది. గత 14 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 2025 చివరి త్రైమాసికంలో అత్యధిక సంఖ్యలో కేసులు నమోదు కావడం గమనార్హమని ఎసిబి అదనపు డిజి చారు సిన్హా తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కేసుల సమీక్ష సమావేశంలో 2025 ఏడాది మొత్తం, ముఖ్యంగా చివరి త్రైమాసికంలో ఎసిబి పనితీరును చారుసిన్హా సమగ్రంగా సమీక్షించారు. అనంతరం అవినీతి నిరోధక ఉద్యమంలో విశేష సేవలందించిన అధికారులు, సిబ్బందిని సత్కరించేందుకు 'రివార్డ్ మేళా' కార్యక్రమం నిర్వహించారు.

**14 ఏళ్ల రికార్డు బ్రేక్...** సమీక్షలో భాగంగా 2025 చివరి త్రైమాసికంలో నమోదు చేసిన కేసులు గత 14 ఏళ్లలో అదే కాలానికి అత్యధికమని వెల్లడించారు. ఇది ఏసీబీ అధికారులు, సిబ్బంది చూపిన అప్రమత్తత, క్రమశిక్షణ, వృత్తిపరమైన నైపుణ్యానికి నిదర్శనమని చారుసిన్హా అభిప్రాయపడ్డారు. అత్యుత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, బృందాలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అవినీతి కేసుల గుర్తింపు, దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన వారికి ఈ గౌరవం దక్కింది. ఈ బహుమతులు కేవలం ప్రశంసకే కాదు& భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా పనిచేయడానికి ప్రేరణగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు.2011 చివరి త్రైమాసికంలో ఎసిబిలో 22 కేసులు నమోదు కాగా 2025లో ఈ సంఖ్య 78కి చేరుకుందని తెలిపారు. ప్రభుత్వశాఖలో అంతర్గతంగా చాపకింద నీరులా మారిన అవినీతి నిర్మూలించడమే ఎసిబి ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా, పారదర్శక పాలనకు తోడ్పడే విధంగా ప్రతి దర్యాప్తు నిష్పక్షపాతంగా, వృత్తిపరంగా సాగాలని సూచించారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా దర్యాప్తు నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు చారుసిన్హా ఆదేశించారు. ముఖ్యంగా విచారణ, దర్యాప్తు నైపుణ్యాల మెరుగుదల కేసుల డాక్యుమెంటేషన్, సాక్ష్యాల నిర్వహణలో నాణ్యత సాంకేతికత, డేటా అనలిటిక్స్ వినియోగం శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాపులు, మెంటారింగ్ ద్వారా సామర్థ్యాభివృద్ధిపై అంశాలపై నిరంతరం పనిచేయాలని స్పష్టం చేశారు.

### 2025 విజయాలను కొనసాగిద్దాం..

రివార్డ్ మేళా, పనితీరు సమీక్ష కార్యక్రమాలు గత విజయాలను గుర్తించడమే కాకుండా, భవిష్యత్తులో మరింత అప్రమత్తంగా పనిచేయాలన్న సంకల్పాన్ని బలపరిచాయని అధికారులు తెలిపారు. 2025లో సాధించిన ఊపును కొనసాగిస్తూ, అవినీతిపై మరింత కఠినంగా చర్యలు తీసుకుని, మంచి పాలనకు ఎసిబి ముందుండాలని సమావేశంలో తీర్మానించారు.

## చర్లపల్లి జైలు సూపరింటెడెంట్‌గా ప్రమోద్

చర్లపల్లి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్‌గా ప్రమోద్‌ను నియమిస్తూ జైళ్లశాఖ డిజి సౌమ్యామిశ్ర నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నలగొండ జిల్లా జైల్ అధికారిగా పనిచేస్తున్న ప్రమోద్‌కు సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించారు. ఇక చర్లపల్లి ఖైదీల వ్యవసాయక్షేత్రం జైల్ సూపరింటెండెంట్‌గా భరత్ ను నియమించారు. సంగారెడ్డి డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న భరత్‌కు కూడా సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించారు.

# రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లకు బహిరంగ వేలం

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరవాసులకు తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ శుభవార్త తెలిపింది. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో సొంత స్థలం కొనుగోలు చేసి, తమ అభిరుచికి తగ్గట్టుగా ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారి కోసం రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అద్భుతమైన అవకాశం కల్పించింది. రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని తొర్రూర్, బహదూర్‌పల్లి, కుర్మల్ గుడ లేఔట్‌లలో ఉన్న 137 ఓపెన్ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి. గౌతం తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్లాట్లు అన్ని రకాల మౌలిక వసతులతో, క్లియర్ టైటిల్‌తో అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వమే ఈ లేఔట్‌లను అభివృద్ధి చేయడంతో కొనుగోలు చేసిన వెంటనే ఎటువంటి వివాదాలు లేకుండా భవన నిర్మాణాలు చేపట్టవచ్చు. ఇప్పటికే అభివృద్ధి చెంది మౌలిక సదుపాయాలతో ఉన్న ఈ ప్లాట్లకు ఫిబ్రవరి 7, 8 తేదీల్లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వి.పి. గౌతం తెలిపారు. ప్రాంతాన్ని బట్టి చదరపు గజానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అప్‌సెట్ ప్రైస్‌ను నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరల్లోనే ప్లాట్లు అందుబాటులో ఉండటంతో మంచి స్పందన లభించే అవకాశముందన్నారు. తమ అభిరుచులకు అనుగుణంగా సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి ఈ ప్లాట్లు ఎంతో అనుకూలమని తెలిపారు. ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి ఉన్నవారు నిర్ణీత ధరావతును (ఈఎండి) మీ– సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్, యుపిఐ ద్వారా లేదా డిడి ద్వారా చెల్లించవచ్చన్నారు. ఓఆర్‌ఆర్– ఆదిభట్ల, ఐటి కారిడార్‌కు సమీపంలోని తొర్రూర్ లేఔట్ ప్లాట్లకు ఫిబ్రవరి 7, 8 తేదీల్లో బహిరంగ వేలం నిర్వహిస్తారు.

ఓఆర్‌ఆర్‌కు సమీపంలోని బహదూర్ పల్లి, శంషాబాద్ ఎయిర్‌పోర్టు దగ్గరలోని కుర్మల్ గుడ ప్రాంతాల ప్లాట్లకు ఫిబ్రవరి 8వ తేదీ మధ్యాహ్నం వేలం జరుగుతుంది.

### ప్లాట్ల వివరాలు..

**తొర్రూర్ :** 105 ప్లాట్లు. 200–500 చదరపు గజాల విస్తీర్ణం. కనీస ధర చదరపు గజానికి రూ.25,000.

**బహదూర్ పల్లి :** 12 ప్లాట్లు. 200–1000 చదరపు గజాల విస్తీర్ణం. కార్నర్ ప్లాట్‌కు చదరపు గజానికి రూ.30,000, ఇతర ప్లాట్లకు రూ.27,000.

**కుర్మల్ గుడ :** 20 ప్లాట్లు. 200–300 చదరపు గజాల విస్తీర్ణం. కనీస ధర చదరపు గజానికి రూ.20,000.

**దరఖాస్తుల ఆఖరు తేదీలు...**

తొర్రూర్ ప్లాట్లకు రూ.2 లక్షల ధరావతుతో ఫిబ్రవరి 6లోగా

బహదూర్ పల్లి ప్లాట్లకు రూ.3 లక్షల ధరావతుతో ఫిబ్రవరి 7లోగా

కుర్మల్ గుడ ప్లాట్లకు రూ.2 లక్షల ధరావతుతో ఫిబ్రవరి 7లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వివరాలకు www.swagruha.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

సంప్రదించాల్సిన ఫోన్‌నెంబర్లు : 8121022230 (తొర్రూర్), 8347472106 (బహదూర్ పల్లి), 7993455802 (కుర్మల్ గూడ).

## ప్రజావాణి అర్జీలు పరిష్కరించాలి

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి పరిధిలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, విన్నపాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో హెచ్‌ఓడిలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధాన కార్యాలయంలో 41 విన్నపాలు అందగా, నగరం అంతటా 12 జోన్‌ల పరిధిలో మొత్తం 168అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు సి.ఎన్. రఘు ప్రసాద్, కె.సత్యనారాయణ, వేణు గోపాల్, అలివేలు మంగతాయారు, ఎస్.పంకజ, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, యుబిడి డైరెక్టర్ వెంకటేశ్వర్లు, చీఫ్ వాల్యుయేషన్ ఆఫీసర్ రజినీకాంత్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, అదనపు చీఫ్ సిటీప్లానర్లు బి. ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

# అభివృద్ధి లక్ష్యంగా సర్పంచ్‌ల పాలన

ఎమ్మెల్యే కాలే యాదయ్య సూచన



ప్రజాపక్షం/రంగారెడ్డి : గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు పాలన సాగించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కోరారు. సోమవారం శంషాబాద్ మండలం ముచింతల్ స్వర్ణ భారతి ట్రస్ట్‌లో నూతన సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సిహెచ్ కృష్ణారెడ్డిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తూ పంచాయతీ వ్యవస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల ఆశయాలను నెరవేర్చే బాధ్యత సర్పంచ్‌లదే అని, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక వ్యవస్థ, పాలన విధానాలు, నిబంధనలు, నిర్వహణ అంశాలలో పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండడం అవసరమని తెలిపారు. గ్రామస్థాయిలో పరిపాలన సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన నైపుణ్యం, జ్ఞానం అందించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమం గ్రామాభివృద్ధికి అత్యంత కీలకమైనదని,శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ డైరెక్టర్ పద్మజ, జెడి పద్మజా రాణి, టిజిఐఆర్ డి, డిఎల్‌పిఒ, ఎంపిడిలు, ఎంపిఓ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో గణతంత్ర వేడుకలు

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నిర్వహించడం జరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి జిల్లా అధికారులతో గణతంత్ర దినోత్సవం వేడులకల ఏర్పాట్లపై మాట్లాడుతూ వేడుకల్లో వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేలా పనిచేయాలని సూచించారు. అనంతరం జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ రంగారెడ్డి జిల్లా కార్యక్రమంలో భాగంగా జిల్లా నీరు, పారిశుద్ధ్య కమిటి 7వ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి భగీరథ ఎస్‌సి ఆంజనేయులు, ఇఇ రాజేశ్వర్, జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బస్సునుంచి కిందపడి ప్రయాణికురాలికి గాయాలు

ప్రజాపక్షం/కేశంపేట: ప్రయాణిస్తున్న ఆర్‌టిసి బస్సు నుంచి ఓ మహిళా ప్రయాణికురాలు కింద పడి చేయి విరిగిన సంఘటన కేశంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మహేశ్వరం మండలం మురళీనగర్‌కు చెందిన సంధ్య, తన ఇద్దరు కుమార్తెలతో కలిసి కేశంపేట మండల కేంద్రం నుంచి షాద్‌నగర్‌కు వెళ్ళేందుకు ఆర్‌టిసి బస్సులో ఎక్కింది. ఎక్కే క్రమంలో అదుపు తప్పి సంధ్య కిందపడటంతో చేయి విరిగింది. దాంతో ప్రయాణికులు కేశంపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడిని చేరుకొని 108లో గాయపడిన సంధ్యను షాద్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆర్‌టిసి బస్సును కేశంపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళారు. బస్సు ప్రమాదంలో గాయపడిన మహిళా బంధువులు వచ్చిన వెంటనే ఫిర్యాదు తీసుకొని దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్‌టిసి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని బాధిత మహిళ అవేదన వ్యక్తం చేశారు. తన పిల్లలు బస్సులో ఉన్నారని..బస్సును నిలపాలని డ్రైవర్‌కు, కండక్టర్‌కు బస్సును వెంబడిస్తూ మొరపెట్టుకున్న ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఇందుకు కారణమైన ఆ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని గాయపడిన ప్రయాణికురాలు డిమాండ్ చేశారు.

## మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అదనపు కమిషనర్లు




ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని అదనపు కమిషనర్లు వినయ్ కృష్ణా రెడ్డి, సృజన సోమవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారికి మేయర్ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా నగరంలో కొత్తగా విలీనమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన పౌర సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆమె కోరారు.

# మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే లక్ష్యం

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ప్రతి సంక్షేమ పథకం వారి పేరిటనే తీసుకువస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు రూ.1.25కోట్ల వడ్డీలేని రుణాల చెక్కును మహిళలకు పంపిణీ చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కమిషనర్ సునితారెడ్డి స్వాగతం ఫలికారు. ఇందిరా మహిళాశక్తి ద్వారా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని వివరించారు. మహిళలను అన్ని విధాల గౌరవించడంతోపాటు తగిన గుర్తింపు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మాజీ కౌన్సిలర్ సర్వర్‌పాషా, నేతలు జమృద్‌ఖాన్, మసూద్‌ఖాన్, సత్తయ్య, లింగారెడ్డిగూడ ఉప సర్పంచ్ అశోక్, శేఖర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పరమేశ్వర థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ చేపట్టిన సంకల్ప యాత్రను ప్రారంభించారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పరిగి రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ చైర్మెన్ విశ్వం, కాంగ్రెస్ నేత కాశీనాథ్‌రెడ్డి, జమృద్‌ఖాన్, అగ్గనూరు బస్వం, లింగారెడ్డిగూడ అశోక్, రఘునాయక్, అందె మోహన్ పాల్గొన్నారు.

### ఐదో విజయంతో

# ప్లే ఆఫ్‌లో ఆర్‌సిబి!

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లే ఆఫ్‌లోకి దూసుకెళ్లింది. ఎదురైన ప్రత్యర్థి నల్లా చిత్తు చేస్తున్న బెంగళూరు.. రెండో దఫా కూడా గుజరాత్ జెయింట్స్‌ను బెంబేలెత్తించింది. 178 పరుగుల చేదనలో సయాలీ సత్ఘరే(21–3) విజృంభణతో గుజరాత్ టాపార్డర్ కుప్పకూలింది. ప్రధాన బ్యాటర్లు విఫలమవ్వడంతో గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 117కే పరిమితమైంది. 61 పరుగుల తేడాతో జయభేరి మోగించిన మంధాన బృందం దర్జాగా ప్లే ఆఫ్‌లోకి అడుగుపెట్టింది.
డబ్ల్యుపిఎల్ రెండో సీజన్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్ దిశగా అడుగులు వేస్తోంది. టాప్ గేర్ ఆటతో ప్రత్యర్థులను వణికిస్తున్న ఆర్‌సిబి ఐదో విక్టరీతో ప్లే ఆఫ్‌కు చేరింది. ఈ సీజన్‌లో నాకౌట్ దశకు చేరుకున్న తొలి జట్టుగా నిలిచింది. సోమవారం వడోదరలో గౌతమీ నాయక్(73) అర్ధ శతకంతో 178 రన్స్ చేసిన బెంగళూరు.. మరోసారి గుజరాత్ను చిత్తుగా ఓడించింది. భారీ ఛేదనకు దిగిన గుజరాత్‌కు షాకిస్తూ ఓపెనర్ బేత్ మూనీ(3)ని బౌల్ చేసిన సయాలీ సత్కరే(216).. ఐదో బంతికి సోఫీ డెవినె(0)ను వెనక్కి పంపింది. ఆ తర్వాతి ఓవర్లో కనికా ఆహుజా(0)ను లారెన్ బెల్ డకౌట్‌గా పెవిలియన్ పంపింది. దాంతో.. 5 పరుగులకే గుజరాత్ మూడు బిగ్ వికెట్లు కోల్పోయింది. అనుష్క శర్మ(18) సైతం విఫలమైంది. కెప్టెన్ అష్లీ గార్డ్నర్(54) అర్ధ శతకంతో పోరాడినా.. ఆమెకు తోటి బ్యాటర్ల నుంచి సహకారం లభించలేదు. ఆర్‌సిబి బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేయడంతో.. గుజరాత్ బ్యాటర్లు తోకముడిచారు. దాంతో.. గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 117కే పరిమితమైంది.






### వన్డే సిరీస్ ఓటమితో

# గిల్ కీలక నిర్ణయం..

## మళ్లీ దేశవాళీ క్రికెట్‌కు సై!



టెస్టు, వన్డే సారథిగా పట్టాభిషేకం తర్వాత శుభమన్‌గిల్‌కు గడ్డుకాలం మొదలైంది. ఇంగ్లండ్ పర్యటనలో సెంచరీలు మినహాయిస్తే వన్డే, టీ20ల్లో పేలవ ప్రదర్శనతో జట్టు ఓటమికి బాధ్యుడవుతున్నాడు గిల్. ఇండోర్ వన్డేలోనైనా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతాడనుకంటే 23 పరుగులకే వికెట్ పారేసుకున్నాడు. దాంతో.. మళ్లీ ఫామ్‌లోకి రావడం కోసం కీలక నిర్ణయం తీసుకున్నాడు గిల్. ఇటీవల నాయకుడిగా తేలిపోతున్న అతడు దేశవాళీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో మెడ గాయంతో బ్రేక్ తీసుకున్న శుభమన్‌గిల్.. పునరాగమనం తర్వాత నిరాశపరుస్తున్నాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల్లో అతడు ఒక్కటంటే ఒక్క అర్ధశతకం కాదుకదా జట్టును గెలిపించే పెద్ద ఇన్నింగ్స్ ఆడలేదు. నిర్ణయాత్మక మూడో వన్డేలోనూ 23 పరుగులకే జేమీసన్ ఓవర్లో బౌల్డయ్యాడు. దాంతో, మరోసారి 'ఇప్పుడే గిల్‌కు వన్డే కెప్టెన్సీ అవసరమా? కేఎల్ రాహుల్ ఉన్నాడుగా? 'అనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫామ్‌తో మళ్లీ మునుపటి గిల్‌ను తలపించాలని అతడు.. కీలక నిర్ణయం తీసుకున్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమవుతున్న భారత కెప్టెన్ ఇండోర్ నుంచి సోమవారం ఉదయమే ఢిల్లీ చేరుకున్నాడు. అక్కడి నుంచి రాజ్‌కోట్ వెళ్లనున్నాడు. అక్కడ జనవరి 22న స్వరాష్ట్రతో మ్యాచ్‌లో పంజాబ్ తరఫున గిల్ ఆడనున్నాడు. ఈ విషయాన్ని పంజాబ్ క్రికెట్ సంఘం ధ్రువీకరించింది. 'రంజీ ట్రోఫీలో శుభమన్‌గిల్ ఆడడంపై స్పష్టత వచ్చింది. సౌరాష్ట్ర మ్యాచ్లో అతడు బరిలోకి దిగనున్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడడం కోసం భారత కెప్టెన్ 8 గంటలు విమాన ప్రయాణం చేయనున్నాడు. అంకితభావమంటే అది' అని పీసీఏ తెలిపింది. రంజీ ట్రోఫీలో పంజాబ్ జట్టు ఎలైట్ గ్రూప్ బీలో ఉంది.

### కొబ్బరి బోండంపై

# రోహిత్ బొమ్మ..

## అభిమాని ప్రతిభకు హ్యాట్సాఫ్..!

భారత జట్టు విధ్వంసక ఓపెనర్ రోహిత్ శర్మకు అభిమానగణం ఎక్కువే. తనమార్క్ షాట్లతో అలరించే హిట్‌మ్యాన్ భారీసిక్సర్లు, ఫుల్షాట్లు కొడుతుంటే స్టేడియం దద్దరిల్లిపోవాల్సిందే. వచ్చే వన్డే ప్రపంచకప్ ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ మాజీ సారథిపై తనకున్న అభిమానాన్ని ఒక యువకుడు వినూత్నంగా చాటుకున్నాడు. ఏకంగా కొబ్బరి బోండంపై టీమిండియా స్టార్ బొమ్మను చాలా నేర్పుగా చెక్కాడు. ప్రస్తుతం 'కోకోనట్ రోహిత్' వీడియో నెట్టింట వైరలవుతోంది. అభిమాన క్రికెటర్లపై ప్రేమను ఒక్కొక్కరు ఒక్కోవిధంగా వ్యక్తం చేస్తుంటారు. గతంలో ఒక కుర్రాడు క్యూబిక్ రూబ్స్ పేసర్ మహమ్మద్ షమీ బొమ్మకు రూపమిచ్చాడు. ఇప్పుడు రోహిత్ శర్మ అభిమాని ఒకరు కొబ్బరి బోండాపై తన కళా ప్రావీణ్యాన్ని చూపించాడు. పొడవాటి కొబ్బరి బోండం పైభాగాన్ని హిట్ మ్యాన్ రూపం వచ్చేలా తొలిచాడు. చిన్న కత్తితో అతడు ఎంతో నేర్పుగా.. రోహిత్ చిత్రాన్ని ఆవిష్కరించాడు. తలపై టోపీగా కొబ్బరి బోండం భాగాన్నే మలిచిన తీరు అభిమానులను అబ్బుర పరుస్తోంది. సెల్ఫిస్ అనే ఎక్స్ యూజర్ పోస్ట్ చేసిన ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. కోకోనట్ రోహిత్ అపురూపమైన చిత్రాన్ని చూసిన వారంతా ఈ కుర్రాడి ప్రతిభను కొనియాడుతున్నారు.





# యువతరంగం


### ఇంజనీరింగ్ డిగ్రీలతో

# ఉద్యోగం సాధ్యమా?



ఒకప్పుడు భారతదేశంలో ఇంజనీరింగ్ అంటే భవిష్యత్తుకు గ్యారంటీగా భావించేవారు. నాలుగేళ్లు కష్టపడి చదివితే ఉద్యోగం, గౌరవం, స్థిరమైన జీవితం సిద్ధమనే నమ్మకం ప్రతి ఇంట్లో ఉండేది. కానీ నేడు ఆ కల మసకబారుతోంది. లక్షల రూపాయలు ఖర్చు చేసి డిగ్రీలు తీసుకున్నా, లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు దొరకడం లేదు. డిగ్రీ ఉంది, కానీ నైపుణ్యాలు లేవు అనే పరిశ్రమల వ్యాఖ్య నేటి ఇంజనీరింగ్ విద్యార్థి ఎదుర్కొంటున్న కఠిన వాస్తవం. ఆధికారిక గణాంకాలు కూడా ఈచేదునిజాన్ని బలపరుస్తున్నాయి. ఇంజనీరింగ్ చదివిన వారిలో కేవలం సుమారు 40 శాతం మందికే వారి అర్హతలకు తగిన ఉద్యోగాలు దొరుకుతున్నాయి. కొన్ని అధ్యయ నాలు అయితే దాదాపు 80శాతం మంది గ్రాడ్యుయేట్లు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు లేకుండా బయటకు వస్తున్నారని చెబుతున్నాయి. అంటే కాలేజీల్లో నేర్పుతున్న విద్యకు, బయట ప్రపంచానికి అవసరమైన సామర్థ్యాలకు మధ్య భారీ అంతరం ఉంది. ఈ సమస్యకు ప్రధానకారణం మన సిలబస్ కాలం చెల్లిపోవడమే. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్ వంటి విప్లవాత్మక రంగాలవైపు దూసుకుపోతుంటే, మన విద్యావ్యవస్థ మాత్రం ఇంకా పాత సిద్ధాంతాల చుట్టూ తిరుగుతోంది. కానీ ఇది కేవలం సిలబస్ సమస్య మాత్రమే కాదు. వ్యవస్థలో పాతుకు పోయిన లోపాలే ఈ సంక్షోభానికి మూలం. చాలా కాలేజీల్లో అధ్యాపకులకు పరిశ్రమ అనుభవం తక్కువ. ఫలితంగా వారు సిద్ధాంతాలను మాత్రమే బోధిస్తారు, కానీ నిజజీవిత సమస్యలను ఎలా పరిష్కరించాలో విద్యార్థులకు నేర్పలేరు. పరిశ్రమలతో విద్యాసంస్థలకు సరైన అనుసంధానం లేదు. ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టులు, పరిశ్రమ నిపుణులతో పరస్పర చర్చలు చాలాఅరుదు. అంతేకాదు, చాలా కళాశాలల్లో ల్యాబ్‌లు, సాఫ్ట్‌వేర్‌లు పాతబడ్డవే. ఆధునిక సాంకేతికతను అనుభవించే అవకాశమే విద్యార్థులకు ఉండడం లేదు. ఈస్థితి మారాలంటే సమగ్ర సంస్కరణలు అవసరం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను నిరంతరం నవీకరించాలి. బట్టీ పట్టే పరీక్షల బదులు ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, కేస్ స్టడీలపై దృష్టి పెట్టాలి. అధ్యాపకులు పరిశ్రమల్లో కొంతకాలం పనిచేసేలా ప్రోత్సహించాలి, అలాగే పరిశ్రమ నిపుణులను తరగతుల్లోకి తీసుకు రావాలి. విద్యార్థులకు నిజమైన ఇంటర్న్‌షిప్‌లు, వాస్తవ సమస్యలపై పనిచేసే అవకాశాలు కల్పించాలి. మార్పులు చేయకపోతే ఇంజనీరింగ్ డిగ్రీలు ఉద్యోగాల తాళాలు కాకుండా నిరుద్యోగానికి సర్టిఫికెట్లుగా మారిపోతాయి. ఇది యువత భవిష్యత్తుకు మాత్రమే కాదు, దేశ ఆర్థిక భవిష్యత్తుకూ ముప్పు. విద్యా వ్యవస్థ, పరిశ్రమ, ప్రభుత్వం కలిసి వెంటనే సంస్కరణలకు అడుగులు వేయాలి. ఇది హెచ్చరిక మాత్రమే కాదు మన యువత భవిష్యత్తును రక్షించుకునే చివరి అవకాశం.

# గ్రామీణ ఉపాధికి గొడ్డలిపెట్టు!



అప్పటి ప్రధాని డా.మన్మోహన్ సింగ్ 2005లో, తన తొలి హయాంలో అమలులోకివచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఇజిఎ) భారత సంక్షేమ విధానంలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 41ఆధారంగా రూపుదిద్దుకున్న ఈచట్టం, ఉపాధిని ప్రభుత్వ కృపపై ఆధారపడి ఉన్న పథకంగా కాకుండా, పౌరుల హక్కుగా గుర్తించింది. విస్తృతప్రజా చర్చలు, పార్లమెంట్ ఏకగ్రీవ ఆమోదంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక భద్రతా పథకంగా ఎదిగింది. ఈ పథకం పేరు మార్చడమేగాక, చట్టాన్ని రద్దుచేసి, కొత్తచట్టాన్ని తీసుకురావడం గ్రామీణ ఉపాధికి గొడ్డలిపెట్టు. ప్రారంభంలో ఎంజీఎన్‌ఆర్‌ఇజిఎ డిమాండ్ ఆధారిత ఉపాధి హామీగా పనిచేసింది. గ్రామీణ కుటుంబం పని కోరితే ప్రభుత్వం ఇవ్వాల్సిన చట్టబద్ధ బాధ్యత ఉండేది. దీని వల్ల భూమిలేని కూలీలకు చర్చా శక్తి పెరిగి, వ్యవసాయ వేతనాలు మెరుగుపడ్డాయి. గ్రామసభల ఆధ్వర్యంలో ప్రణాళిక, అమలు, సామాజిక తనిఖీలు జరగడం ద్వారా స్థానిక స్వయంపాలన బలోపేతమైంది. వలసలు తగ్గాయి, వేతన భద్రత పెరిగింది. ఇప్పటికీ పనికిఉన్న డిమాండ్ ఈ పథకం అవసరాన్ని స్పష్టంగా చూపుతోంది. కానీ దశలవారీగా ఈ హామీని ఖాళీ చేస్తున్న విధానం అమలులోకి వచ్చింది. ముఖ్యంగా డిమాండ్ ఆధారిత, పరిమితిలేని నిధుల స్థానంలో ముందుగా నిర్ణయించిన బడ్జెట్ కేటాయింపులు రావడంతో ఉపాధిహక్కు నిర్వీర్యమైంది. రాష్ట్ర స్థాయిలో పని దినాలకు పరిమితి విధించబడింది. వ్యయ భారం 90:10నుంచి 60:40కి మారడంతో రాష్ట్రాలపై ఆర్థిక ఒత్తిడిపెరిగింది. కేంద్రం కేటాయింపులు మించితే మొత్తం భారం రాష్ట్రాలదే కావడంతో అనేక రాష్ట్రాలు ఉపాధి కల్పించడంలో వెనకడుగు వేస్తున్నాయి. వ్యవసాయ కాలంలో 60 'నోవర్క్ డేస్' విధించడం కూలీల భద్రతను మరింత దెబ్బతీసింది. గ్రామసభల ఆధ్వర్యంలో ఉన్న వికేంద్రీకృత వ్యవస్థ స్థానంలో పిఎం గతి శక్తి వంటి కేంద్రకృత నమూనాలు రావడం ద్వారా ఫెడరలిజం, ప్రజాస్వామ్య పాల్గొనడం బలహీనమయ్యాయి. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ బలహీనత భారతదేశ హక్కుల ఆధారిత సంక్షేమ వ్యవస్థపై జరుగుతున్న విస్తృత దాడిలో భాగమే. సమాచార హక్కు, భూసేకరణ, అటవీ హక్కులు, విద్యాహక్కు వంటి రంగాల్లోనూ ఇదేధోరణి కనిపిస్తోంది. ఉపాధిహక్కు క్షీణించడం రాజ్యాంగ సంకల్పానికి విరుద్ధమైన మార్పుగా మారింది. సర్వోదయ భావనకు ప్రతీక అయిన ఈచట్టం నిర్వీర్యం కావడం నైతికంగా, రాజ్యాంగపరంగా తీవ్రమైన వైఫల్యమే. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ రక్షణఅంటే భారతప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, గౌరవప్రదమైన జీవన హక్కును కాపాడటమే.

## సింగరేణి భవిష్యత్తుపై రాజీ లేదు

### ఎఐటియుసి అనుబంధ సింగరేణి వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/ఇల్లందు:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల మూలాన ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయని, దీన్ని అడ్డుకునేందుకు దశలవారీ పోరాటం చేస్తామని ఎఐటియుసి అనుబంధ సింగరేణి వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజకుమార్ తెలిపారు. ఎఐటియుసి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణకు తలమానికంగా ఉన్న సింగరేణిని పాలక ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. పాలకుల పనితీరు అధికారుల నిర్లక్ష్యం మూలాన నూతన భూగర్భంలో ఏర్పాటు ఓసీలకు అనుమతులు రావడం ఆలస్యం అవుతుందన్నారు. సింగరేణి భవిష్యత్తుపై రాజీపడేది లేదన్నారు. బొగ్గు గనులకు పుట్టినిల్లు అయిన ఇల్లందుని కాపాడుకునేందుకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కొయ్యగూడెం పూసపల్లి ఒసిలను ఏర్పాటు చేసి ఇక్కడ యువతకు ఉపాధి కల్పించేందుకు మినీ థర్మల్ పవర్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, నజీర్ అహ్మద్, దాసరి రాజారాం, బొప్పిశెట్టి సత్యనారాయణ, గడదాసు నాగేశ్వరరావు, కొరిమి సుందర్, బానోత్ బాలాజీ, గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ కృష్ణ, ఫిట్ కార్యదర్శి దాట్ల వెంకటేశ్వర్లు, దాట్ల శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ వినతి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మిషన్ భగీరథ కార్మికులకు గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆసిఫాబాద్‌లో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ గ్రిడ్ డివిజనల్ ఇంజనీర్ ఇర్ఫాన్ ఎల్ అండ్ టి ఇంజనీర్ దేవ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ పెండింగ్ వేతనాల విషయమై ఎల్‌అండ్‌టి యాజమాన్యాన్ని అనేకసార్లు కోరినప్పటికీ రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వేతనాలు అందక పండుగ పూట కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం 26,000 రూపాయలు చెల్లించాలని ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలతో పాటు ఒక నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు దివాకర్, జిల్లా కన్వీనర్ బాలేష్, శ్రీకాంత్, వెంకటేష్, సాగర్, కుమార్, వేణు, దిలీప్, పురుషోత్తం, రవీందర్, నాగబాబు, భీం రావు, జంగు తుకారాం, భాస్కర్ పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు

### గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** స్వాతంత్ర సమరయోధుడు, సూర్యాపేట తొలి శాసనసభ్యుడిగా, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం పేరును సూర్యాపేట జిల్లాకు నామకరణం చేయాలని గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం భవన్ వద్ద తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన గౌడ కులాలకు చెందిన ప్రజలను గీతవృత్తిలో జీవిస్తున్నారని ఆనాటి నుండి అటు ఆంధ్ర ప్రాంతం ఇటు తెలంగాణ, రాయలసీమలోని గీత పనివారలను సమీకరించి కల్లుగీత వృత్తిలో కాంట్రాక్టు హర్రాజు విధానానికి వ్యతిరేకంగా ధర్మభిక్షం నేతృత్వంలో పోరాటం జరిగిందన్నారు. కల్లు సొసైటీలు కావాలని వివిధ పన్నుల విధానం రద్దు చేయాలని, వన పెంపకానికి భూమి, వృత్తిలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా, వృద్ధాప్య ఫెన్షన్ ఇవ్వాలని ఆనాటి ప్రభుత్వాల మీద ధర్మభిక్షం పోరాటాలు చేసి విజయం సాధించారని ఆయన గుర్తు చేశారు. సూర్యాపేట పట్టణంలో తొలి హాస్టల్ నిర్మించి విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పి చైతన్యవంతులను చేసి అనేక రంగాలలో తీర్చిదిద్దిన మహానాయకుడన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, తాగు, సాగు నీరు గురించి అనేక పోరాటాలు నిర్వహించి సాధించిన మహానాయకుడని కొనియాడారు. సూర్యాపేట జిల్లాకు ప్రభుత్వం వెంటనే స్పందించి వారి పేరును పెట్టి వారి శతజయంతిని, వర్ధంతిని, కార్యక్రమాలను ప్రభుత్వమే నిర్వహించాలని ఆయన కోరారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ధర్మభిక్షం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం రాష్ట్ర నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, కరుణాదేవి, చామల అశోక్ కుమార్, దంతాల రాంబాబు, అనంతుల మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, నీలా శ్రీనివాస్, పెంద్ర కృష్ణ, ఎండి.పాషా, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, దేశగాని హేమలత, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా నుంచి 4 వేల మందితో

## కదంతొక్కిన సిపిఐ శ్రేణులు

### సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఖమ్మంలో ఆదివారం జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల భారీ బహిరంగ సభకు మహబూబాబాద్ నుండి 4,000 మంది 40 వాహనాలు, ట్రైన్‌ల ద్వారా, బస్సుల ద్వారా తరలివెళ్లి విజయవంతం చేసిన సిపిఐ కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు, సాను భూతిపరులకు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి ధన్యవాదాలు తెలియజేశారు. ఖమ్మం సిపిఐ సభ విజయవంతం కావడం పట్ల మానుకోట నుంచి తరలివచ్చిన కార్యకర్తలు అభినందన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు లేకపోతే ప్రజలకు నష్టం జరుగుతుందని, కమ్యూనిస్టుల పోరాటాలు భవిష్యత్తు తరాలకు అవసరమన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి, చింతకుంట్ల వెంకన్న, ఎండి మహమూద్, గారె రవి చంద్రబోస్, తండా శ్రీనాథ్ కూరాకుల పాల్, దార వీరన్న మెతుకు శ్రీకాంత్, ఎండి రఫీ, గాదే శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.



### స్ఫూర్తి నింపిన

## సిపిఐ వందేళ్ళ ఉత్సవాల సభ

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి




**ప్రజాపక్షం/హనుమకొండ :** ఖమ్మంలో జరిగిన సిపిఐ వందేళ్ళ ఉత్సవాల భారీప్రదర్శన, బహిరంగసభ స్ఫూర్తి నింపిందని, ఆ స్ఫూర్తితో మరిన్ని ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కర్రె బిక్షపతి మాట్లాడుతూ ఖమ్మం గుమ్మంలో జరిగిన సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాల బహిరంగ సభ జన సేవాదళ్ కవాతులో సైతం హనుమకొండ జిల్లా నుండి వందలాదిమంది యువ కమ్యూనిస్టు కార్యకర్తలు, జిల్లాలోని ఆయా మండలాలు, ప్రాంతాల నుండి బస్సులు, ఇతర వాహనాల ద్వారా 5 వేల మంది తరలి వెళ్లి ఖమ్మం సభలో పాల్గొన్నారని తెలిపారు. వందేళ్ళ ఉత్సవాల బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రజానికానికి సిపిఐ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. సిపిఐ 100 సంవత్సరాల చరిత్రలో పేద ప్రజలకు అండగా నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తుందని, వెట్టిచాకిరి విముక్తి కొరకు కార్మిక కర్షకులను దోపిడీ నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు సిపిఐ నిర్వహిస్తుందని తెలిపారు. పేదల సమస్యలు, ముఖ్యంగా ఇండ్లు ఇండ్ల స్థలాలు, సాగు భూములు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నడుపుతున్న పార్టీ సిపిఐ అని బిక్షపతి అన్నారు.

### పేదరిక నిర్మూలనలో

# మహిళల పాత్ర కీలకం

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కుల అందజేత



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పేదరిక నిర్మూళనలో మహిళల పాత్ర కీలమని, మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించినప్పుడే సమాజం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని, పేద కుటుంబాలు ఆర్థికాభివృద్ధి వైపునకు అడుగులేస్తాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు చెందిన డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మొత్తం 864 పట్టణ స్వయం సహాయక సంఘాలకు రూ.2,88,35,377ల విలువైన మెగా చెక్కును ఆయన మహిళా ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ మహిళలు పొదుపుతో పాటు చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారాల ద్వారా ఆర్థికంగా ఎదగాలన్నారు. ఇంటి, సొంతఅవసరాలకు మంజూరైన రుణాన్ని వినియోగించుకోకుండా ఆర్థికాభివృద్ధి కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తిస్థాయిలో రుణాలు పంపిణీ చేసి మహిళలకు భరోసా కల్పించడమే ప్రభుత్వలక్ష్యమన్నారు. 60 డివిజన్ల నుండి పెద్దఎత్తున హాజరైన మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ మధు, సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, డిఎంఎస్ రాజేష్, కొత్తగూడెం, పాల్వంచ మున్సిపల్ మేనేజర్లు రవీందర్, ఎల్‌వి సత్యనారాయణ, టిఎల్‌ఎఫ్ బాధ్యులు ఎంఎ సబీరాభేగం, భారతి, ప్రవల్లిక, స్వరూప, మాజీ కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర రావు, భూక్య శ్రీనివాస్, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణాచారి, నాయకులు వాసిరెడ్డి మురళి, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, నేరెళ్ల రమేష్, గణేష్, కొమారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పల్లె నుండి ప్రపంచస్థాయికి..

ప్రజాపక్షం/మద్దూర్: పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం రోజు ముఖ్యమంత్రి కప్2026 ను ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలికితీసి వారిని అంతర్జాతీయ స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ క్రీడా సంబరాలను నిర్వహిస్తోంది. పాఠశాల ప్రాంగణం నుండి ప్రధాన రహదారి గుండా విద్యార్థులు ఉపాధ్యాయులు క్రీడా జ్యోతితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పల్లె నుండి ప్రపంచస్థాయికి అనే స్ఫూర్తిదాయక రూపకల్పన అనే నినాదంతో ఈ ఏడాది సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా క్రమశిక్షణ మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. గ్రామ మండల స్థాయి పోటీలు ప్రారంభమవుతాయని ప్రతిభ గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి, జనక్ రెడ్డి, కొనాన్ నిహారిక, పాఠశాల ఉపాధ్యాయులు సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలి : సిఐ




ప్రజాపక్షం/మక్తల్: మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా జక్లేర్ గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన జక్లేర్ గ్రామానికి చెందిన హన్మన్ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకోని, వాహనదారులు, ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం మక్తల్ సిఐ రామ్‌లాల్ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్ సీట్‌బెల్ట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నియమాలను నిర్లక్ష్యం చేయడమేనని తెలిపారు ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతకు ముఖ్యంగా పరిగణలోకి తీసుకొని వాహనాలు నడపాలని, మైనర్ పిల్లలు, వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరారు. రోడ్డు భద్రత అనేది ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి నియమాలు పాటించినప్పుడే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణ




ప్రజాపక్షం/కృష్ణ : ప్రజా సమస్యల పై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న ప్రజాపక్షం దినపత్రిక 2026 క్యాలెండర్‌ను సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నేటి సమాజంలో పత్రికల పాత్ర చాలా కీలకమైందని, సమాజానికి, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పత్రికలకు స్వేచ్ఛ చాలా ముఖ్యమని, ఎవరికి భయపడకుండా నిర్భయంగా, నిస్సంకోచంగా, వార్తలు రాసి నిజ నిజాలను నిగ్గు తేల్చాల్సిన అవసరం పాత్రికేయుల పై ఉందన్నారు. ప్రజలందరి ఆదరాభిమానాలతో పత్రికా రంగంలో నూతన ఒరవడితో అనధికాలంలోనే విశ్వసనీయమైన సమాచారాన్ని అందించే పత్రికల్లో ప్రజాపక్షం పత్రిక ఒకటి అని తెలిపారు. అలాగే నిరంతరం సమస్యల పై గలమెత్తి ప్రజల పక్షాన నిలబడి సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాపక్షం పత్రిక యజమాన్యం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అశోక్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్ పాటిల్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారవారధి ప్రజాపక్షం



ప్రజాపక్షం/వెల్దండ: ప్రజా సమస్యలను ఎలుగెత్తిచాటుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంకోసం ప్రజాపక్షం దినపత్రిక పనిచేస్తుందని తెలంగాణరాష్ట్రపుడ్‌కమీషన్‌చైర్మన్ గోలిశ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రజాపక్షం తెలుగు జాతీయదినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం ప్రజా సమస్యలపై తమ గొంతుకతో వానిని వినిపిస్తుందని, ప్రజా సమస్యలపై ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచేది దినపత్రికలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చౌదర్‌పల్లి మాజీ ఎంపిటిసి నాగులునాయక్, ఆమన్‌గల్ వ్యవసాయమార్కెట్‌కమిటి మాజీ డైరెక్టర్ సురమల్ల సుభాష్, ప్రజాపక్షం తెలుగు జాతీయదినపత్రిక జర్నలిస్టు మల్లేష్ పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి: ఎఇఒ



ప్రజాపక్షం/ మాగనూర్ : వ్యవసాయ పథకాల లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఈఓ డి.పవన్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతులు ఏఈఓ రైతు వేదికలో సంప్రదించి తప్పకుండా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రైతులు పట్టాదార్ పాసు పుస్తకం ఆధార్ కార్డుతో పాటు ఆధార్కు లింక్ అయిన మొబైల్ నెంబర్ను ఓటీపీ కోసం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే రైతులు వ్యవసాయ పథకాల లబ్ధికి అనర్హులుగా పరిగణించబడతారని అన్నారు. కావున భూమి పట్టాదార్ పాస్ పుస్తకం కలిగి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు.

# చదువుతోనే సమాజంలో మార్పు

### విద్య, వైద్యానికే మాప్రభుత్వం అధిక ప్రాధాన్యత

### మంత్రి దామోదర రాజనర్సింహ్మ



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో మున్సిపాలిటిలలో సోమవారం వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబసంక్షేమ, శాస్త్ర సాంకేతికశాఖలమంత్రి దామోదర రాజనర్సింహ్మ, ఎంపి మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఎస్‌పి డాక్టర్ సంగ్రామ్‌సింగ్‌జిపాటిల్, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన పనులను, ఎండబెట్లవద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.10కోట్లతో నిర్మించనున్న హైలెవల్‌బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, రూ.2కోట్లతో సిసిరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.ఒక కోటి 5లక్షల 50వేల రూపాయలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతిగదులను ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాలకు రూ.9కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన కళాశాల భవనానికి శంకుస్థాపన, నాగర్‌కర్నూల్ మున్సిపాలిటి పరిధిలో రూ.10 కోట్ల రూపాయలతో సిసిరోడ్ల పనులకు శంకుస్థాపన, పట్టణంలో డ్రైనేజి వ్యవస్థకు రూ.10కోట్ల రూపాయలతో శంకుస్థాపన, రూ.3కోట్ల 14లక్షల 60వేల రూపాయల వ్యయంతో పట్టణ పరిధిలోని కేసరిసముద్రం మినీట్యాంక్‌బండ్ ఆధునాతన అభివృద్ధి పనులకు శంకుస్థాపన పనులను ప్రారంభించారు. అనంతరం రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ్మ మాట్లాడుతూ చదువే సమాజంలో మార్పుకునాంది పలుకుతుందని, అందుకే రాష్ట్రప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

**విద్యార్థులతో మంత్రి ముఖాముఖి**

అంతకుముందు పలువురు విద్యార్థులతో మాట్లాడారు. జీవితంలో ఏమి సాధించాలనుకుంటున్నారు, ఎలాంటి లక్ష్యాలతో ముందుకు సాగుతున్నారన్న అంశాలపై విద్యార్థులను ప్రశ్నిస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాను విద్యాహబ్‌గా తీర్చిదిద్దాలనే ఉద్ధేశ్యంతోనే రాష్ట్రప్రభుత్వం నాగర్‌కర్నూల్ పట్టణంలో విద్యాసంస్థలను నెలకొల్పుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



## మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### మంత్రి వాకిటి శ్రీహరి

ప్రజాపక్షం/అమరచింత : రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం సాయంత్రం అమరచింత మున్సిపాలిటీలో ఇందిరా మహిళా శక్తి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ, పావలా వడ్డీ చెక్కుల పంపిణీ, మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి వాకిటి శ్రీహరి తో పాటు టిపిసిసి కల్లుగీత సెల్ డిపార్ట్మెంట్ చైర్మన్ నాగరాజు గౌడ్ పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి అనేక నిధులతో సంక్షేమ పథకాలను మహిళలకు అందజేస్తున్నారని తెలిపారు. అమరచింత పట్టణంలో 124 మేళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేయడం జరుగుతున్నదని తెలిపారు. అలాగే మహిళా సంఘాలకు పావలా వడ్డీ కింద 61 లక్షల 40 వేల చెక్కు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ నాగరాజ్, మెప్మా కోఆర్డినేటర్ యువరాజు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అయుబు ఖాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎస్ఎం అరుణ్ కుమార్, నాయకులు తౌఫిక్, తిరుమలేష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్యామ్, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అంచనాలకు అనుగుణంగా గ్రామ పరిపాలన



సర్పంచుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

ప్రజాపక్షం/నారాయణపేట్: కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచులు సద్వినియోగం చేసుకుని ప్రజల అంచనాలకు అనుగుణంగా తమ తమ గ్రామాలలో మంచి పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఆదేశానుసారం గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో సోమవారం నూతనంగా ఎన్నికైన సర్పంచుల మొదటి బ్యాచ్ శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 17 వరకు జిల్లాలో మూడు విడతలలో సర్పంచులు ఎన్నికలను పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో మొగులప్ప, ఆయా మండలాల ఎంపీడీవోలు, ఎంపివోలు, పంచాయితీ కార్యదర్శులు, డిపివో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాల అమలు నారాయణపేట నుంచే మొదలు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన (హైలెట్) సంక్షేమ పథకాల అమలును నారాయణపేట జిల్లా నుంచే శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలోని కోస్గి, మద్దూరు మున్సిపాలిటీల్లోనూ సోమవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలను ప్రారంభించడం జరిగిందని చెప్పారు. జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ లోనూ ఇందిరా మహిళా శక్తి సంబరాలలో భాగంగా మహిళా సంఘాల కు రూ.1.41 కోట్ల వడ్డీ లేని రునాలు, పట్టణ మహిళలకు 7 వేల ఇందిరా మహిళా శక్తి చీరలు వచ్చాయని, వాటిని ప్రతి వార్డులో మహిళలకు పంపిణీ చేయాలని, రెండు రోజుల్లో అందరికీ చీరలను పంపిణీ చేయించాలని కమిషనర్ నర్సయ్య ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ కుమార్, జిల్లా ఆస్పత్రి సలహా కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కుంభం శివ కుమార్ రెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కాంత్ కుమార్, ఆర్టీ మెంబర్ పోషల్ రాజేష్, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, మేనేజర్ అజీమ్, మున్సిపల్ అధికారులు, మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మీటింగ్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 51 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని వారు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతూ సీఎం కప్ క్రీడా పోటీలను షెడ్యూల్ ప్రకారం గ్రామ, మండలం/ మున్సిపాలిటీ, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు ఎంపిడిఓలు, ఎంపిఓలు, పంచాయితీ కార్యదర్శులు, ఎంఈఓలు, హెడ్ మాస్టర్‌లు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ నెల 17 నుండి 22 వరకు గ్రామస్థాయిలో, తరువాత 28 నుండి 31 వరకు మండల / మున్సిపల్ స్థాయిలో, ఫిబ్రవరి 3 నుండి 5 వరకు నియోజకవర్గంలో ఫిబ్రవరి 9 నుండి 12 జిల్లా స్థాయిలో నిర్వహించాలని సూచించారు. గురుకుల పాఠశాలలు, వినతి గృహాలు జిల్లా అధికారులు తమకు కేటాయించిన వాటిని తనిఖీలు పూర్తి చేసి విద్యా ఐఅప్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో డిఆర్‌డిఓ నర్సింహులు, ఆర్‌డిఓ నవీన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాహితమే పత్రికల ప్రధాన లక్ష్యంకావాలి

### ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి

ప్రజాపక్షం/కల్వకుర్తి : ప్రజా సమస్యలను ప్రభుత్వందృష్టికితేవడం ప్రజాపక్షం జాతీయ దినపత్రిక ముందంజలో ఉందని, ప్రజాహితమే పత్రికల ప్రధాన లక్ష్యంకావాలని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి కొనియాడారు. సోమవారం పట్టణంలోని కెబిఎస్‌ఫంక్షన్‌హాలులో ప్రజాపక్షం దినపత్రిక 2026 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ పత్రికలు నిబంధనతోపాటు విలువలతోకూడిన వార్తా కథనాలురాసి ప్రజా సమస్యలను పరిష్కరించేవిధంగా ఉండాలని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నతరుణంలో ప్రజలకు చేరవేసేందుకు ప్రజాపక్షం దినపత్రికతోపాటు పలు పత్రికల కృషి ఎంతో ఉందని ఆయన గుర్తుచేశారు. రానున్న రోజులలో ప్రజల ప్రేమాభిమానాలను సంపాదించుకొని పత్రికారంగంలో ప్రజాపక్షం దినపత్రిక మరింతగా రాణించాలన్నారు.



కార్యక్రమంలో ప్రజాపక్షం జాతీయ దినపత్రిక జిల్లాప్రతినిధి సామబాలయ్య, మున్సిపల్ కమీషనర్ మహ్మద్‌షేక్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ప్రజాపక్షం/శ్రీరంగాపూర్: రోడ్డు పై ప్రయాణించే ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలను తూ.చా తప్పకుండా పాటించాలని స్థానిక ఎస్ఐ హిమబిందు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శ్రీరంగాపూర్ మండలం పరిధిలోని కంబల్లాపూర్ గ్రామంలో ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, నిద్రమత్తులో వాహనం నడపడం వంటి అలవాట్లు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అలాగే కార్లు నడిపేవారు విధిగా సీటు బెల్ట్ ధరించాలన్నారు. అనంతరం గ్రామస్తులచే ప్రమాదాల నివారణకై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మన్యపు రెడ్డి, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 108/102 అంబులెన్స్ సేవలు భేష్

### ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కె.రవి



ప్రజాపక్షం/వీపనగండ్ల: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108,102 అంబులెన్స్ సేవలు ప్రజలకు అత్యుత్తమంగా అందుతున్నాయని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కె.రవి తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న 108/102 అంబులెన్స్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లలో అందుబాటులో ఉన్న వివిధ రకాల అత్యవసర వైద్య పరికరాల పనితీరు, మందుల నిల్వ, శుభ్రత తదితర అంశాలను సవివరంగా పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగవంతమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 108 అంబులెన్స్ సేవల ద్వారా ప్రమాద బాధితులు, ఆపదలో ఉన్న రోగులను తక్షణమే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలిస్తూ ప్రాణాలను కాపాడుతున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 108,102 అంబులెన్స్ సేవల ద్వారా ప్రజలకు నిరంతరం వైద్య సహాయం అందిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కె.రవి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ మహబూబ్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ సాయికుమార్, అంబులెన్స్ పైలెట్ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వేమన జయంతి

ప్రజాపక్షం/కొత్తకోట: కొత్తకోట పట్టణ కేంద్రంలోని రాఘవేంద్ర దేవాలయం దగ్గర సోమవారం నాడు వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రజా కవి, సామాజిక సంస్కర్త యోగి వేమన జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. కుల మత బేధాలు, మూఢనమ్మకాలను పారద్రోలేందుకు యోగి వేమన తన పద్యాల ద్వారా చేసిన కృషి ఈనాటి సమాజానికి ఎంతో ఉపయుక్తం, విశ్వదాభీరామ వినర వేమా అంటూ ఆయన చెప్పిన నీతి సూత్రాలు అనుసరణీయం. అలాంటి మహనీయుడి జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేముల శ్రీనివాస్ రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, పి.మోహన్ రెడ్డి, పి.రవీందర్ రెడ్డి, పి.నవీన్ కుమార్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, శేషిరెడ్డి, రంగారెడ్డి, శాంతి, లింగం, రాములు, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి : ఎస్పీ సునిత రెడ్డి

ప్రజాపక్షం/వనపర్తి: ప్రతి సోమవారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయములో నిర్వహించే ప్రజావాణిలో భాగంగా జిల్లాలో సోమవారం వివిధ ప్రాంతాల నుండి 15 మంది ఫిర్యాదుదారులు వివిధ సమస్యలపై నేరుగా జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఫిర్యాదులు అందించారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఫిర్యాదుపై వనపర్తి ఎస్పీ స్పందించి స్వయంగా ఫిర్యాదును పరిశీలించి సంబంధిత పోలీ స్టేషన్ అధికారులకు తక్షణమే సదురు ఫిర్యాదులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశాను. దీనితో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే బరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడంపై వచ్చిన ఫిర్యాదు దారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణిలో మొత్తం 15 ఫిర్యాదుల్లో 2 భార్యభర్తల ఫిర్యాదులు, 4 భూతగాదాల ఫిర్యాదులు, 9 పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

### అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను



ప్రజాపక్షం/ నారాయణపేట్ : గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. 26 న ఉదయం 9 గంటలకు పరేడ్ మైదానంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జాతీయ జెండా ఆవిష్కరిస్తారని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాకలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. దేశభక్తిని చాటేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారికి సూచించారు. గార్డ్ ఆఫ్ హానర్ పోలీసు శాఖ అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉండాలని ఫైర్ డిపార్ట్మెంట్ వారికి, అంబులెన్స్, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. సౌండ్ సిస్టమ్ తహసీల్దార్ నారాయణపేట, డి.యం. సివిల్ సప్లై స్నాక్స్ స్వీట్స్ తదితర ఏర్పాటు చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ లింగయ్య, ఆర్ .ఆర్.డి.ఓ. రామచందర్ , వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పనులను త్వరగా పూర్తిచేయాలి

### విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

ప్రజాపక్షం/వంగూర్ : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణపబ్లిక్‌స్కూల్ పనులను త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర విద్యా కమిషన్‌చైర్మన్ ఆకునూరిమురళి అన్నారు. సోమవారం మండలపరిధిలోని పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం విద్యాకమిటి సభ్యులతో మాట్లాడుతూ పనులవిషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. పూర్తి బాద్యత కమిటి సభ్యులేదేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకునారమ్మ, సురేందర్, విద్యాకమిటి సభ్యులు గణేష్, శంకర్‌యాదవ్, రామ్‌లక్ష్మణ్, పాఠశాల ఉపాధ్యాయులు రఘువరన్, నారాయణరెడ్డి, నరేందర్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.





## ప్రజల గొంతుక 'ప్రజాపక్షం'

**ప్రజాపక్షం/చండూరు:** ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలను రాస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న ప్రజాపక్షం దినపత్రిక 2026 క్యాలెండర్‌ను సోమవారం మండల కేంద్రంలో పిసిసి సభ్యులు జాలే నర్సింహారెడ్డి, రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డిలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో ప్రజాపక్షం దినపత్రిక విజయవంతంగా ప్రజల గొంతుక వినిపిస్తోందని అన్నారు. ప్రజాపక్షం దినపత్రిక విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో చండూరు మండల ప్రజా పక్షం విలేకరి బండెల అంజనేయులు, బచ్చనబోయిన జగదీష్, తిరుపతయ్య, శ్రీను, మహేష్, వెంకటేష్, రాములు, అంజయ్య పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు ప్రజలకు తెలియజేయడంలో ప్రజాపక్షం ముందంజ



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ నివాస గృహంలో రామన్నపేట మండల సిపిఐ నాయకుల సమక్షంలో ప్రజాపక్షం జాతీయ దినపత్రిక 2026 సంవత్సర నూతన క్యాలెండర్‌ను తన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు ప్రభుత్వాలకు, ఇటు ప్రజలకు మధ్య వారధిగానుండి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాలకు తెలియజేయడంలో ప్రజాపక్షం ముందంజలో ఉంటున్నారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ, ప్రజాపక్షం దినపత్రిక మండల రిపోర్టర్ సంగిశెట్టి పొందు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి క్లెం రామచంద్రం, నాయకులు ఎర్ర రమేష్, పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటియుసి మండల అధ్యక్షుడు శివరాత్రి సమ్మయ్య, రైతు సంఘం అధ్యక్షులు ఊట్కూరి కృష్ణ, ఏనుగుల రమేష్ పాల్గొన్నారు.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నాంపల్లి :** ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రజాస్వామ్య విలువలను కాపాడేది ప్రజాపక్షం దినపత్రిక అని నాంపల్లి డిప్యూటీ తాహసిల్దార్ దోటి వెంకన్న అన్నారు.మండల కేంద్రం తహసిల్దార్ కార్యాలయంలో ప్రజాపక్షం 2026 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా ప్రత్యేక వార్త కథనాలను ప్రచురిస్తున్న ప్రజా గొంతుక ప్రజాపక్షం దినపత్రిక అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ ఊరిపాక వెంకటయ్య,నక్క మురళి, యాదయ్య, రమేష్,రాములు,లక్ష్మణ్,యాదగిరి ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి పత్రికలు కృషి



**ప్రజాపక్షం/చింతపల్లి :** ప్రజల సమస్యలను పరిష్కారం చేందుకు పత్రికలు కృషి చేయాలని ధైర్యపురి తండా గ్రామ సర్పంచ్ వాంకుడోత్ అనిత దాస్ అన్నారు. సోమవారం సర్పంచ్ చేతుల మీదుగా ప్రజాపక్షం 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పత్రికలు పనిచేయాలన్నారు. ఎలాంటి పక్షపాతం లేకుండా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జర్నలిస్టులు కృషి చేయాలన్నారు. ప్రజల గొంతుకగా ప్రజాపక్షం పత్రిక ముందుండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ, జగన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెరువుగట్టు బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నార్కెట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలోని శ్రీ శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను సోమవారం నకిరేకల్ పట్టణంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం చెరువుగట్టు బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో భద్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్, కాంగ్రెస్ మేనిఫెస్టో సెంటర్ చామల శ్రీనివాస్, పన్నాల రాఘవ రెడ్డి,చెరువుగట్టు సర్పంచ్ నేతకాని కృష్ణయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ వారాల రమేష్, ఆలయ ఈఓ మోహన్ బాబు పాల్గొన్నారు.

## దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల(రెవెన్యూ) అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 29 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవెన్యూ శాఖ 20, పంచాయతీ శాఖ 3, గ్రామీణాభివృద్ధి శాఖ 2, ఎస్సీ వెల్ఫేర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మున్సిపాలిటీ, లేబర్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** మహిళలు స్వయం శక్తితో పైకి ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. సోమవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయావరణలో ఉన్న ఉదయాదిత్య భవన్‌లో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు11.38 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు చెక్కులను అందజేశారు. అంతేకాక ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ వచ్చే సంవత్సరంలోపు ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇన్ఫలు ఇస్తామని, ఎవరైనా ఆర్థిక స్తోమత లేక పెద్ద పెద్ద చదువులు చదివించలేకపోతే తనను సంప్రదిస్తే సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు తోపాటు ,వారి అభ్యున్నతికి కుటుంబాల తోడ్పాటుకు అనేక కార్యక్రమాల అమలు చేస్తున్నదని తెలిపారు. ఆర్థికంగా వారు నిలదొక్కునేందుకు వడ్డీ లేని రుణాలను



ఇస్తున్నదని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి,రెవెన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,మెప్మా పీడీ శ్రీనివాస్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్,మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్,గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**రైతు పక్షపాత ప్రభుత్వం**

తమది రైతు పక్షపాత ప్రభుత్వమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు .సోమవారం అయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో 8 కోట్ల రూపాయల విలువచేసే వ్యవసాయ యంత్ర పరికరాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మంచి రోజులు వచ్చాయని అన్నారు. 2 లక్షల లోపు రుణాలున్న రైతులకు సంబంధించి 20 వేల కోట్ల రుణాలను రుణమాఫీ చేయడం జరిగిందని,అంతేకాక తాము అధికారంలోకి రాకముందు ఉన్న రైతుబంధును సైతం చెల్లించామని తెలిపారు .నల్లగొండ జిల్లాలో 8 కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలను సన్న, చిన్న కారు, మహిళా రైతులకు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీపై ఇవ్వడం జరుగుతున్నదని, తక్కిన వారికి 40 శాతం సబ్సిడీపై వీటిని అందజేస్తున్నామని ఆయన తెలిపారు.

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు స్పష్టం చేశారు. సోమవారం పోచంపల్లి మండలం జలల్ పూర్‌లోని స్వామి రామానంద తీర్థ ఇన్స్టిట్యూట్‌లో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకి గ్రామ పంచాయతీ పాలన, విధులు, అభివృద్ధికి సంబందించిన శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హనుమంత రావు, స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ కిషోర్ రెడ్డి, డైరెక్టర్ విహారి, జడ్పీ సిఈఓ శోభా రాణి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, యమ్ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డితో కలసి జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లడుతూ గ్రామాలలో అన్ని రకాలుగా అభివృద్ధి జరగాలి అంటే సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సర్పంచ్‌లు బాగా పని చేస్తేనే వారి గ్రామాలకు మంచి పేరు వస్తుందన్నారు. పంచాయతీ రాజ్ చట్టంలో సర్పంచ్‌లకు పొందు పరిచిన అధికారాలు, విధులు తదితర అంశాలను శిక్షణలో భాగంగా క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ, త్రాగు నీటి ఎద్దడి లేకుండా చూడడం లాంటి ప్రధాన అంశాల్లో సర్పంచ్‌లు చురుకుగా పని చేయాలిసిన అవసరం ఉంటుందన్నారు. ప్రతీ గ్రామం శుభ్రంగా ఉంచాలన్నారు. పంచా



యతీ రాజ్ చట్టంలోని గ్రామ పాలన విధులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి పథకాలు, ఆదర్శ గ్రామపంచాయతీల నిర్మాణం తదితర అంశాలపై సర్పంచ్ల బాధ్యతలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, పంచాయతీ రాజ్ చట్టంలోని ప్రతీ అంశాన్ని సర్పంచ్‌లు అవగాహన కలిగి ఉండాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, మోరల్ స్కిల్స్, తదితర అంశాల పైన కూడా సర్పంచ్‌లకు అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, యంపిఓలు, నూతన సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం చేసుకోవాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రానున్న మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించేలా ఆర్ఓలు,ఏ ఆర్ఓలు సహకరించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు.సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు నియమించబడిన ఆర్ఓలు ఏఆర్ఓ లకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికలకు నియమించబడిన ప్రతి ఒక్కరు విధులు నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నియమ,నిబంధనల ప్రకారం హ్యాండ్ బుక్ ఆధారంతో ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా చదువుకొని తప్పులు లేకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని చెప్పారు.ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే నామినేషన్ల స్వీకరణ నుండి పోలింగ్,కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు అన్ని అంశాల పట్ల ముందే సంసిద్ధం కావాలన్నారు. బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా పరిశీలించాలని,ఎలాంటి పొరపాట్లు జరగకుండా బ్యాలెట్



పేపర్ ముద్రణ, గుర్తుల కేటాయింపు వంటి వాటిని పాటించాలని తెలిపారు. నామినేషన్ల సమయంలో నామినేషన్ ఫామ్ లతో పాటు, ఓటర్ జాబితా, అభ్యర్థికి సంబంధించిన క్రిమినల్ కేసులు,చెక్ లిస్ట్, డిపాజిట్,వంటి వాటన్నిటిని సిద్ధం చేసుకోవాలని చెప్పారు. నామినేషన్ల సందర్భంగా అభ్యర్థుల డిపాజిట్, ఖర్చుల పరిమితి తదితర వివరాలన్నింటినీ ఆయన ప్రశ్న, జవాబుల ద్వారా ఆర్ఓలు ఏఆర్ఓ ల ద్వారా రాబట్టారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మున్సిపల్ ఎన్నికల నోడల్ అధికారి జె.శ్రీనివాస్,గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు అధికారులు పరిష్కరించాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులపై పర్యవేక్షణ ఉంటుందని అలాగే కొన్ని శాఖలలో పెండింగ్ దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి శాఖ తమ యొక్క డిడిఓ బ్యాంక్ అకౌంట్ వివరాలు జిల్లా అకౌంట్ వెరిఫికేషన్ కమిటికి సంబంధిత ప్రొఫార్మాలో పూర్తిచేసి కమిటి ముందు హాజరుకావాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 43 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించడం జరిగిందని చెప్పారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిప్యూటి సిఈఓ శిరీష, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్, డిఎంఅండ్‌హెచ్ఓ పి వెంకటరమణ, డిఎస్ఓ మోహన్ బాబు పాల్గొన్నారు.




# నేతల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణ

**సర్వే నివేదికనే ప్రమాణికం అంటున్న కాంగ్రెస్**

**అభ్యర్థుల ఎంపికలో బిఆర్ఎస్ ఆచితూచి**

**పురపోరుకు అధికారులు రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి చేయడంతో ఆయా పార్టీల నుండి టిక్కెట్‌ను ఆశిస్తున్న ఆశావహులు నేతల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల్లో ఒక్కొక్క వార్డు నుండి ము గ్గురు నుండి ఐదుగురు టిక్కెట్ కోసం పోటీపడుతున్నారు. దీంతో అధికార కాంగ్రెస్ సర్వే నివేదికల ప్రమాణికంగా టిక్కెట్లు కేటాయిస్తామని చెబుతుం డగా, ఈ ఎన్నిక ల్లోనైనా తమ సత్తా చాటా లని బిఆర్ఎస్ అభ్యర్థుల ఎంపికలో ఆచి తూచి వ్యవహరిస్తుంది.**




**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో మొత్తం ఐదు పురపాలక సంఘాలు ఉన్నాయి. ఇందులో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరిలు ఉండగా వీటి పరిధిలో మొత్తం 141 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అధికారులు ఇప్పటికే ఓటర్ జాబితాలను సరిచేయడం, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కూడా ఖరారు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కమీషనర్ అండ్ డైరెక్టరేట్, హైదరాబాద్ (సిడిఎంఏ) వారు పురపాలక సంఘాలకు చైర్మన్ల రిజర్వేషన్లను కూడా ప్రకటించారు. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం సమ్మక్క సారక్క సన్నిధిలో జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పుర పోరు ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయం తీసుకొని రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు కూడా లేఖ రాయడం జరిగింది. ఎన్నికల కమీషన్ కూడా రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల బరిలో నిలువాలనుకునే ఆశావహులు టిక్కెట్ల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. సూర్యాపేట పురపాలక సంఘం ఎన్నికల్లో అధికార పార్టీ నుండి టిక్కెట్ ఆశిస్తున్న వారు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్‌లను ప్రసన్నం చేసుకొని తమకు కేటాయించాలని వేడుకుంటున్న పరిస్థితి. ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ నుండి టిక్కెట్‌ను ఆశిస్తున్న వారు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అలాగే కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల పురపాలక సంఘాల పరిధిలో అధికార పార్టీ నుండి టిక్కెట్‌ను ఆశిస్తున్న వారు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతిల చుట్టూ తిరుగుతూ తమకు టిక్కెట్ ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. బిఆర్ఎస్ నుండి టిక్కెట్‌ను ఆశిస్తున్న వారు కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఒంటెద్దు నర్సింహారెడ్డిలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. తుంగతుర్తి నియోజక వర్గంలోని తిరుమలగిరి పురపాలక సంఘం ఎన్నికల్లో అధికార పార్టీ నుండి పోటీ చేయాలనుకునే వారు ఎమ్మెల్యే మందుల సామేల్, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యలను కలుస్తూ తమకు టిక్కెట్ ఇవ్వాలని కోరుతున్నారు. బిఆర్ఎస్ పార్టీ నుండి ఎన్నికల బరిలో నిలువాలనుకునే వారు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్‌ను కలిసి విన్నవించుకుంటున్నారు.

సర్వే నివేదికనే ప్రమాణికం అంటున్న కాంగ్రెస్
అభ్యర్థుల ఎంపికలో బిఆర్ఎస్ ఆచి తూచి

సర్వేల నివేధిక ప్రమాణికంగానే అభ్యర్థులకు టిక్కెట్లు ఖరారు చేస్తామని అధికార కాంగ్రెస్ నేతలు చెబుతుండగా, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ అభ్యర్థుల ఎంపికలో అధికార కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక సరళిని బట్టి తమ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆచి తూచి అడుగు వేస్తుంది. ఆయా పార్టీల నుండి టిక్కెట్‌ను ఆశిస్తున్న ఆశావహులు తమకు టిక్కెట్ దక్కుతుందా లేదా అనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. తాము పోటీ చేయాలనుకున్న వార్డుల్లో తమ పార్టీ బలమెంత, ప్రజల్లో తమకున్న బలమెంత అనే దానిని అంచనా వేసుకునే పనిలో పడ్డారు.



## మహిళలు స్వయం శక్తితో ఎదిగేందుకు ప్రభుత్వం ప్రోత్సహించాలి

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/చండూరు :** మహిళలు స్వయం శక్తితో పైకి ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం అయన చండూరు మున్సిపాలిటీ కార్యాలయావరణలో ఇందిరా మహిళా శక్తి సంబరాలలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.43.88లక్షల వడ్డీ లేని రుణాలు చెక్కులతోపాటు ఇందిరమ్మ చీరలను ఆర్‌డిఓ శ్రీదేవితో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతన్న తరుణంలో వారికి ప్రభుత్వం మహిళ సంఘాలు ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు అందిచడం ద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కునేందుకు మంచి అవకాశం కల్పిస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ మల్లేశం,తహసిల్దార్ రమాకాంత్ శర్మ,ఎంపిడిఓ యాదగిరి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి సతీష్ కుమార్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్ర శేఖర్ గౌడ్,కోడి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే మహిళల ప్రభుత్వం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ అంటేనే మహిళల ప్రభుత్వమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మినీ రవీంద్ర భారతిలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ఇందిరా మహిళా శక్తి పథకం కింద శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌లు మహిళా స్వయం సహాయక సంఘాలకు సుమారు రూ.7కోట్ల వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఇందిరమ్మ మహిళా శక్తి పేరుతో మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలో రెండెకరాల ప్రభుత్వ భూమిలో ఒక భవనాన్ని నిర్మిస్తామన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ బస్టాండ్‌ని అతిత్వరలో డిజిటల్ బస్టాండ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా సన్నాహాలు చేస్తున్నామని, సంబంధిత అధికారులకు కూడా వారు ఆదేశాలు ఇచ్చారని అన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగానే ప్రభుత్వ స్థలంలో ఒక మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీఏవో శ్రీనివాసశర్మ, మెప్మా టీఎంసీ బక్కయ్య, మహిళా సమాఖ్యల ప్రతినిధులు అనిత, అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆర్థిక సదస్సులో ఎంపి చామల




**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రపంచ ఆర్థిక దిగ్గజాలు కొలువైన దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలంగాణ అభివృద్ధి పురోగతిని వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న విప్లవాత్మక మార్పులు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అంతర్జాతీయ వేదికపై ఆయన సమర్థవంతంగా చాటి చెప్పారు. ప్రముఖ సంస్థ 'స్వనితి ఆధ్వర్యంలో నిర్వహించిన అత్యంత ప్రతిష్టాత్మకమైన ది మెరిడియన్ కలెక్టివ్ సబ్నేషనల్ కమిట్మెంట్ చార్టర్ కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజారంజక పాలన, పారిశ్రామిక వృద్ధి, పర్యావరణ హితమైన అభివృద్ధి విధానాలను వివరించారు. రాష్ట్రాల స్థాయిలో తీసుకునే నిర్ణయాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి సానుకూల ప్రభావం చూపుతాయో ఆయన విశ్లేషించారు. 'తెలంగాణ అభివృద్ధిని ప్రపంచ స్థాయి నాయకులకు వివరించడం ఒక గొప్ప అనుభూతి. మన రాష్ట్రానికి ఉన్న అద్భుతమైన వనరులు, మానవ వనరుల నైపుణ్యం చూసి ప్రపంచ ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ పర్యటన ద్వారా తెలంగాణకు భారీగా పెట్టుబడులు రావడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఒక ప్రత్యేక ముద్ర పడుతుంది' అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
20-01-2026
www.prajapaksham.in

టాలీవుడ్‌తో పాటు సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పూజ హెగ్డే తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించడంతో, ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.


# రీల్




## 'కొరియన్ కనకరాజు' టైటిల్ గ్లిమ్స్

నాగబాబు కొణిదెల నట వారసుడు యాక్షన్ సినిమాలపై దృష్టి పెట్టారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన ఫిదా సినిమా సక్సెస్ తరువాత ఆ స్థాయిలో సక్సెస్ కోసం వరుణ్ తేజ్ తాపత్రయపడుతున్నారు. ఈ నేపథ్యంలో మేర్లపాక గాంధీ దర్శకత్వంలో చేస్తున్న సినిమాపై వరుణ్ తేజ్ భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఈ సినిమాకు 'కొరియన్ కనకరాజు'గా నామకరణం చేశారు. వరుణ్ తేజ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను అనౌన్స్ చేశారు. టైటిల్ గ్లిమ్స్‌ను కూడా విడుదల చేశారు. లుంగీ కట్టుకుని, కత్తిపట్టి కొరియన్లను నరికె సన్నివేశాలను టీజర్‌లో పొందుపరిచారు. ఈ టీజర్‌లో కమెడియన్ సత్య, హీరోయిన్ రితిక నాయక్ కూడా కనిపిస్తారు. యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్న సినిమా అనే విషయం ఈ టీజర్‌లో స్పష్టమవుతోంది. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై నిర్మిస్తున్న ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్, ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌గా ఉండబోతోంది. హారర్–కామెడీ, ఇండియన్ అండ్ కొరియన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. కమెడియన్ సత్య మరో కీలమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్, థమన్ కలసి ఈ సినిమా చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రెగ్యులర్‌గా జరుగుతోంది.

## 'చీన్ టపక్ డమ్ డమ్' ప్రారంభం





'శుభం' ఫేమ్ నటుడు గవిరెడ్డి హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'చీన్ టపక్ డమ్ డమ్'. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రముఖ నటి సమంత క్లాప్ కొట్టి పూజ కార్యక్రమాలతో ఈ సినిమాను ప్రారంభించారు. దర్శకులు గోపీచంద్, వశిష్ట, నందిని రెడ్డి, ప్రముఖ రచయిత బివిఎస్ రవి కూడా ఈ కార్యక్రమానికి హాజరై ఈ వేడుకకు హాజరై చిత్ర బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. విలేజ్ టాకీస్ బ్యానర్‌పై నిర్మించబడుతున్న ఈ చిత్రం, ఆ బ్యానర్‌కు ప్రొడక్షన్ నెం.1. ఈ చిత్రాన్ని శ్రీను నాగులపల్లి నిర్మిస్తుండగా, లోహిత్ దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు. బలమైన వాణిజ్య అంశాలతో కూడిన సరికొత్త వినోదాత్మక కథను అందిస్తామని నిర్మాతలు చెప్పారు. సాంకేతిక బృందంలో ఏఎస్ ప్రకాష్, సెంథిల్ కుమార్, సంగీత దర్శకుడు ప్రశాంత్ ఆర్ విహారి, సినిమాటోగ్రాఫర్ నిఖిల్ కొడూరు పని చేస్తున్నారు. ఈ చిత్రానికి తిరుపతి జావా, పిఎస్‌డి విఎఫ్ఎక్స్, దివ్య తేజస్వి, విక్రమ్ కండిమాల వంటి వారి సహకారం అందిస్తున్నారు. 'చీన్ టపక్ డమ్ డమ్' చిత్రం హాస్యం, భావోద్వేగాలతో నిండిన ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా అలరిస్తుందని దర్శకుడు లోహిత్ ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభమవుతుందన్నారు.



'అనగనగ ఒకరాజు' హీరో నవీన్ పోలిశెట్టి, హీరోయిన్ మీనాక్షి చౌదరి తమ సినిమా విడుదలైన థియేటర్స్‌లో తిరిగితున్నారు. సోమవారం విజయవాడలోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. తమ సినిమా మరింత హిట్ కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## యాక్షన్ నేపథ్యంలో 'పల్నాడు'



రోహిత్ వర్మ హీరోగా గోవింద రెడ్డి చందా దర్శకత్వంలో క్రేజీ కింగ్స్ స్టూడియోస్ ఎల్‌ఎల్‌పి బ్యానర్ పై రూపొందుతున్న సినిమా పల్నాడు. యాక్షన్ ఓరియెంటెడ్ సినిమాగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో రియా సుమన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా నిర్మాతలు తాజాగా యాక్షన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. యాక్షన్ నేపథ్యంలో సాగే ఈ సినిమాకు పల్నాడు అని టైటిల్ పెట్టారు. ఎగిరే నిప్పురవ్వల బ్యాక్ డ్రాప్‌లో హీరో మండుతున్న కర్రని పట్టుకొని, పవర్‌ఫుల్‌గా కనిపిసితున్నారు. టైటిల్ లుక్ పోస్టర్ సినిమాపై క్యురియాసిటీ క్రియేట్ చేసింది.ఈ చిత్రంలో హరీష్ ఉత్తమన్, నవీన్ నేని, వినోద్ కుమార్, దేవి ప్రసాద్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్ అందిస్తున్నారు. రవికుమార్.వి డీవోపీ, ఎడిటర్ చోటా కె.ప్రసాద్ పని చేస్తున్నారు.





## 'ఆకాశంలో ఒక తార' టీజర్ రిలీజ్

గీత ఆర్ట్స్ సమర్పణలో స్వప్న సినిమా బ్యానర్‌పై తెరకెక్కుతున్న సినిమా ఆకాశంలో ఒక తార. ఈ సినిమాతో స్వత్విక వీరవల్లి అనే కొత్త హీరోయిన్‌ను పరిచయం చేస్తున్నారు. పవన్ సాధినేని దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఇసినిమా టీజర్ విడుదల చేశారు. హీరోయిన్ సాత్విక వీరవల్లిని పరిచయం చేస్తూ ఈ టీజర్‌ను రిలీజ్ చేశారు. లంగా ఓనిలో అచ్చమైన పదహారణాల తెలుగు అమ్మాయిలా కనిపిస్తోంది సాత్విక. 'నేను ఆకాశంలోకి ఎలా వెళ్ళాలి.. రోడ్డు కూడా సరిగ్గాలేని ఈ ఊరి నుంచి ఆకాశానికి నిచ్చెనేసేశావా.. ముందు ఈ ఊరు పొలిమేర దాటి చూపించు' అనే డైలాగులతో ఈ టీజర్‌ను రూపొందించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఓ ప్రేమకథను తెరకెక్కిస్తున్నట్టు ఈ టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. జీవి ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాను ఈఏడాది వేసవి సెలవుల్లో విడుదల చేయడనికి సన్నాహాలు చేస్తున్నారు.

## బండ్ల గణేష్ 'సంకల్ప యాత్ర'

సంకల్ప యాత్ర పేరుతో సినిమా నిర్మాత బండ్ల గణేష్ షాద్ నగర్ నుంచి తిరుమలకు యాత్రాగా బయలుదేరారు. ఇది రాజకీయ యాత్ర కాదు. దైవ సంకల్పం. దేవుడికి మొక్కుకున్న మొక్కు. దేవుడు నా కోరిక తీర్చినందుకు రుణం తీర్చుకోవడానికి చేస్తున్న యాత్ర ఈ సందర్భంగా అన్నారు ఈ సందర్భంగా మీడియాతో నిర్మాత బండ్ల గణేశ్ మాట్లాడుతూ.. నా యాత్ర ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేదు. నా షాద్ నగర్ ప్రజలు, నాకు ఈ స్థాయి ఇచ్చి, నా జీవితానికి అర్థం చెప్పి, నేనున్నానని ముందుకు నడిపించిన దైవ సమానులు పవన్ కళ్యాణ్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ నేను అడుగు ముందుకు వేస్తున్నాను. చిరంజీవిని చూడాలని హైదరాబాద్‌కు వెళ్లాను. ఆయన నటించిన సినిమా నా థియేటర్లో ఆడుతుంది. నేను పాదయాత్ర మొదలు పెడుతున్నాను ఇది భగవంతుని ఆశీస్సులుగా భావిస్తున్నాను అని అన్నారు. బండ్ల గణేష్‌తో పాటు నటుడు శివాజీ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది



సుధాకర్ చెరుకూరి

మాస్ మహారాజా రవితేజ నటించిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సంక్రాంతికి విడుదలై విజయవంతంగా నడుస్తోంది. ఈ నేపథ్యంలో నిర్మాత చెరుకూరి సుధాకర్ మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' బ్రేక్ ఈవెన్ అయింది చాలా హ్యాపీ. ఆంధ్ర మొత్తం ఆల్మోస్ట్ అయింది. ఇది లాంగ్ వీకెండ్ సోమవారం కూడా హాలిడే. నైజంతో పాటు మిగతా ఏరియాలో కూడా అయిపోతాయి.ఆడియన్స్ నుంచి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అలాగే డిస్ట్రిబ్యూటర్స్ బయ్యర్స్ కూడా చాలా హ్యాపీగా వుండటం మాకు ఎంతో ఆనందం ఇచ్చింది. మేము పండగకి రావాలనే ఈ సినిమాని మొదలుపెట్టాం. 65 రోజుల్లో పూర్తి చేశాం.రెగ్యులర్ రవితేజ సినిమాల కాకుండా పండగకి ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ లాగా ఈ సినిమాని తీసుకురావాలని ఉద్దేశంతోనే ప్రారంభించాం. సినిమాని అడుయన్స్ అద్భుతంగా ఎంజాయ్ చేస్తున్నారు. ఇలాంటి సినిమాలు మరిన్ని చేయాలనే భావిస్తున్నాం. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌కి సంక్రాంతి సీజన్‌లో డిమాండ్ ఉంటుందని ఈ సంక్రాంతితో మరోసారి రుజువైంది.రవితేజ సినిమా అన్నిటికంటే ముందు వస్తుందని మాకు తెలుసు. అందుకే ఇదే సినిమా మీద కాస్త ఎక్కువ ఫోకస్ చేయడం జరిగింది. పారడైజ్‌కి మంచి టీం వుంది. మా సొంత మనుషులు ఉన్నారు. అన్ని సినిమాలు కూడా అద్భుతంగా జరుగుతున్నాయినేను అన్ని కథలో వింటాను. కొంతమందికి వినిపిస్తాను. కథ అనుకున్న తర్వాతే బడ్జెట్లన్ని అనుకుంటాం. నాని నటిస్తున్న పారడైజ్ సినిమా మార్చిలోనే తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. ఇద్దరమైతే ఒకేసారి రాము. మేమంతా ఫ్రెండ్స్. సమ్మర్లో బోలెడంత గ్యాప్ ఉంది. పెద్ద సినిమాలు ఏమీ లేవు. నెలకి ఒక్క సినిమా వచ్చినా చాలు. ఇప్పుడే డిస్ట్రిబ్యూటర్స్ మీద రుద్దేసి తప్పు చేశాం. మళ్ళీ అలా జరగకూడదు. పారడైజ్ అయిపోయిన వెంటనే అది మొదలుపెడతాం. అది పిరియాడిక్ బ్యాక్ డ్రాప్ కథ. నాకు అరుంధతి లాంటి సినిమా చేయాలన్న ఉంది. అలాంటి ఒక కథపై కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. శ్రీకాంత్‌ని దసరాతో పరిచయం చేశాం. అలాగే కేజే క్యూ దర్శకుడు కూడా కొత్తవారే. ఆ సినిమా కూడా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అలాగే దుల్కర్‌తో చేస్తున్న సినిమా కూడా కొత్త దర్శకుడే. దుల్కర్, పూజ హెగ్డే కలిసి చేస్తున్న సినిమా అద్భుతంగా వస్తోంది. దుల్కర్ సినిమా అమెరికాలో దాదాపు 35 రోజులు షూటింగ్ ఉంటుంది. ఇండస్ట్రీలో అందరూ గొప్పగా చెప్పుకునే సినిమా ఒకటి తీయాలని ఉంటుంది. ఆ కల పారడైజ్‌తో తీరిపోతుందని నమ్మకం ఉంది. పారడైజ్ 60 శాతం షూటింగ్ కంప్లీట్ అయింది. ఈ సినిమాని దాదాపు అన్నీ సెట్స్‌లో షూట్ చేస్తున్నాం.

---

# బిసిలకు జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్‌కి బుద్ధి చెబుతాం

### 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం : బిసిజెఎసి చైర్మన్ జాజుల



ప్రజాపక్షం/హైదరాబాద్: బిసిలకు జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. బిసి జెఎసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ముందు బిసిజెఎసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను నమ్మించి మోసం చేస్తుందని, వైఖరి మారకపోతే భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. మేడారంలో జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో బిసి రిజర్వేషన్లపై చర్చించకుండానే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని క్యాబినెట్ నిర్వహించడం, బిసిలను మరోసారి దగా చేయడమేనన్నారు. బిసిలకు ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించాల్సిన బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు సమర్థించడం చాలా సిగ్గుచేటు అన్నారు. మెస్సి ఆట కోసం హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్ గాంధీ బిసిలకు ఇంత అన్యాయం జరుగుతున్న ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కుమ్మక్కై బిసిలకు ద్రోహం తలపెడుతున్నాయని, బిసి రిజర్వేషన్లు తగ్గడానికి, స్థానిక ఎన్నికలు జరగడానికి ఈ రెండు పార్టీలే కారణమని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. చట్టపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం ఇవ్వలేకపోతే బిసి సమాజానికి క్షమాపణ చెప్పి, పార్టీ గుర్తులతో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీపరంగా జనాభా దామాషా ప్రకారం 56 శాతం టికెట్లు ఇస్తామని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లు సాధించుకునే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని, రెండు రోజుల్లోనే జెఎసి సమావేశం నిర్వహించి, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ అధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, బిసి జెఎసి కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కురుమ, బిసి జెఎసి వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, జజుల లింగం గౌడ్, బుదాని సదానందం, మాదేశి రాజేందర్, తారాకేశ్వరి, జిల్లెల నరసింహ, గూడూరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిజం కార్పొరేట్ శక్తుల చేతుల్లో బందీ

### 13వ ఏటనే ఫ్యామిలీ న్యూస్ లెటర్ 'సిర్ బార్'ను ప్రారంభించా
### గతంతో పోల్చితే మీడియాలో మహిళా జర్నలిస్టుల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది
### ప్రధానమంత్రి మాజీ మీడియా సలహాదారు సంజయ్ బారు




ప్రజాపక్షం/హైదరాబాద్: యజమానులే సంపాదకులుగా మారడం ఈనాడు రామోజీరావు నుంచి ప్రారంభమై నేడు జర్నలిజం కార్పొరేట్ శక్తుల చేతుల్లో బందీ అయిపోయిందని ఎకనామిక్ టైమ్స్ మాజీ సంపాదకులు, ప్రధానమంత్రి మాజీ మీడియా సలహాదారు సంజయ్ బారు అన్నారు. అప్పట్లో జర్నలిస్టులంటే పత్రిక సంస్థల చైర్మన్లకు సైతం అపారమైన గౌరవం ఉండేదని, ఇప్పుడు ఓ జర్నలిస్టు ఎడిటర్‌ను కలవాలంటేనే భయపడే పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వయోధిక పాత్రికేయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన 'అనుభవాలు–జ్ఞాపకాలు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర సమాచార హక్కు మాజీ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షులు దాసు కేశవరావు, కార్యదర్శి కె.లక్ష్మ ణ్ రావు, నాయకులు ఉడయవర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ బారు మాట్లాడుతూ.. దేశంలో కార్పొరేట్ మీడియా పెరిగిందని, పెత్తనమంతా యాజమాన్యాల చేతుల్లోకి వెళ్లాయన్నారు. ప్రస్తుతం మీడియా అనేది కార్పొరేట్ వ్యవస్థ చేతుల్లో ఉందని, అదాని, అంబానీ లాంటి వారు మీడియా సంస్థలను నిర్వహిస్తున్నారన్నారు. ఎలాంటి వార్తలు రావాలన్న యాజమాన్యం పెత్తనం ఉంటుందని, స్వతంత్రంగా పోయే అవకాశం ఉండదన్నారు. 'గతంలో హైదరాబాద్‌లో ఏమి జరుగుతుందో గ్రామాలలో ఉన్న జనానికి, ఊర్లలో ఏమి జరుగుతుందో హైదరాబాద్ ప్రజలకు తెలిసేది కాదు. తమ గ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువులకు సమాచారం తెలియజేసేందుకు తొలిసారిగా తన 13 ఏటనే తన తల్లి, తండ్రి పేర్లను కలుపుతూ ఒక ఫ్యామిలీ న్యూస్ లెటర్ 'సిర్ బార్'ను ప్రారంభించాను. ఆ విధంగా తాను జర్నలిజంలో ప్రవేశించాను. అనంతర కాలంలో న్యూస్ టైమ్ ఎకనామిక్ ఎడిటర్‌గా ఉన్న తాను ఎన్‌టిఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై విమర్శనాత్మక వ్యాసం రాశాను. అయితే అది మరుసటి రోజు పత్రికలో ప్రచురితం కాలేదు. ఎందుకని ఆరా తీస్తే రాజమోజీరావు నిలిపివేయమని చెప్పారు. వెంటనే తాను తన కాలమ్‌ను ఉపసంహరించుకున్నాను' సంజయ్ బారు వివరించారు. భారత ప్రధాని చంద్రశేఖర్ తొలి సారిగా రుణం కోసం ఐఎంఎఫ్ వద్ద దరఖాస్తున్న విషయాన్ని తాను తొలిసారిగా బ్రేకింగ్ వార్తను రాశానని తెలిపారు. తాను జర్నలిజం చదువుకోకపోయినప్పటికీ ఆర్థికవేత్తగా ఉన్న తాను అనుభవంతో జర్నలిస్టుగా మారానని, అప్పటి నుంచి రాజకీయాల గురించి రాయడం మొదలు పెట్టానని చెప్పారు. ఇటీవల మీడియాలో మహిళా పాత్రికేయుల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగిందని, గతంలో ఒకరిద్దరు తప్ప పెద్దగా చెప్పుకోదగిన సంఖ్యలో మహిళా జర్నలిస్టులు లేరన్నారు. తాను ఎక్కడా జరల్నిజంలో చదువుకోలేదని, ప్రతితీ ఉద్యోగ సమయంలోనే నేర్చుకున్నానన్నారు. అప్పటీ వరకు బడ్జెట్ లోటు పాట్లు ఆర్థిక వ్యవహారాలపై మాత్రమే వార్తలను రాసిన తాను ఆ తర్వాత రాజకీయ వార్తలపై కూడా దృష్టి సారించానన్నారు.

---

## లేరనుకుంటోంది

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారాలు సాధించడానికి లేదా త్వరిత పరిష్కారాలు సాధించడానికి ఉపయోగపడుతుందా? అని ఆయన ప్రశ్నిస్తూ, ఈ రెండు విషయాలపైనా చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఐక్యరాజ్యసమితిలో ఉన్న 193 సభ్యదేశాలకు ఉన్న సమస్యలను, సంఘర్షణలను, నాటకీయ సవాళ్ళను పరిష్కరించడానికి సమితిలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. తనను శిక్షించేవారు లేరని, తాను శిక్షకు అతీతమని అమెరికా భావిస్తోందన్నారు. అంతర్జాతీయ చట్టాలకు తాను అతీతమని అనుకుంటూ అమెరికా ప్రభుత్వం శిక్షార్హత లేకుండా వ్యవహరిస్తోందన్నారు. అంతర్జాతీయ చట్టం కంటే తన అధికారమే ముఖ్యమని భావిస్తున్న అమెరికా తనకు శిక్షార్హత లేదన్నట్టు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బహుళ పక్షాలు కలిసి కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా పరిష్కారాలు సాధించడం అసంబద్ధమైన విషయమని అమెరికా ఒక స్పష్టమైన నమ్మకంతో ఉందని గుటెర్రెస్ విమర్శించారు. అమెరికా కొన్నిసార్లు తన శక్తిని, ప్రభావాన్ని ఉపయోగించడం అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే జరిగిందని కూడా సమర్థించారు. వెనిజులాపై దాడిచేసి ఆ దేశాధ్యక్షుడిని, ఆ దేశ తొలి మహిళను కిడ్నాప్‌చేసి తన దేశ జైలుకు తరలించడం, గ్రీన్‌లాండ్ దీవి వ్యూహాత్మకంగా తమ అధీనంలోనే ఉండాలని డోనాల్డ్ ట్రంప్ మొండి వాదనలు చేయడం వంటి పరిణామాల తర్వాత చాలా రోజులకు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి పైవిధంగా స్పందించారు. ఐతే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో ఐక్యరాజ్యసమితిపై తీవ్ర విమర్శలు చేశారు. దాని మనుగడను కూడా ప్రశ్నించారు. గత ఏడాది సెప్టెంబరులో జరిగిన జనరల్ అసెంబ్లీ సమావేశంలో డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి మూల లక్ష్యాలను ప్రశ్నించారు. తాను స్వయంగా ప్రపంచంలో వివిధ దేశాల మధ్య ఏడు యుద్ధాలను ఆపాననీ, ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి తనకు సహాయం చేసేందుకు కూడా ముందుకు రాలేదని, ఇక దానితో తాను 'ఐక్యరాజ్యసమితి ఉన్నది మనకోసం కాదని భావించా' అనుకున్నాని ట్రంప్ చెప్పారు.

## ప్రతి ఇల్లూ మారాలి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి ఖర్చులు భరిస్తూ ఏర్పాటు చేసిన సోలార్ మోడల్ విలేజ్ కార్యక్రమం ఓ ప్రత్యకమైంది తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 81 గ్రామాల్లో ఈ పైలెట్ ప్రాజెక్టు చేపట్టామని, కొడంగల్, బోనకల్ మండలాల్లో పూర్తిగా రాష్ట్రంలో మిగిలిన కొన్ని గ్రామాల్లో ఈ పైలెట్ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. ఇళ్లపై పై కప్పుల పైన మాత్రమే కాకుండా వ్యవసాయ పంపు సెట్ల పైన సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 81 గ్రామాల్లో రూ.1,380 కోట్లు ఈ కార్యక్రమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తుందని తెలిపారు బోకల్ మండలంలోని 22గ్రామాలకు గాను రూ.306కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. బోనకల్ మండలం రావినూతల గ్రామంలో రూ.24కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. సంవత్సరం మొత్తం మీద సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఒక కుటుంబం రూ.14వేల వరకు ఆదా చేసుకునే అవకాశం కలుగుతుందని, ఉత్పత్తి అయిన సోలార్ విద్యుత్‌ను ఇంటి అవసరాల కోసం వాడుకునేది వాడుకోగా సంవత్సరం మొత్తంగా కనీసం 1086 సోలార్ విద్యుత్ యూనిట్లను యూనిట్‌కు రూ. 2.57 చొప్పున విద్యుత్ సంస్థలకు విక్రయిస్తే సంవత్సరంలో ఒక కుటుంబానికి కనీసంగా నాలుగు నుంచి ఐదు వేల రూపాయలు మిగులుతుందని వివరించారు. ఇప్పటి వరకు మనం విద్యుత్ సంస్థలకు డబ్బులు చెల్లించాం కాని ఇక నుంచి విద్యుత్ సంస్థలే ప్రజలకు డబ్బులు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ప్రణాళికలు రూపొందించిందని భట్టి వివరించారు. రైతులు కూడా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునే విధంగా ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తిని రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని తెలిపారు. ముందుగా రావినూతల గ్రామంలో ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంట్ పనితీరును విద్యుత్ శాఖ రెడ్కో అధికారులతో కలిసి డిప్యూటీసిఎం భట్టి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి, రెడ్కో ఎండి అనీలా, కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి పేదవానికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని భరోసా ఇచ్చారు. సోమనపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, చెన్నూర్‌లో 100 పడకల ఆసుపత్రి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. జైపూర్ పవర్ ప్లాంట్ విస్తరణ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం 20 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, రైతు భరోసా, బీమా పథకాలను పకడ్బందీగా అ మలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ పనులను వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 214 స్వయం సహాయక సంఘాలకు రూ.76.65లక్షల చెక్కును మంత్రులు అందజేశారు. పట్టణంలోని పలు వార్డులలో ముదిరాజ్ భవనం, బైపాస్ సిసి రోడ్లు, ఆస్పిరేషన్ టాయిలెట్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యత

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ నితికా పంత్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎంఎల్‌ఏ పాల్వాయి హరీష్ బాబులతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ వారి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడుతున్నామని చెప్పారు. జిల్లాలో విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషి చేసిన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సిర్పూర్ ఎంఎల్‌ఏ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణానికి 100 పడకల ఆసుపత్రి మంజూరు కావడం సంతోషకరమన్నారు. పట్టణంలో మౌలిక వసతుల కోసం 18 కోట్లు, తాగునీటి సరఫరా కోసం 35 కోట్ల రూపాయలు కేటాయించినట్లు వివరించారు. కాగజ్‌నగర్, కౌటాల కేంద్రాల్లో డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుతో ఈ ప్రాంత బాధితులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, డిఎఫ్‌ఓ నీరజ్ కుమార్ టిబ్రెవాల్, డిఎంహెచ్‌ఓ సీతారాం, మార్కెట్ కమిటీ చైర్మన్ సుద్దాల దేవయ్య, డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com